


గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
కాత్యాయని
ప్రతాప వెంకట సుబ్బారాయుడు




ప్రోలోగ్

సృష్ట్యాదిలో పురుషులు, స్త్రీలు లేరు.

బ్రహ్మదేవుడు తను రూపకల్పన చేసిన సృష్టిని, సరస్వతీదేవితో వీక్షిస్తున్నాడు-

హిమాలయాలు, ఎడారి భూములు, లోయలు, భూమ్మీద మూడొంతులుగా పరచుకున్న సముద్రం, ఆకాశాన్నంటే ఎత్తైన కొండలు, పైనుంచి కిందకు దూకే జలపాతాలు, ఒంపులు సొంపులతో ప్రవహించే నదీనదాలు, స్వచ్ఛమైన తేట నీటిలో చెరువులు, వాటిలో మొగ్గలు, సంపూర్ణంగా విచ్చుకున్న కలువలు, గడ్డితో పచ్చటి తివాచి పరచినట్టున్న భూమి, వనాలు, కొమ్మలు, రెమ్మలతో విశాలంగా పరచుకున్న పచ్చనిచెట్లు, వాటికి అందమైన పుష్పాలు- కాయలు.. ఆకాశం నుంచి భూమిలో తను సృజించిన ప్రకృతిని సంతృప్తిగా చూస్తున్నాడు.

అప్పుడే సంపూర్ణంగా వికసించి, సౌరభాలు వెదజల్లుతున్న పుష్పం వారిద్దరి కంటా పడింది.

"చూశారా స్వామీ! రేకులన్నీ పరిపూర్ణంగా విచ్చుకుని, సుగంధాలు వెదజల్లుతున్న ఆ పుష్పాన్నొక్కదాన్ని చూస్తే చాలు మీ సృష్టి యావత్తూ నాకు అవగతమై అమితానందం కలుగుతోంది. విష్ణువు, శివుడు ఎవ్వరూ చేయలేని సృజన ఇది. నాకు గర్వాతిశయం కలుగుతోంది" అంది సరస్వతి ఆశ్చర్యానందాలకు లోనవుతూ.

"దేవీ, సృష్టి నిర్వహణకు మేము ముగ్గురం ముఖ్యమే. అది మాకు ఆదిశక్తి అప్పగించిన బాధ్యత అని నీకూ తెలుసుగా!"అన్నాడు.

"ఏదేమైనా సృష్టి ఉంటేనేగా స్థితి, లయల అవసరం. మీరే సృష్టికి ఆద్యులు. మీ భార్యగా అది నాకు గర్వకారణం, అంతే!" అంది శారదమ్మ.

ఆమెతో వాదించడం అనవసరమనుకుని నవ్వి ఊరుకున్నాడు.

కొద్దిసేపట్లో సరస్వతీదేవి మళ్లీ మామూలు స్థితికి వచ్చింది. ఆమెతో కలిసి మళ్లీ భూలోకాన్ని చూడసాగారు.

ఇందాక ఏ పువ్వునైతే చూస్తున్నారో దానిపైనే మళ్లీ దృష్టి సారించారు.

"పువ్వుకు సువాసన అద్దడం మీకే చెల్లింది. మీ సృష్టి అద్భుతం, అది నిర్వివాదాంశం" అంది ప్రశంసాపూర్వకంగా అంతలో ఎక్కడి నుంచో ఒక తుమ్మెద 'ఝుమ్మని' ఒంపులు తిరుగుతూ ఎగురుకుంటూ వచ్చి ఆ పువ్వుచుట్టు రెండు మూడు సార్లు తిరిగి దానిపైకి ఒరిగింది. సరస్వతీమాత బుగ్గలు ఎర్రబడ్డాయి.

"అది సృష్టి కార్యం, నా సృష్టి నిరంతరం సాగాలని నీకూ తెలుసుగా" అన్నాడు ఆమె సిగ్గుపడితే ఆ బుగ్గలు ఎర్రబడ్డాయనుకుని.

కొన్ని క్షణాల తర్వాత మధువును గ్రోలిన తుమ్మెద మత్తుగా పువ్వుపై నుంచి లేచి గాల్లో ఒంపులు తిరుగుకుంటూ ఎక్కడికో వెళ్లిపోయింది.

తన దివ్యజ్ఞానంతో పువ్వు మనసును చదివింది. ఆమె కళ్లు ఎర్రబడ్డాయి. కోపంతో ముఖం జేవురించింది. ముక్కుపుటాలు పెద్ద

ఎత్తున సంకోచ, వ్యాకోచాలు చెందసాగాయి.

ఆమెలో వచ్చిన మార్పు బ్రహ్మను అయోమయానికి, ఆందోళనకూ గురిచేసింది.

'అప్పటిదాకా ప్రకృతిలోని అందాలని చూస్తూ పరవశించిన సరస్వతీదేవిలో ఉన్నట్టుండి ఆ మార్పు ఎందుకు వచ్చింది? ఆ కోపమేమిటి?'

ఆయన ఆలోచనలో ఉండగానే ఆమె విసురుగా లేచి లోపలికి వెళ్లిపోయింది.

ఆ వెనకే హడావుడిగా బ్రహ్మ 'సరస్వతీ..'అంటూ వెంబడించాడు.

ఆమె వెళ్లి దూరంగా ఉన్న పర్వతాల మధ్యన కూర్చుండిపోయింది.

ఆమె పక్కనే కూర్చుంటూ' ఇలా చెప్పకుండా లేచి రావడం భావ్యమా? నీ మనసులో ఏదన్నా ఉంటే, నాకు చెబితే, ఇద్దరం ఆ విషయం మాట్లాడుకోవచ్చుగా' అన్నాడు దీనంగా.

'మీకు తెలియదా? అవునులే, దేవలోకంలో ఉన్నా మీరూ మగాల్లేగా' అంది.

'సూటిగా చెప్పు సరస్వతీ, నీ మనసులో ఏవుందో నాకెలా తెలుస్తుంది? పైగా నాకు తెలుసని అభాండం వేస్తున్నావు' ఆమె బ్రహ్మవంక సూటిగా చూస్తూ 'ఆ తుమ్మెద గొప్పతనమేమిటి? పువ్వు బేలతనమేమిటి? ఇదేనా మీ సృష్టి? ' వెటకారంగా అంది.

'నువ్వే కదా సరస్వతీ కొంతసేపటి క్రితం నా సృష్టి అద్భుతంగా ఉందని మెచ్చుకున్నావు. విష్ణువు కన్నా, శివుని కన్నా నేనే గొప్పన్నావు'

'అన్నాను. ఒక భార్యగా గర్వించాను. కానీ అక్కడ జరిగింది చూశాక ఒక స్త్రీగా గర్హిస్తున్నాను'

‘అంటే?’


ఆ పువ్వు పరిపూర్ణంగా విచ్చుకుంటే, ఎక్కడి నుంచో వచ్చిన తుమ్మెద, ఆ పువ్వు ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా, దానిపై వాలి బల..వం..తం..గా మకరందం గ్రోలడం. పాపం ఆ పువ్వు అయిష్టత వ్యక్తం చేయలేదు, ప్రతిఘటించనూ లేదు. ఇదా మీ సృష్టి’ ఎగతాళిగా అంది.

బ్రహ్మ ఆలోచనలో పడిపోయాడు.

తర్వాతి రోజునుంచి ఆ అసమానతను సరిజేయడానికి రకరకాల జంతువులను సృష్టించాడు. అన్నీ సమానంగానే బతుకుతూ సృష్టికార్యంలో భాగం వహిస్తూ ఇబ్బడిముబ్బడిగా సంతానోత్పాదన చేస్తూ నిరాటంకంగా, అప్రతిహతంగా తమ సంతతిని వృద్ధిచేసుకోసాగాయి. తేడాలు, బేధాలు లేని జీవనం వాటిది.

సరస్వతీదేవి కూడా తన భర్త, చేసిన తప్పు దిద్దుకుని కొత్త జీవాల సృష్టి, అదీ ఒక్క ప్రత్యుత్పత్తి  తేడా తప్ప అంతా సమానమే, అన్నీ సమానమే, అన్నంత  గొప్పగా జీవుల్ని సృజించాడు. ఆమె పెదవులు విడీవిడనట్టు సంతోషంగా నవ్వింది. బ్రహ్మ మనసు మురిసింది.

జంతువుల్లోని కోతులు మాత్రం అభివృద్ధి దిశగా అడుగులేస్తూ మనుషులయ్యాయి. అక్కడే మొదలైంది అసలు కథ!




యథాప్రకారం సూర్యుడుదయించాడు.

రామనామ కాలనీ బద్ధకంగా ఒళ్లు విరుచుకుంది.

ఆ కాలనీలో ఓ నాలుగొందల గజాల స్థలం, చుట్టూతా కర్రలతో కట్టిన దడి, చెక్క గేటు, మధ్యలో తెల్లటి సున్నం వేసిన చక్కటి రెండుగదుల ఇల్లు. ఇంటి చుట్టూ రక రకాల పూలు, పళ్ల మొక్కలు చూడంగానే ఎవరికైనా అందులో ఉండాలనిపిస్తుంది. ఆ ఇంట్లో అచ్యుతరామయ్యగారు, ఆయన భార్య యశోదమ్మ. కూతురు కాత్యాయని ఉంటారు. ఆ స్థలానికి యజమాని ఆనందరావు, ఒకప్పుడు అచ్యుతరామయ్యగారి సహోద్యోగి. ఆనందరావు మారిషస్ లో జాబ్ రావడంతో ఆ స్థలం ఎవరైనా కబ్జా చేస్తారేమోనన్న భయంతో రెండు గదులు వేసి, అచ్యుతరామయ్యగారి మంచితనం, నిజాయితీ చూసి తను తిరిగొచ్చేవరకూ అ ఇంట్లో ఉచితంగా ఉండి, ఆ స్థలాన్ని భద్రంగా కాపాడే బాధ్యతను ఆయన మీద పెట్టాడు.

అచ్యుతరామయ్యగారికి నలభై ఏళ్లు కొద్దిగా బక్కగా, దబ్బపండు ఛాయతో ఉంటాడు. సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ పాటించే నిఖార్సయిన మనిషి. పద్దెనిమిదేళ్ల పాటు ఓ ప్రైవేటు సంస్థలో సీనియర్ టెక్నీషియన్ గా పనిచేసి, ఆ సంస్థ రెండేళ్ల క్రితం

ఆర్థికంగా పతనమవడంతో బయటికొచ్చేశాడు. మొదటి నుంచి పొదుపరి అవడంవల్లనూ, డబ్బును జాగ్రత్తగా దాచుకోవడంవల్లనూ ఆ కుటుంబం పెద్దగా ఇబ్బంది పడలేదు. అచ్యుతరామయ్యగారు తనకు వచ్చిన పి ఎఫ్, గ్రాట్యుటీ డబ్బును పోస్టాఫీసులో వేసి, నెల నెలా ఇంట్రస్ట్ వచ్చేలా చూసుకున్నాడు.

దానికితోడు ఓ చిన్న కంపెనీలో తక్కువ జీతం వచ్చే ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య యశోదమ్మకి భర్త ఎంత చెబితే అంత. పెళ్లి చేసుకుని అత్తింట అడుగుపెట్టాక ఇహ పుట్టింటి ఊసెత్తలేదు ఆవిడ. సాక్షాత్తూ భర్తలో సగభాగం పొందిన పార్వతీదేవే! ఇహ కూతురు కాత్యాయని పసిమి ఛాయతో మెరిసిపోయే కుందనపు బొమ్మ. తల్లిదండ్రుల చాటు బిడ్డ. తండ్రి ఆమెను టెంత్ వరకే చదివించి 'చూడమ్మా, ఏదో నాకొచ్చే సంపాదనతో గుట్టుగా సంసారం లాక్కొస్తున్నాను. నిన్ను ఇంతకు మించి చదివించలేకపోడానికి ఇదో కారణం. ఇంకో కారణం ఏంటంటే ఇవాళ రేపటి రోజులు బాగాలేవు. బయటి వాతావరణం ఆడపిల్లలకు అస్సలు క్షేమకరంగా ఉండట్లేదు.

ఆడపిల్లల్ని కొడవళ్లతో నరకడాలు, వాళ్ల ముఖాలపై ఆసిడ్ పోయడాలు, ఏంటమ్మా, ఈ దారుణాలు? పేపర్లలో చదువుతూ, టీవీల్లో చూస్తున్నప్పుడల్లా ప్రతి ఆడపిల్ల తండ్రి ఒళ్లూ గగుర్పొడుస్తోంది. అంతా అయ్యాక ఆ ఘాతుకాలకు ఒడిగట్టిన కుర్రాళ్లని ఉరి తీసినా, పోయిన అమ్మాయిల ప్రాణాలు తిరిగొస్తాయా? అల్లారు ముద్దుగా పెరిగిన కూతురు తిరిగిరాని లోకాలకి వెళ్లిపోతే, అన్నేళ్లూ పెంచిన ఆ తల్లిదండ్రులు పుట్టెడు దుఃఖంతో ఏమైపోవాలమ్మా? అందుకే తెలివైన దానివైనా నిన్ను పై చదువులు చదివించలేని అసమర్థుడుగా మారాడు ఈ తండ్రి. అంతేకాకుండా ఉన్నతమైన చదువులు చదివిస్తే, నీ కన్నా పెద్ద చదువు చదివిన కుర్రాడిని బోలెడంత కట్నం ధారబోసి తేలేని అశక్తుణ్ని. ఏవనుకోకమ్మా' అని చెమ్మగిల్లిన కళ్లను తుండుగుడ్డతో తుడుచుకున్నాడు. తండ్రి మాటలతో మనసుభారమైన కాత్యాయని, ఆయన మాటకు కట్టుబడింది.

అచ్యుతరామయ్యగారి కుటుంబం రోజూ నాలుగున్నరకే లేస్తుంది. యశోదమ్మ, కూతురు కాత్యాయనీ లేచి వాకిల్లోని కసువు ఊడ్చి, ఇల్లు శుభ్రంగా తడిగుడ్డతో తుడిచి, దేవుని విగ్రహాలు, సామాగ్రీ కడిగి శుభ్రంచేసి ఇంటిల్లిపాదీ స్నానాలు చేసి, పెరట్లోని మందార, చామంతి, తులసీదళాలు కోసి, దాదాపు గంట సేపు మనసుపెట్టి పూజచేస్తారు. దేవుళ్లు కొలువుండే షెల్ఫ్ పసుపు, కుంకుమ, పూల అలంకరణతో కనులపండువగా ఉంటుంది. ఇది ఏ ఒక్కరోజో జరిగే తంతు కాదు నిత్యకృత్యం. అందుకే వాళ్లు సాధారణంగా ఎక్కడికీ వెళ్లరు. వెళ్లినా ఒకటి రెండు రోజుల్లో ఇంటికొచ్చి తమ నిత్యకృత్యాల్లో పడిపోతారు.

ఆరోజు కూడా-

'అమ్మా, కాత్యాయని పూజకు అన్నీ సిద్ధం చేశావా?' అన్నాడు అచ్యుతరామయ్యగారు.

'ఇందాకే దేవుళ్లకు బొట్లు పెట్టి దీప, ధూపాలు వెలిగించి పూజకు అన్నీ సిద్ధం చేశాం నాన్నగారూ' అంది కాత్యాయని.

అచ్యుతరామయ్యగారు అక్కడికి వచ్చి పీటమీద కూర్చుని ఆచమ్యానికి సిద్ధమై 'ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణాయ స్వాహా, ఓం మాధవాయ స్వాహా..'అంటూ ఎడం చేతిలో ఉద్ధరిణి పట్టుకుని, దాంతో పంచపాత్రలోని నీటిని తీసుకుని కుడిచేతిని గోకర్ణంలా చేసి అందులో పోసుకుని చప్పుడు చెయ్యకుండా నోట్లో పోసుకున్నాడు. తర్వాత యథావిధిగా షోడశోపచార పూజ చేశాడు. దేవునికి బెల్లం ముక్క నైవేద్యం పెట్టి, హారతిచ్చాడు. హారతిని అందరూ కళ్లకద్దుకున్నాక తీర్థ ప్రసాదాలు తను తీసుకుని భార్యకి, కూతురికీ ఇచ్చి సంతృప్తిగా తను పూజ చేసిన దేవుళ్ల వంక చూసి "అసలు మనిషి పూజ ఎందుకు చెయ్యాలో తెలుసామ్మా? 'ఈ సకల చరాచర సృష్టిని సృజించిన నీముందు నేను పిపీలికామాత్రుణ్ని, మేము బతకడానికి పంచభూతాలు, అనేక వనరులు ఇచ్చావు. ఇదిగో నీ గొప్పతనాన్ని గుర్తించి మనస్ఫూర్తిగా మేము పూజచేసి మా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. మమ్మల్ని కాస్త కనిపెట్టుకుని ఉండు' అని విన్నవించుకోవడం. భగవంతుణ్ని సదా స్మరించే వ్యక్తికి ఆభిజాత్యం తలకెక్కదు. రుజువర్తనతో, మానవతామూర్తిగా ఉంటాడు" అని లేచి నుంచున్నాడు.

"అన్నట్టు ఇవాళ ఆదివారం కదూ, పదకొండుగంటలకి మనమ్మాయిని చూసుకోడానికి పెళ్లివారొస్తారని వేణుగోపాలస్వామి ఆలయం పూజారి చెప్పాడు కదా. కాస్త వెలుగొచ్చాక నేను బయటకి వెళ్లి స్వీటు, హాటు పట్టుకొస్తాను, ఇంకా ఏవన్నా కావాలా?" భార్యని అడిగాడు.

వద్దన్నట్టుగా తలూపిందావిడ.

టేప్ రికార్డర్ లో సన్నగా ఆదిత్య హృదయం పెట్టాడు.

అంతలో పాలతను తలుపు కొట్టడంతో గిన్నెతో వెళ్లిన ఆవిడకి పాలుపోస్తూ 'ఇలా పొద్దుగాల్నే మీ ఇంట్లో పాలుపోయడానికి వచ్చి అగరొత్తుల పొగ పీలుస్తూ, సన్నగా ఇనిపించే దేవుడి పాటలు ఇంటే మనసెటో పోతది, రోజట్టే గడిసిపోతదమ్మా'అని చెప్పాడు. ఆవిడ "బాబూ ఇవాళ ఇంకో లీటరు పాలు ఎక్కువ పోయవూ, అమ్మాయిని చూడ్డానికి మగపెళ్లి వారొస్తున్నారు" అంది. "అట్టాగా అమ్మా, ఇదిగోండి, ఇంకో అరలీటరు ఎక్కువే పోస్తన్నాను. ఎంతమందొస్తారో మీకు తెలవదు కదా!"అని పాలు పోసి వెళ్లిపోయాడు. పది నిముషాల తర్వాత వచ్చిన పేపరతను అచ్యుతరామయ్యగారికి పేపరిస్తూ "అందరికీ పేపరు ఇళ్లలోకి ఇసిరేత్తా, మీకు మాత్రం ఇట్టా సేతుల ఇవ్వబుద్ధవుతాది. మీ ఇల్లు గుడిలెక్క గొడతదయ్యా' అని వెళ్లిపోయాడు. ఆ మాటలు రోజూ వాళ్లూ అనడం. వినడం మామూలైంది. సమాజంలో ఆర్థిక అసమానతలు ఉండొచ్చుగానీ మనుషుల మధ్య ఉండకూడదన్నది అచ్యుతరామయ్యగారి సిద్ధాంతం.

ఆయన బయటకెళ్లి స్వీటూ, హాటూ కొనుక్కొచ్చాడు.

సూర్యుడు ఆకాశంలో పైపైకి ఎగబాకుతూ సమయం పది నిముషాలు తక్కువ పదకొండుకు చేర్చాడు. మనుషులతో సహా ఇల్లంతా పెళ్లివారికోసం ముస్తాబైంది.

పదకొండుగంటల ఐదు నిముషాలు.

వారింటి గేటు ముందు కారు ఆగింది.

ఆ చప్పుడు విని గేటు తియ్యడానికి వేగంగా వెళ్లాడు అచ్యుతరామయ్యగారు.




చెక్కగేటు తీసి బయటకెళ్లాడు.

ఆగిన కారులోంచి ఆరడుగుల పొడుగులో, సుమారు నలభై అయిదేళ్ల వయసు, చామన ఛాయతో ఉన్న వ్యక్తి ముందుగా కారు దిగి అచ్యుత రామయ్యను నవ్వుతూ చూశాడు. ఆయన తర్వాత ఒంటి నిండా నగలతో, ఆకు పచ్చ రంగు పట్టు చీరలో, కొద్దిగా పసిమి ఛాయతో భారీ పర్సనాల్టీ గల ఒకావిడ, మాంచి కలరుతో, ఆరడుగుల పొడవు, ముఖాన నవ్వే కళ్ల జోడులో కళగా ఉన్న ఒక యువకుడూ దిగారు. వీళ్లు దిగుతుండగానే వీళ్ల కారు వెనకాల మరో కారు ఆగి, అందు లోంచి చూడ ముచ్చటగా ఉన్న జంట దిగింది. వాళ్లనూ, వాళ్ల స్థాయినీ చూశాక 'తను వాళ్లకి సరి తూగ గలడా? అయ్య వారు మంచి సంబంధం ఉందన్నారు గాని మరీ ఇంత గొప్ప సంబంధం అని చెప్ప లేదు' అచ్యుత రామయ్య గారి మనసులో తీవ్ర స్థాయిలో ఆలోచనలు సుళ్లు తిరిగాయి.

'రండి, రండి' అని లోపలికి సాదరంగా ఆహ్వానించి " యశోదా, పెళ్లి వారు వచ్చేశారు' అని లోపలికి తీసుకెళ్లి కుర్చీల్లో కూర్చో బెట్టి, ఫ్యాన్ వేసి 'తమ ఇంటిని చూడం గానే వాళ్లలో ఏవన్నా అయిష్టతా భావం కలిగి, అది వాళ్ల ముఖంలో ప్రతిఫలిస్తుందేమో'నన్న భయంతో అందరి ముఖాల్లోకీ ఆందోళనగా చూశాడు. తననుకున్నట్టుగా కాకుండా వాళ్ల ముఖాలు నిర్మలంగా ఉన్నాయి. 'హమ్మయ్య' అనుకున్నాడు. వాళ్లకి కాళ్లు కడుక్కోడానికి నీళ్లు ఇచ్చి, వాళ్లు కాళ్లు కడుక్కున్నాక లోపలికి తీసుకెళ్లి కుర్చీల్లో కూర్చోబెట్టాడు. యశోదమ్మ వాళ్లకు మంచి నీళ్లు తెచ్చిచ్చింది.

"ఇక్కడికి రావడంలో ఇబ్బందేం కలగలేదుగా" అడిగాడు అచ్యుత రామయ్య గారు.

"లేదండి, నా స్నేహితుడు ఈ కాలనీ లోనే ఉంటాడు, వాళ్లింటికి ఎన్నో సార్లు వచ్చాను. అన్నట్టు నా పేరు శ్రీకర్ రావు, ఈమె నా భార్య ప్రణతి. మా అబ్బాయి యశో భూషన్, వాడు నా తమ్ముడు శ్రీధర్, ఆమె అతని భార్య తులసి" అని కుటుంబ సభ్యుల్ని పరిచయం చేశాడు.

అచ్యుత రామయ్యగారు కూడా తన భార్యని పరిచయం చేస్తుండగా, కాఫీ కప్పులూ, పక్కనే సుగరు ఉన్న చిన్న స్టీలు డబ్బా ఉంచిన ట్రే తెచ్చి టీపాయ్ మీద పెట్టింది. "మీకు సుగరు ఎలా కావాలో చెబితే, అలా వేసి, కలిపిస్తుంది మా అమ్మాయి కాత్యాయని, సుగర్లు కదండీ, కాఫీలో సుగరు కలిపిచ్చే స్వేచ్ఛ ఉండడం లేదు" అన్నాడు నవ్వుతూ.

"అవునవును. మీరన్నది నిజమే! దేవుడి దయవల్ల మాకింత వరకూ సుగరు, బీపీ, థైరాయిడ్ వంటి సమస్యలు లేవు" అని నవ్వాడాయన. కాత్యాయని అందరి కప్పుల్లో రెండు చెంచాల సుగరు వేసి అందిస్తుంటే. " నువ్వూ కూర్చోమ్మా, చక్కగా అందరం మాట్లాడుకుందాం" ప్రణతి నవ్వుతూ లేచి కాత్యాయని చేయి పట్టుకుని తన పక్కన ఉన్న కుర్చీలో కూర్చోబెడుతూ అంది.

కాత్యాయని సిగ్గుల మొగ్గవుతూ ఆవిడ పక్కన కూర్చుంది.

"అయ్య వారు గుడిలో పనులు ముగించుకుని కొద్ది సేపట్లో ఇక్కడికి వస్తానన్నారు. ఆయనే మీ గురించి చెబుతూ మంచి సంప్రదాయక కుటుంబమనీ, అమ్మాయి సాక్షాత్తు సీతమ్మ వారేనని చెప్పారు. నిజానికి ఇలాంటి సంబంధం కోసమే చాలా కాలంగా చూస్తున్నాం. దేవుడు తన పూజారిని ఇలాంటి మంచి సంబంధం విషయమై మా దగ్గరకు పంపించినట్టు అనిపించింది.

నేను ప్రైవేటు బ్యాంకులో క్లార్క్ గా పనిచేస్తున్నాను. మా ఆవిడ హౌస్ వైఫ్, మా తమ్ముడు ప్రైవేట్ కాలేజిలో లెక్చరర్ గా పని చేస్తున్నాడు. అతని భార్యా అదే కాలేజిలో జూనియర్ లెక్చరర్ గా పని చేస్తోంది. వాడికి నేనంటే చాలా ఇష్టం. అందుకే లక్ష్మణుడిలా అన్ని విషయాల్లోనూ నన్నంటి పెట్టుకునే ఉంటాడు" అని నవ్వాడు.

"నాపేరు అచ్యుత.." చెప్ప బోతుంటే "మీ గురించి మొత్తం అయ్య వారు చెప్పేశారు. మళ్లీ పరిచయాల పర్వం ఎందుకండీ" అన్నాడు శ్రీకర్ రావు.

"ఏరా యశో, అమ్మాయి నచ్చిందా?" అడిగింది ప్రణతి వాళ్లబ్బాయిని.

అతను కాస్త మొహమాట పడ్డాడు.

"అమ్మాయీ నువ్వు కూడా మా అబ్బాయిని చూడు. మీరు ఒకరికొకరు నచ్చాకే, మిగతా మాటలు "అంది.

కాత్యాయని అత్తిపత్తయింది.

ఇలా జరుగుతుండగా అయ్య వారు వచ్చి" గుడిలో చేయ వలసిన కార్యక్రమాలన్నీ ముగించుకుని వచ్చే సరికి ఇదిగో ఇంత ఆలస్యమైంది" అన్నారు లోపలికొస్తూ.

"అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు చూసుకుంటున్నారు" అన్నారు శ్రీకర్ రావు.

"శుభం. పెళ్లి చూపులంటే అదే కదా" అంటూ పంచాంగం, ఇతర సామాగ్రి ఉన్న బ్యాగ్ పక్కనున్న టీపాయ్ పై పెడుతూ

కూర్చున్నారు.

"ఇరువురి వెలిగి పోతున్న ముఖాలూ చూస్తే ఒకరంటే ఒకరికి నచ్చినట్టుగానే ఉంది. ఇహ మిగతా విషయాలు మాట్లాడుకుంటే సరి" అన్నారు అయ్య వారు.

"మా అబ్బాయి అమెరికాలో ఉంటాడని తెలుసుగా, అమ్మాయి పెద్దగా చదువుకోక పోయినా, మంచి పిల్లై ఇంటిని చూసుకుంటే చాలన్నాడు. వీళ్ల సంప్రదాయం, మంచితనం మీరు చెప్పనే చెప్పారు. మాకు పైసా కట్నం వద్దు. పెళ్లి కూడా మీ గుడి లోనే చేసేద్దాం. ఏవంటారు?" అన్నాడు శ్రీకర్ రావు.

"ఇంకేవంటారు? మంచితనం ఇలా మాటల్లో కనిపిస్తుంటే. అబ్బాయి చదువు పూర్తి చేసుకుని అలా విదేశాలకు వెళ్లగానే, కట్న కానుకల వేలంకు పెట్టే తల్లి దండ్రులున్న ఈ రోజుల్లో కట్నం వద్దని, నిరాడంబరంగా పెళ్లి చేస్తే చాలనే తల్లి దండ్రులుండడం గొప్ప విషయం. అందరికీ శుభాశీస్సులు" అన్నారు అయ్య వారు.

'ఇది అమెరికా సంబంధమా? అబ్బాయి అమెరికాలో ఉంటాడా? ఇవేం చెప్ప లేదే అయ్య వారు, మంచి సంబంధం అంటే, తను పెళ్లి చూపులకు 'ఊఁ' అన్నాడు' అచ్యుత రామయ్య గారి మనసులో ఆలోచనలు గిర గిరా తిరుగుతున్నాయి.

"ఏవంటారు? అచ్యుత రామయ్య గారూ అభ్యంతరాలేమీ లేనట్టేగా? అయినా ఎందుకుంటాయి లేండి? భగవంతుడు అమెరికా సంబంధాన్ని. మంచి మనసున్న అత్తవారినీ వరంలా ప్రసాదిస్తుంటే. మీరందరూ ఏ జన్మలోనో స్వామికి ఏ లోటూ రాకుండా పూజ చేసి ఉంటారు. దాని ఫలితమే ఈ శుభ సందర్భం" అన్నారు అయ్యవారు.

"క్షమించాలి నాకు ఈ సంబంధం ఇష్టం లేదు" అన్నారు మ్లానమైన వదనంతో అచ్యుత రామయ్య గారు.

"వ్వాట్" షాక్ అయినట్టుగా అన్నాడు శ్రీకర్ రావు.




శ్రీకర్ రావు గట్టిగా అన్నాడు కాని. అందరి ముఖాల్లో ఆశ్చర్యంతో కూడిన అదే భావం ప్రస్ఫూటంగా కనిపిస్తోంది.

"అదేంటండీ" అయ్య వారు కూడా ఆందోళన, ఆశ్చర్యం కలగలిపిన స్వరంతో అడిగారు.

"మా ఒక్కగానొక్క అమ్మాయి కాత్యాయనిని చిన్నప్పటి నుంచి ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నాను. పసితనంలో గుండెల మీద నడిపించాను, పెద్దయ్యాక చేతులు పట్టుకుని నడక, నడత నేర్పాను. మనం ఎవరింటికైనా వెళ్లినప్పుడు ఒకటి రెండు రోజులు మించి ఉండలేం. మన ఇంటికి మనం వస్తేనే మనసుకు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఆడపిల్లకు పెళ్లిచేసి అత్తారింటికంటూ తెలియని ఇంటికి పంపడమేంటో నాకు అర్థం కాదు. నేను ఇంతవరకు మా ఆవిణ్ని గట్టిగా ఒక్క సారీ కేకలెయ్య లేదు. ఈ ఇంట్లో తనకూ సమాన ప్రాతినిధ్యం ఉందని విశ్వసించాను. అలాగే అన్ని విషయాల్లోనూ ప్రవర్తించాను. కాని అందరి ఆడవాళ్ల విషయంలో ఇలా జరుగుతుందని చెప్పలేం.

అత్తింట్లో అత్తగారు, మామగారు, ఆడబడుచులు, మరుదులు ఇలా వీరిలో ఏ ఒక్కరికి శారీరకంగా, మానసికంగా హింసించే మనస్తత్వం ఉన్నా, ఆ పిల్ల జీవితం పల్లేరు కాయల మీద నడకే. మొగుడే శాడిస్ట్ అయితే చెప్పనక్కర్లేదు. దిన దిన గండం నూరేళ్లాయుష్షు. మండే నిప్పు కణికల మీద నడక. ఎన్ని బాధలున్నా మనసులో దాచుకుని భరించాలి. అందుకేనేమో బహుశా ఓర్పుకు ఆడది పర్యాయ పదమని మన వాళ్లు కితాబులిచ్చారు. మన సంస్కృతీ సంప్రదాయం గొప్పదంటారు కాని ఈ వివాహాల విషయంలో మాత్రం నాకెందుకో తేలిపోతున్నట్టు అనిపిస్తుంది.

నా వరకూ నాకు మా అమ్మాయంటే పంచప్రాణాలు. చెబితే గొప్పలు చెబుతున్నాననుకుంటారు గానీ, ఒక రోజు గేటు నుంచి ఇంట్లోకి వస్తున్నప్పుడు కాల్లో ముల్లు దిగిందని, గేటు నుంచి మా గుమ్మం వరకూ బండలేయించాను. నా చిట్టి తల్లి తెలివైనదైనా, టెంత్ లో స్కూల్ ఫస్ట్ వచ్చినా, పై చదువులు చదివించ లేదు. ఎందుకంటే, ఏ కుర్రాడు ఉడుకు రక్తంతో మా అమ్మాయికి ఏం ప్రమాదం తలపెడతాడోనని. అలాంటివి జరగడం మాట అటుంచి, కనీసం ఊహించ లేను. గుండె కొట్టుకోవడం ఆగి పోతుంది. రోజూ పేపర్లలో టీవీల్లో న్యూసులు అవే కదా! అంతా అయ్యాక విచారణలు, శిక్షల వల్ల ఏమిటి ప్రయోజనం? చేతులు కాలాక చందమే..!

అసలు కన్యాదానం, పిల్లనివ్వడం పదాలు ఉపయోగించడం నాకు సుతరాము ఇష్టం ఉండదు. పిల్లను వస్తువుగా చూడబట్టే కదా మాటల్లో ఈ పైత్యాలు? పిల్లకి పెళ్లి చేసి ఏ మూలకో పంపిస్తే, ఆమె ఒంట్లో నలతగా ఉందంటే మేమిక్కడ ప్రశాంతంగా ఉండ గలమా? అత్తింట్లో పిల్లని ఆరళ్లు పెడుతున్నారంటే తట్టుకో గలమా? వెళ్లి చూడొచ్చు. సరి చేసే ప్రయత్నాలు చేసుకోవచ్చు. అందుకే సాధ్యమైనంత వరకూ ఉన్న ఊళ్లోనే పిల్ల పెళ్లి చేద్దామనుకుంటున్నాను. పిల్ల కంటి ముందు కనిపిస్తుంటుంది. రేపు మీ అబ్బాయితో పెళ్లి చేసి అమెరికా పంపిస్తే ఇంకేమన్నా ఉందా? ఎప్పుడన్నా అమ్మాయికి ఒంట్లో బాగా లేదని, మొగుడూ-పెళ్లాల మధ్యా అపోహలు, అపార్థాలూ చోటు చేసుకున్నాయని తెలిస్తే ఇక్కడ మా గుండెలు బిటలు వారి పోతాయి. పోనీ అది రాత్రికి రైలో, బస్సో ఎక్కితే తెల్లారే సరికల్లా చేరుకునే ఊరు కాదు. ఖండాంతరాలు, సముద్రాలూ దాటి పోవడం.

దయ చేసి ఈ ఆడపిల్ల తండ్రి మనో వేదన అర్థం చేసుకుని నన్ను క్షమించండి. మంచి సంబంధం అంటే ఊఁ అన్నాను గాని, అబ్బాయి అమెరికాలో ఉంటాడని తెలియదు. తెలిస్తే ఇంత వరకూ రానిచ్చి, ఇబ్బంది పెట్టే వాడిని కాదు" ఉత్తరీయంతో కళ్లు తుడుచుకుంటూ జీర గొంతుకతో మనసులోని బాధను వ్యక్తం చేశాడు అచ్యుత రామయ్య గారు.

"అందరూ అలా ఆడపిల్లకి అన్యాయం చేసే వాళ్లే ఉంటారనుకుంటే ఎలాగండి? మాకు ఆడపిల్లలు లేరు అమ్మాయిని లక్ష్మీదేవిలా కాలు కింద పెట్టకుండా చూసుకుంటాం. మా అబ్బాయి మీ అమ్మాయి గురించి, మీ గురించి విని పెళ్లి చూపులకు ఒప్పుకున్నాడు. మీరు మరొక్క సారి ఆలోచించండి."అంది పిల్లాడి తల్లి ప్రణతి.

"అవునండీ" అంది ఆమె తోటికోడలు.


"అయ్యా..నాకు మీ గురించి తెలుసు, వారి గురించి తెలుసు. ఇరు కుటుంబాలనూ పెళ్లి పేరుతో కలిపేసి చేతులు దులుపుకునే వాణ్ని నేను కాదన్న సంగతి మీకూ తెలుసు. మంచి సంబంధాలు, అదీ నాకు బాగా తెలిస్తేనే- ముందడుగు వేస్తాను. మనసులో ఎటువంటి సంశయాలూ పెట్టుకోక ముందడుగేయండి అచ్యుత రామయ్య గారూ" అన్నాడు అయ్యవారు సమాధాన పరుస్తున్నట్టుగా.

"నన్ను క్షమించండి అయ్యవారు. ఇప్పుడు మొహమాటానికి తలూపితే, తర్వాత మనశ్శాంతిని పోగొట్టుకుంటాను. దయ చేసి ఇబ్బంది పెట్టకండి" అన్నాడు చేతులు జోడిస్తూ

"ఆడపిల్ల తండ్రిగా మీ ఆవేదన అర్థం చేసుకున్నాం అచ్యుత రామయ్య గారూ, అందులో నాకూ తప్పేం అనిపించడం లేదు. బహుశా నాకు అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు ఉన్నా మీలాగే ఆలోచించే వాడినేమో. మా మంచితనం మీద మీకు ఎంత నమ్మకం కలిగించినా, మీ మనసులో ఏర్పడే శూన్యాన్ని నింపలేం. మేము వెళ్తొస్తామండి" అంటూ లేచాడు.

అందర్నీ గేటు దాకా సాగనంపి, వాళ్లు వెళ్లి పోయాక ఇంట్లోకొచ్చి కూతురు వంక చూశాడు.

ఆమె కళ్లలో నీళ్లు.\




.'తనకు ఊహ తెలిసినప్పటి నుంచి తన తండ్రి తనను కాలు కింద పెట్టనివ్వలేదు. తనకున్న పరిధిలో తననెప్పుడూ సంతోష

పెట్టాలనే చూశాడు. పురిట్లోనే ఆడపిల్ల గొంతునొక్కాలని, పెరుగుతున్న కొద్దీ బరువుగా భావిస్తూండే తండ్రులు, ఆడపిల్ల ఒక్కతే పుడితే, 'చ ఛ వారసుడు లేడు' అని చిరాకు చూపించే తండ్రులు, మగ పిల్లాడి కోసం ప్రయత్నిస్తూ, ఆడపిల్లలు పుడుతుంటే వాళ్ల మీద తీవ్రమైన అసహనం వ్యక్తం చేసే తండ్రులు, కొడుకు, కూతురూ ఉంటే కొడుకును అందలం ఎక్కిస్తూ, కూతురును మాటలతో, చేతలతో అదఃపాతాళానికి తొక్కేసే తండ్రులూ ఉన్న ఈ దేశంలో తను ఏ జన్మలో ఏం పుణ్యం చేసుకుందో కాని భగవంతుడు తండ్రిగా లభించాడు' కాత్యాయని మనసులోఅనుకుంటూ ఆయన కాళ్ల మీద పడి పోయింది. రెప్పల చెలియలి కట్టలు దాటిన కన్నీళ్లు ఆ తండ్రి పాదాలు కడిగే ప్రయత్నం చేశాయి.

"ఏంటమ్మా ఇది లే" అని కూతుర్ని గబుక్కున లేపి "ఏమ్మా, వెతుక్కుంటూ ఇంటికి వచ్చిన అమెరికా సంబంధాన్ని కాలదన్నానని ఈ తండ్రి మీదేవన్నా కోపమొచ్చిందా?" అన్నాడు ఆమె చుబుకం ఎత్తి ఆప్యాయంగా ఆమె కళ్లలోకి చూస్తూ.

"లేదు నాన్నా, మగ పెళ్లి వారు కట్నం వద్దన్నారని, పెళ్లి ఆడంబరంగా చెయ్యనవసరం లేదన్నారని, నన్ను గుండెల మీద కుంపటిగా భావించి, ఇంట్లోంచి తరిమేసే తండ్రి మీరు కానందుకు నేను గర్వ పడాలి. పైగా నేను అంత దూరాన ఉంటే మీరిక్కడ ఎలా ఉన్నారోనన్న బెంగ నా మనసునూ పీకుతుంటుంది. మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా నాకు సంతోషాన్నిచ్చేదే" అంది.

"కుటుంబమంటే సభ్యుల ఇటుకలతో పటిష్టంగా నిలబడే కట్టడం. ఏ ఒక్క సభ్యుడు బలహీనంగా ఉన్నా భవనం కుప్ప కూలి పోతుంది. నా బంగారు తల్లివి. నాకు చేతనైనంతలో మంచి సంబంధం తెచ్చి, అంగరంగ వైభవంగా కాకపోయినా తాహతుకు తగ్గట్టు పెళ్లి చేస్తాను తల్లీ" అన్నాడు గద్గద స్వరంతో.

'ఈయన మంచి భర్త, అంతకు మించి మంచి తండ్రి' భర్త వంక చూసి మనసులో మెచ్చుకోలుగా అనుకుంటూ యశోదమ్మ చీర కొంగుతో కళ్లు తుడుచుకుంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఆ ఇంట్లోని అందరూ టీ వీ లో ఏదో సినిమా వస్తుంటే చూస్తున్నారు.


"నాన్నా, ఒక సారి పక్క వీధిలో ఉండే నా స్నేహితురాలు నీరజ ఇంటికి వెళ్లాను. అప్పుడు వాళ్లు టీ వీలో వచ్చే ఒడిదుడుకులు అనే కార్యక్రమం చూస్తున్నారు. అందులో గొడవలు పడి విడి పోయిన భార్యాభర్తల్ని కలపడానికి ఓ సినీ తార, సైకాలజిస్ట్, లాయర్ ప్రయత్నిస్తున్నారు. నిజంగా ఎంత గొప్ప ప్రోగ్రాం నాన్నా! చితికి పోయిన కొన్ని జీవితాలన్నా నిలబడతాయి కదూ" అంది.

ఆయన ఒక మారు కూతురు వంక ప్రశాంతంగా చూసి. 'చూడమ్మా, సంసారం గుట్టు, రోగం రట్టు అన్నారు. చిన్న చిన్న సమస్యలు, గొడవలూ వచ్చినా, నాలుగు గోడల మధ్యా సర్దుకు పోవాలి. ఎవరి సంసారం వాళ్లు గుట్టుగా చూసుకోవాలి. దాన్ని నలుగురుతో చెప్పుకోవడం అంత సరైంది కాదు. అలాంటిది టీ వీల ద్వారా కొన్ని లక్షల మంది ముందు తమ సంసారాన్ని పరచుకోవడం సబబని నాకనిపించడం లేదు. గొడవల్ని చక్క దిద్దడానికి అటూ, ఇటూ- సంబంధించిన పెద్దలుంటారు, ఊరి పెద్దలూ ఉంటారు. కాదంటే లాయర్ల సహకారమూ తీసుకోవచ్చు కాని టి ఆర్ పి రేటింగుల కోసం ఎగబడుతూ, చెప్ప కూడనివి చెబుతూ, చూపించ కూడనివి చూపించే టీ వీల వల్ల సమాజానికి చాలా చేటు కలుగుతోంది. అందులో ఇదొకటి. చూసే వాళ్ల సబ్ కాన్షియస్ మైండ్ మీదా భయంకరమైన ప్రభావం చూపిస్తూ మనసులను కలుషితం చేస్తున్నాయి. ఇంట్లోనూ, బయటా మనిషిని మనిషి నమ్మ లేని స్థితికి తీసుకెళుతున్నాయి. మనం చూడు చక్కని పాటల ప్రోగ్రామ్స్ చూస్తాం. వారమంతా శ్రమించిన మనసుకు ఎంత ఆహ్లాదం కలుగుతుంది. అలాగే ఇదిగో ఇలా మంచి సినిమాలు చూస్తాం. విలువలకు పట్టం కట్టిన అలాంటి చిత్రరాజాలు చూస్తే మనో, వ్యక్తిత్వ వికాసాలు కలుగుతాయి. మనం ఏం చేసినా, ఏం చూసినా మనను అభివృద్ధి పథంలో నడిపించేదిగా ఉండాలి, అంతే కాని అధఃపాతాళానికి తొక్కేసేది కాకూడదు" అన్నాడు. అర్థమైందన్నట్టుగా తల ఊపి నవ్వింది కాత్యాయని.

టీ వీ లో సినిమా మొదలైంది.

అందరూ లీనమై చూస్తూంటే తలుపు కొట్టిన చప్పుడైంది. టైము చూశారు. సాయంత్రం అయిదు.

అచ్యుత రామయ్య గారు లేచి 'ఈ సమయంలో ఎవరై ఉంటారు' అని మనసులో అనుకుంటూ తలుపు వైపు నడిచాడు. తలుపు తీశాడు.




ఎదురుగా రాజా రావు గారు, అచ్యుత రామయ్యగారి కొలీగ్!

"రండి,రండి" లోపలికి ఆహ్వానించాడు.

లోపలికొచ్చి కూర్చున్నాక "టీ వీ చూస్తున్నట్టున్నారు, డిస్టర్బ్ చేశానా" అన్నాడు సంకోచాన్ని వ్యక్తం చేస్తూ. వాళ్లు మాట్లాడుతుండగానే యశోదమ్మ టీ వీ కట్టేసింది. ఆ ఇంట్లో అంతే ఎవరైనా వస్తే టీ వీ కట్టేసి, వచ్చిన వాళ్లకి ప్రాధాన్యత ఇస్తారు.

"ముందు అతిథులే ప్రధానం. టీ వీ చూడ్డం ముఖ్యం కాదండి" అని "యశోదా రాజా రావు గారొచ్చారు, కాస్త టీ పెట్టు" అని పూర్తి చేశాడు.

"ఎందుకండీ అవండీ, నేను ఈ కాలనీలో ఉండే వాడినే కదా!" మొహమాట పడ్డాడు.

"ఇది ఎలాగూ మేము తాగే టైమే"నవ్వాడు అచ్యుతరామయ్యగారు.

ఆఫీసు విషయాలు మాట్లాడుకుంటుండగా యశోదమ్మ రెండు కప్పుల టీ, ప్లేట్లో బిస్కట్లు సర్ది వాళ్ళిద్దరి మధ్యన ఉన్న టీపాయ్ పై పెట్టి వెళ్ళబోయింది.

"నువ్వూ కూర్చో చెల్లెమ్మా, ఒక విషయం మాట్లాడాలి" అన్నాడు.

ఆవిడ భర్త వంక, రాజా రావు గారి వంకా ఆశ్చర్యంగా చూస్తూ కొద్ది దూరంలో ఉన్న స్టూల్ మీద కూర్చుంది.

"అచ్యుత రామయ్య గారూ, మాది మూడు వాటాల ఇల్లని తెలుసుగా. మేమున్న వాటాని ఒదిలేస్తే రెండింటినీ అద్దెకిచ్చానన్న విషయం కూడా మీకు తెలుసు. ఒక దాంట్లో భర్త వదిలేసిన ఒక టీచర్ చాలా కాలంగా గుంభనంగా ఉంటోంది. రెండో వాటాలో కమలాకర్ అనే కుర్రాడు, వాళ్ళమ్మతో ఉంటున్నాడు. వాళ్ళు మా ఇంట్లో కొచ్చి మూడేళ్లవుతోంది. అంతకు ముందు వీళ్ళు కూకట్ పల్లిలో ఉండే వారు, కమలాకర్ చదువైపోయి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా వాళ్ల నాన్న హార్టెటాక్ వచ్చి పోయారు. వాళ్ల నాన్న పోవడాన్ని జీర్ణించుకోలేని వాళ్లమ్మ జీవితం పట్ల నిరాసక్తంగా మారి పోయింది. ఒక రోజు ఏదో పని మీద బైట కెళ్లి వస్తుంటే ఆవిణ్ని ఆటో గుద్దేసింది, దాంతో తలకు దెబ్బ తగిలి రెండు కళ్లూ పోయాయి. అప్పటి నుంచి మౌనాన్ని ఆశ్రయించింది. తన పనులు తను చేసుకుంటుంది. అవసరమైతే పొడి పొడిగా రెండు మాటలు మాట్లాడుతుంది. అంతే. ఇహ ఆ ఏరియాలో ఉండడం ఇష్టం లేక, పాత జ్ఞాపకాలను వదిలించుకోవాలని మన ఏరియాకొచ్చి మా ఇంట్లో అద్దెకు దిగారు.

ఇదంతా మీకు నేను ఎందుకు చెబుతున్నానని మీరనుకుంటున్నారని నాకు తెలుసు. వస్తున్నా, అసలు విషయానికి వస్తున్నా" అని కొద్దిగా ఆగి టీ కప్పు చేతిలోకి తీసుకుని రెండు గుక్కల్లో టీ తాగేసాడు.

"అయ్యో టీ చల్లబడి పోయిందా, మళ్లీ పెట్టుకురానా" గబుక్కున లేస్తూ అంది యశోదమ్మ.

"ఉండు చెల్లెమ్మా, ఇలా తాగాలనే ఇంత సేపుంచాను. తాగకుండా వెళితే మీరు నొచ్చుకుంటారని, ఇలా తాగాను" అని "ఆఁ, ఏం చెబుతున్నాను? కమలాకర్ వాళ్లు మా ఇంట్లో అద్దెకి దిగారని కదూ. వాళ్లు మా ఇంట్లో దిగిన వేళా విశేషం ఏంటో గానీ అబ్బాయికి ప్రైవేటు లిమిటేడ్ కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. అతనెప్పుడొస్తాడో, ఎప్పుడెల్తాడో ఎవరికీ తెలీదు. మంచి కుర్రాడు. బాగుంటాడు. మనసు మంచిది. ఎప్పుడైనా నేను పలకరిస్తే చక్కగా మాట్లాడతాడు.అలాంటి అతను మీ అమ్మాయిని వేణు గోపాల స్వామి గుడిలో రెండు మూడు సార్లు చూశాడట. వొంచిన తల ఎత్తకుండా భగవంతుణ్ని మాత్రమే చూసే మీ అమ్మాయి

ఒద్దికైన గుణం తనకి నచ్చిందట. రేపు తనకి ఎవరితోనైనా పెళ్లయితే తను లేనప్పుడు తన తల్లిని ఎలా చూసుకుంటుందో అని బెంగగా ఉండేదట. మీ అమ్మాయిని చూశాక, ఎందుకో వాళ్లమ్మను గురించిన బెంగ పోయిందట. తను ఆమెని వెనకగా వెంబడించి మీ కూతురని తెలుసుకున్నాట్ట. కాని ఎలా అప్రోచ్ అవాలో ఆలోచిస్తుంటే, మీరూ నేను ఒక సారి కలిసి మాట్లాడుకుంటూ రావడం చూశాట్ట. తన గురించి మీతో చెప్పమని నన్ను రిక్వెస్ట్ చేశాడు. మీరూ మీ అమ్మాయికి మంచి సంబంధాలు చూస్తున్నారని తెలుసు గనక, అతని ప్రస్తావన మీముందు పెడుతున్నాను. అతని గురించి నేను రెండే రెండు మాటల్లో చెబుతాను. నాకు కొడుకులు కాకుండా, కూతురు ఉంటే అతనికే ఇచ్చి చేసే వాడిని. మీరూ ఆలోచించుకోండి" అన్నాడు చెప్పడం అయిపోయిందన్నట్టుగా గట్టిగా శ్వాస వదులుతూ.

అచ్యుత రామయ్య గారు భర్య వంక చూశాడు. అదే సమయంలో ఆవిడ కూడా ఆయన వంక చూసింది. వాళ్లిద్దరి మధ్యా ఏ భావ మార్పిడి జరిగిందో కానీ, అచ్యుత రామయ్య గారు రాజా రావు గారి వంక సూటిగా చూశాడు.

రాజా రావు గారు కూడా ఆత్రంగా ఆయన వంక చూస్తున్నాడు. 'తన మీద ఎంతైనా గౌరవముండొచ్చు. కానీ తను చెప్పిన దానికి 'ఊహూ 'అంటే రేపటి నుంచి ఆయన కనిపిస్తే మనసును తెలియని సంకోచం చుట్టుముడుతుంది. అదే పెళ్లి చూపులయ్యాక ఇరువురిలో ఎవరికి నచ్చకపోయినా ఫర్వాలేదు, అది వేరే విషయం అవుతుంది' రాజా రావు గారి మనసును ఆలోచనలు ఈగల్లా ముసురుకుంటున్నాయి.

"రాజా రావు గారు మీతో ఒక విషయం చెప్పాలి" అని గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

'ఆయన ఏమంటాడా' అని రాజారావుగారు, అచ్యుతరామయ్య భార్య యశోదమ్మ చెవులు రిక్కించారు




"కాత్యాయని మా అమ్మాయి కాదు. ప్రాణం. అల్లారు ముద్దుగా పెంచుకున్నాను. పెళ్లయితే అమ్మాయి అమెరికా వెళ్లి పోవాలని తెలిసి, పొద్దున్న ఒక సంబంధాన్ని దణ్ణం పెట్టి తిప్పి పంపాను. అమ్మాయిని పువ్వుల్లో పెట్టి కాక పోయినా కనీసం మామూలుగా అయినా కష్ట పెట్టకుండా చూసుకోవాలి. అవన్నీ మీరనే సంబంధంలో ఉంటే అభ్యంతరం లేదు" అన్నాడు.

"మీ అమ్మాయంటే మీకు ఎంత ప్రేమో నాకు తెలియదూ. అమ్మాయి మీకెంతో నాకూ అంతే. చెప్పానుగా నాకు కూతురు ఉంటే అతనికి ఇచ్చి చేసే వాడి నని. మంచి కుర్రాడు. అమ్మాయి సుఖ పడుతుంది. పూచీ నాది" అన్నాడు రాజా రావు గారు.

"అయితే సరేనండి వచ్చే ఆదివారమూ మంచి రోజే, ఉదయం అమ్మాయిని చూసుకోడానికి రమ్మనండి. ఏవంటావు యశోదా?" భార్యనడిగాడు. ఆవిడ అంగీకార సూచకంగా తల ఊపింది నవ్వుతూ.

లోపలి కెళ్లి ఆ వార్త కూతురి చెవిలో వేసింది.ఆమె సిగ్గులో ముడుచుకు పోయింది.

ఆదివారం.

ఉదయం 10 గంటలు.

తెల్లవారు ఝామున మొక్కలకు నీళ్లు పోయడంతో అవి ఫ్రెష్ గా పూలతో గాలికి సన్నగా ఊగుతున్నాయి. కళ్లాపి జల్లడంతో కమ్మటి మట్టి వాసన ఊపిరితిత్తుల్ని ఉత్తేజ పరుస్తోంది. గేటు ముందు, ఇంటి ముంగిటా కాత్యాయని వేసిన ముగ్గు ఎక్కడా తప్పని ఒంపులతో, తెల్లగా మెరిసి పోతూ ఆమెలోని చిత్రకారిణిని పరిచయం చేస్తున్నాయి.

రాజా రావు గారు, ఆయన భార్య, కమలాకర్, వాళ్లమ్మా కాత్యాయనిని చూసుకోడానికి వాళ్లింటికి వచ్చారు. వాళ్లని సాదరంగా లోపలికి ఆహ్వానించి కూచోబెట్టాడు అచ్యుత రామయ్య గారు.

కమలాకర్ ఐదున్నర అడుగుల పొడవుతో మంచి రంగులో, చక్కటి ముఖ వర్చస్సుతో బ్లాక్ ప్యాంట్ మీద వైట్ షర్ట్ వేసుకుని చూడ చక్కగా ఉన్నాడు. అతని తల్లి సాధారణ నేత చీరలో, కళ్లకి నల్ల కళ్ల జోడు పెట్టుకుని గౌరవ ప్రదంగా, కాస్త హుందాగా ఉంది. లోపల అగరొత్తుల పొగ గుబాళిస్తోంది. సీ డీ ప్లేయర్ లోంచి మంద్రంగా వేణు గాణం వినిపిస్తోంది.

"మీ ఇంట్లోకి వస్తే గుళ్లోకి వచ్చినంత అనుభూతి కలుగుతోంది" అన్నాడు రాజా రావు గారు మాటలకు అంకురార్పణ చేస్తూ.

"ఎన్నో ఏళ్ల నుంచి ఇది మా అలవాటు. మొక్కుబడిగా కాకుండా చక్కగా, ఆహ్లాదంగా తీర్చి దిద్దిన ఇంటి వాతావరణంలో, మనసుతో పూజ చేసి ప్రశాంత చిత్తంతో బయటకు అడుగు పెడితే కాగల కార్యాలన్నీ అవలీలగా నెరవేరుతాయి. మనిషి ప్రశాంతత తన చుట్టూ ఉన్న పరిసరాలని కూడా ప్రశాంతం చేస్తుంది. మనిషికి అన్నింటి కన్నా ముఖ్యం మానసిక ప్రశాంతత అని మేము నమ్ముతాం" అన్నాడు.రాజా రావు గారు కమలాకర్ ను, వాళ్లమ్మను పరిచయం చేశారు.

"నమస్కారం సార్. నా గురించి రాజా రావు గారు మీకు ముందే చెప్పుంటారు. మా పరిస్థితులూ చెప్పుంటారు. క్షమించండి మా అమ్మ గారు ఎక్కువగా మాట్లాడ లేరు. అందు చేత నేనే మాట్లాడుతున్నాను. ఏమీ అనుకోవద్దు. అమ్మని, నన్నూ, ఇంటినీ చూసుకునే అమ్మాయి కావాలి. మీ అమ్మాయిని గుడిలో చూశాను. తన నడవడిక నన్ను కట్టి పడేసింది. ఈ రోజుల్లో ఈ సిటీలో అంతటి వినయం ఉన్న పిల్లలుండడం చాలా అరుదు. అందుకే నేను ఆమెని వెంబడించి మీ కుటుంబం గురించి పూర్తిగా తెలుసుకున్నాను, అందుకు నన్ను క్షమించాలి. చక్కటి అనుబంధ బాంధవ్యాలతో మనుషుల విలువ తెలుసుకుని మసలుకునే వ్యక్తులు మీరు. మీ గురించి అడిగితే, మీ పాలతను, పేపరతను మొదలు దణ్ణం పెడుతున్నారు. అంతటి ఉన్నత, ఉదాత్త వ్యక్తిత్వాలు, స్వభావాలున్న మీరు గొప్పవాళ్లు.

చాలా కాలం నుంచి నేనూ మా అమ్మా, పరిస్థితులు పెట్టిన పరీక్షలకు తట్టుకో లేక ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. మా ఇంట్లోకి ప్రశాంతత నడిచి రావాలి. మా హృదయాలకు మాటలు, చేతల నవనీతం పూసి చల్ల బరచాలి. అది మీ అమ్మాయే చేయ

గలుగుతుంది. చాలా మంది కుర్రాళ్ల లాగా నేను మీ అమ్మాయి అందం చూడ లేదు. వ్యక్తిత్వాన్నే పరిశీలించాను. చేతులెత్తి నమస్కారం చేయాలనిపించే సంస్కార వంతులు. నాకొచ్చే జీతానికి మీ అమ్మాయి సుఖ పడుతుంది. తనను జాగ్రత్తగా చూసుకుంటాం. మీ అమ్మాయిని చూసుకోడానికి పోయిన ఆదివారం ఓ పెద్ద సంబంధం రావడం చూశాను. అదృష్టవశాత్తు వాళ్లని కాదన్నారు. ఇహ ఆలస్యం చేయ కూడదని పోయిన ఆది వారమే రాజా రావు గారిని మీతో మాట్లాడమని తొందర చేశాను. తండ్రి లాంటి వారు ఆయన, నా మాట మన్నించి మాట్లాడడానికి మీ ఇంటికొచ్చారు. మీరు 'ఊ' అంటే మీ అమ్మాయిని పిలిపించండి. ఫార్మాలిటీ కోసం చూస్తాను. కట్నాలూ, కానుకలు ఏవొద్దు. నా సైడు నుంచి ఎప్పుడో ఓ కే. మీ నిర్ణయం మీదే ఆధార పడి ఉంది. ఏవంటావు అమ్మా"అన్నాడు.

ఆవిడ మౌనంగా, ముఖాన్ని కాస్త ఆనందంతో వెలిగించి తల ఊపింది.

అచ్యుత రామయ్య గారు ఆగకుండా మాట్లాడిన ఆ అబ్బాయి వంక కొద్ది సేపు చూశారు. ఆలస్యం చేస్తే అమ్మాయి ఎక్కడ మిస్ అవుతుందో అన్న ఆత్రుత అతని మాటల్లో వ్యక్తమవుతోంది. ఇప్పుడు చెప్పిన మాటలకు అబ్బాయి కట్టుబడి ఉంటే అమ్మాయి నిజంగానే సుఖ పడుతుంది. కేవలం మాటలే అయితే మాత్రం, జీవితం ఏ మలుపు తిరుగుతుందో చెప్పలేం.

యశోదమ్మకి సౌంజ్ఞ చేశారు. ఆవిడ లోపలికి వెళ్లి కాఫీ గ్లాసుల ట్రే తో కూతుర్ని పట్టుకొచ్చింది. అందరికీ కాఫీలిచ్చాక, తనూ కూచుంది.

"బాబూ, అమ్మాయిని ఏవన్నా అడుగుతావా, తనను ఏవన్నా ప్రశ్నలు అడగాలనుకుంటోందేమో మీ అమ్మ గారిని కూడా అడుగు" అన్నాడు అచ్యుత రామయ్య గారు.

"చూసేది, అడిగేది ఏం లేదండి. నా మనసులో ఎప్పుడో తను అందమైన దృశ్యంలా నిలిచి పోయింది"

"అమ్మాయీ నువ్వు కూడా అబ్బాయిని ఏవన్నా అడుగుతావా? సిగ్గు పడకు ఇది మీ ఇద్దరి జీవితాలకీ సంబంధించింది" చిన్నగా నవ్వుతూ అన్నారు రాజా రావు గారు.

కాత్యాయని నెమ్మదిగా తల పైకెత్తింది. అతణ్ని చూసింది. బావున్నాడు. ఇందాక లోపలి నుంచి అతని మాటలు వింది. మాటకారి, చలాకీగా అనిపించాడు. ముఖ్యంగా తనకి పెళ్లి చేసే తండ్రికి భారం కాడు. కాదనే కారణాలు కనిపించడం లేదు.

"ఒక్క విషయం మాట్లాడాలి" అంది.

అచ్యుత రామయ్య గారితో సహా అందరూ ఆశ్చర్య పోతూ ఆమె వంక చూశారు.

"అడగండి.."అన్నాడు కమలాకర్.

అతనికీ ఆశ్చర్యంగా ఉంది " ఏం మాట్లాడుతుందా" అని.




ఆమె తండ్రి వంక, తల్లి వంక ఒక సారి చూసి " మాది ముగ్గురు సభ్యులతో కూడిన చిన్న ఐకమత్య కుటుంబం. ఇన్నాళ్లూ మేమందరం ఆనందం కలిగినా, దుఃఖం కలిగినా మేమే పంచుకున్నాం. అలాంటిది పెళ్లి పేరుతో వీళ్లకి, ఈ ఇంటికీ నేను దూరమై పోవడం ఎలా ఉంటుందో ఊహించండి.

మన సంప్రదాయాలు మగ వాళ్లకే పెద్ద పీట వేస్తాయి. ఏది చేసినా వాళ్ల కోసమే. ఇంట్లో ఒక మగ పిల్లాడుంటే, వాడు చదువుకుంటే తల్లి దండ్రుల్ని చూసుకుంటాడు. అదే ఒక్కతే ఆడపిల్లుండి, ఆమెని చదివిస్తే, ఆమె పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లి పోతే, కష్టపడి పెంచి, చదివించి, పెద్ద జేసిన వాళ్ల గతి ఏం కావాలి? ఇదేం ధర్మం? ఇదేం సంప్రదాయం. నేను సంప్రదాయానికి ఎదురీదాలని ఈ మాటలు మాట్లాడడం లేదు. మా నాన్న గారు అలా నన్ను పెంచ లేదు.

సంప్రదాయ వాది గానే పెంచారు. కాక పోతే అవసరమైన ఆలోచనలతో పెంచారు. కమలాకర్ గారూ, నేను పెళ్లి చేసుకున్నాక కూడా వీళ్ల యోగ క్షేమం కనుక్కోడానికి, అవసరమైతే సహాయం చెయ్యడానికి పుట్టింటికి వస్తాను. కాణీ కట్నం, కానుకలు వద్దన్నారంటే మీ మనసు వైశాల్యం నాకు అర్థమైంది. ఈ విషయంలో కూడా ఎటువంటి ఆంక్షలూ లేక పోతే, మా అమ్మా నాన్నలకు మీరు నచ్చితే, నాకేమీ అభ్యంతరం లేదు" అంది.

అచ్యుత రామయ్య గారు కూతురి వంక మెచ్చికోలుగా చూస్తే, యశోదమ్మా, రాజారావు గారూ ఆశ్చర్యంగా చూశారు. కమలాకర్ మాత్రం "నాకేమీ అభ్యంతరం లేదండీ" అన్నాడు నవ్వుతూ.

"మాకో మూడు రోజులు సమయమివ్వండి. ఆలోచించుకు చెబుతాం"అన్నాడు అచ్యుత రామయ్య గారు.

"అలాగేనండి..మీ నుండి మంచి వార్త వింటానన్న నమ్మకం నాకుంది" అంటూ లేచాడు కమలాకర్.

"అమ్మా కాత్యాయని అతను నీకు నచ్చాడా, కళ్లు లేని అతని తల్లికి నువ్వు సేవలు చేయాల్సొస్తుందేమో, నీకు అంగీకారమైతే మనం ముందుకు వెళదాం. అతను రాజా రావు గారింట్లో ఉంటాడని, మంచి వాడని ఆయనే చెబుతున్నాడు. అబ్బాయి బావున్నాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అన్నింటి కన్నా ముఖ్యంగా నిన్ను ఎంచుకుని కోరి వచ్చాడు. అందుకని నాకు నో చెప్పడానికి కారణాలేం కనిపించడం లేదు" అన్నాడు.

"నిజమేనండీ, ఇద్దరి ఈడూ-జోడూ కుదిరింది. ఇంక ఆలస్యం చేస్తే మనకే నష్టం" అంది యశోదమ్మ.

"నాన్న గారు. మనిషికి మనిషి సాయం అని మీరే అన్నారు. పాపం పరిస్థితులు పెట్టిన పరీక్షలో డస్సి పోయి ఓదార్పు కోరుకుంటున్నారు. నా పెళ్లి కోసం మీరు ఎవరికైనా కట్న కానుకలు ఇవ్వాల్సొస్తుందేమో, ఉన్న ఆ కాస్త డబ్బు పోగొట్టుకుంటే రేపు మీ వృద్ధాప్యాన ఎలా అనే మనో క్లేశం నన్ను నిత్యం వెంటాడేది. డబ్బుకు ప్రాధాన్యమివ్వకుండా మనిషికీ, మనసుకూ ప్రాధాన్యమిచ్చే అతని భావాలు నాకు నచ్చాయి. కాదనే అభ్యంతరం ఏం కనిపించడం లేదు" అంది.

"అయితే రేపు నేను రాజా రావు గారికి, కమలాకర్ వాళ్ల సంబంధం నచ్చిందని, వాళ్లకి తెలియ జేయమని చెబుతాను సరేనా" అన్నాడు.

కాత్యాయని సిగ్గుతో తల వంచుకుంది. యశోదమ్మ సరే అన్నట్టుగా సంతృప్తిగా తల ఊపింది.

***

మరుసటి రోజు ఆఫీసుకు వెళ్లగానే రాజా రావు గారి దగ్గరకు వెళ్లి "కమలకర్ వ్యక్తిత్వం మాకెంత గానో నచ్చింది, ముఖ్యంగా మా అమ్మాయికీ. అతను మాకు నచ్చాడని దయ చేసి వాళ్లకి తెలియ జేయండి" అన్నాడు.

"థాంక్స్ అచ్యుత రామయ్య గారు. మీరేమన్నా చెప్పారా అని అతను రెండు మూడు సార్లు నన్ను అడిగాడు. మిమ్మల్ని అడగడం భావ్యం కాదని నేను మాట్లాడ లేదు. దీన్ని బట్టి మీ అమ్మాయిని అతను ఎంతగా కోరుకుంటున్నాడో మీకు తెలిసిందనుకుంటా" అన్నాడు సంతోషంగా.

అచ్యుత రామయ్య గారు రాజా రావు గారి చేతులు తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా, గట్టిగా నొక్కుతూ "మీరే పూనుకోక పోతే మా అమ్మాయికి ఒక మంచి సంబంధం మిస్సయ్యేది" అన్నాడు.

అయ్య వారు చెప్పిన రోజున ఫార్మల్ గా నిశ్చితార్థం జరుపుకుని, పెళ్లికి మంచి ముహూర్తం పెట్టుకున్నారు. శ్రీ వేణు గోపాలస్వామి గుళ్లోనే నిరాడంబరంగా పెళ్లి జరపాలని నిశ్చయించుకున్నారు.

మనసును ఉల్లాస భరితం చేసే కార్యం ముందున్నప్పుడు రోజులు హడావిడిగా కదిలి పోతాయి. అప్పటికే అచ్యుత రామయ్య గారూ ఇంటికి సున్నం, పేయింట్లు వేయించి, ఇంటి ముందు-శుభకార్యం ఆ ఇంటిలో జరుగుతున్న గుర్తుగా తాటాకుల పందిరేయించి పెళ్లికళ తెచ్చారు. ఎంత నిరాడంబరం అనుకున్నా, ఒక్కగానొక్క కూతురు, తనకున్నంతలో ఏ లోటూ లేకుండా అత్తారింటికి సాగనంపాలనుకున్నాడు.

అక్కడ కమలాకర్ కు కూడా కాళ్లు భూమ్మీద నిలవడం లేదు. రాజా రావు గారింటికి సున్నాలు, పేయింట్లు వేయించాడు. రాజా రావు గారికీ చాలా ఆనందంగా ఉంది కమలాకర్ తన మూలంగా ఒకింటివాడవుతున్నాడని.

కాత్యాయని అంటే గుడి అయ్య వారికి ప్రత్యేక అభిమానం అందుకే ధర్మకర్తల మండలికి ప్రత్యేకంగా చెప్పి పెళ్లికి గుడి ఇప్పించాడు.

అచ్యుత రామయ్య గారూ మొదటి పేజీ మధ్యలో వినాయకుడు అటూ ఇటూ సీతారాములు, శివ పార్వతులూ, మధ్య పేజీల్లో

శుభ ముహూర్త     సమయం, సీతారాముల కల్యాణ శ్లోకంతో ఉన్న అందమైన శుభ లేఖలు అచ్చు వేయించాడు.

అచ్యుత రామయ్య గారికి, కమలాకర్ వాళ్లకూ బంధు గణం తక్కువే, ఉన్న వాళ్లకు, చుట్టు పక్కల వాళ్లకు, ఆఫీసు స్టాఫ్ కు అచ్యుత రామయ్య,కమలాకర్ లు శుభ లేఖలు పంచారు.

భోజనాల కోసం సంప్రదాయ పద్ధతిలో వండి వడ్డించే కేటరింగ్ వాళ్లకు కాంట్రాక్ట్ ఇచ్చారు అచ్యుత రామయ్య గారు. పెళ్లికి కొత్త బట్టలు, నగల షాపింగ్ లతో పెళ్లి రోజు గిర్రున తిరిగి మరీ దగ్గరయింది.

ఆరోజు రాత్రి (మరుసటి రోజు తెల్లవారుజాము అవుతుంది) గం.1.30 లకు ముహూర్తం. ఉదయానే పెద్ద కారు మాట్లాడుకుని అవసరమైన సామానులతో పాటూ, అచ్యుత రామయ్య గారి కుటుంబం గుడికి బయల్దేరింది.

అటు నుంచి కమలాకర్, అతని తల్లీ అవసరమైన సామాగ్రీతో కారులో గుడికి బయల్దేరారు.




ఆ కాలనీ మధ్యలో కొద్దిగా ఎత్తైన గుట్ట మీద వేణుగోపాల స్వామి గుడి ఉంటుంది. గర్భ గుడిలోని విగ్రహం చాలా పురాతనమైంది కానీ, గుడిని గత నాలుగైదేళ్లలో కల్యాణ మంటపం, విడిది గదులు, కుడివైపున గోశాల, ఎడం వైపున ఆఫీసు, ప్రసాదం కౌంటర్లతో

చాలా అభివృద్ధి పరిచారు. వేణుగోపాల స్వామి విగ్రహాన్ని చూస్తున్న కొద్దీ చూడాలనిపిస్తుంది. ఆయన్ను దర్శించుకోవడం ఒక మధురానుభూతిగా అభివర్ణిస్తారు, అంతేకాకుండా మనసులో కోరుకున్న కోరికలు చాలా వరకు తీరతాయని భక్తుల సంపూర్ణ విశ్వాసం.

అచ్యుతరామయ్యగారు, కమలాకర్ వాళ్లు తమ తమ గదుల్లో సామాన్లు పెట్టుకున్నారు. గుడి అయ్యవారు తమ బంధువుల్లోఇద్దరిని పెళ్లి చేయించడానికి ఏర్పాటు చేశారు. ఒకరు అచ్యుతరామయ్య వైపు, మరొకరు కమలాకర్ వైపు వధూవరుల చేత చేయించవలసిన పూజలన్నీ యధావిధిగా చక్కగా చేయిస్తున్నారు.

వచ్చిన వాళ్ళందరికీ ఇది లేదనకుండా టిఫిన్లు, కాఫీలు, భోజనాలు ఏర్పాటు చేశారు అచ్యుతరామయ్యగారు. అందరూ రచులను ఆస్వాదిస్తూ, నెమరు వేసుకుంటూ సుష్టుగా భోజనం చేశారు.

పెళ్లంటేనే అనుభూతుల మేళవింపు. గొప్ప తంతు. సమయం పరిగెడుతూ ముహూర్తానికి దగ్గర చేసింది. వధూవరులిద్దరూ శుభముహూర్తంలో ఒకరి తలపై మరొకరు జీలకర్రాబెల్లం పెట్టుకున్నారు. ఆ తర్వాత బాజాభజంత్రీల మధ్య పచ్చని కాత్యాయని మెడపై పచ్చని తాడుతో మూడుముళ్లేశాడు కమలాకర్.

అప్పటిదాకా విడి విడిగా ఉన్న వాళ్లు ఆ క్షణం నుంచి దంపతులైనందుకు ఆశీర్వదిస్తూ, అభినందిస్తూ ఆహూతులందరూ అక్షతల వర్షం కురిపించారు.

***

ఆ రోజు వాళ్లిద్దరి మొదటి రాత్రి.

రాజారావుగారు వాళ్లింటిమీద తన కోసం ఉంచుకున్న అటాచ్డ్ బాత్ రూం ఉన్న గదిని, చక్కగా అలంకరించి కొత్తజంట సమాగమానికి మ్యారేజ్ గిఫ్ట్ గా ఇచ్చాడు.

విశాలమైన ఆ మేడమీద చాలానే పూల కుండీలున్నాయి. వాళ్లింటి పనిమనిషి పైనున్న గది శుభ్రం చేసి, మొక్కలకు నీళ్లు పోసి, మంచం మీద పక్కబట్టలు సర్ది వెళ్లిపోతుంది. రాజా రావు గారు ఆఫీసు నుంచి వచ్చి, రాత్రి భోజనాలు అయ్యాక మేడమీదకెళ్లి

పోతారు. అక్కడ ఆరుబయట పడక్కుర్చీ వేసుకుని కాసేపు మొక్కల మధ్య గడిపి, అక్కడే పడుకుని, నిత్య కృత్యాలు ముగించుకుని, పేపర్ చదువుకుని కిందకు వస్తాడు. ఆయనకు ప్రత్యేకంగా ఇష్టమైంది ఆ ప్రదేశం. తను పూనుకుని పెళ్లి చేశాడు గనక కొంత బాధ్యత తీసుకుని ఆ గది, ఆ ప్రత్యేకమైన రోజు కోసం వాళ్లకిచ్చాడు.

తెల్లటి పంచ, చొక్కాలో కమలాకర్ మిల మిల మెరిసి పోతూ డాబా మీద కూర్చుని ఉన్నాడు.

ఆకాశంలో ఉన్న ధగ ధగ మెరుస్తున్న పున్నమి చంద్రుడికి, తనకు పోటీగా ఆ మానవమాత్రుడెవరు? అన్న ఆలోచన వచ్చిందేమో, మబ్బులను ఎక్కడికో పంపించేశాడు. నిర్మలంగా, తేటగా ఉంది ఆకాశం.   ఇహ కింద ఏ జరుగుతుందో చూడడానికి సమాయాత్తమయ్యాడు.

చల్లటి గాలితో, కుండీల్లోని పూల గుబాళింపుతో చాలా ఆహ్లాదంగా ఉంది ప్రకృతి. కోడె వయసులో ఉన్నా, అప్పటి దాకా సమాజపు కట్టుబాట్లకు లొంగి, తొంగోబెట్టిన కమలాకర్ లోని కాముడు ఎప్పుడెప్పుడు అతని శరీరం నుంచి కట్లు తెంచుకుని బయటకు పరిగెత్తాలా అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాడు.


కాత్యాయనిని మొట్టమొదటి సారి గుడిలో చూసినప్పుడు మనసూ, శరీరం అదుపు తప్పాయి. తను ఎదుర్కొన్న పరిస్థితిలు తనలోని సున్నితమైన భావాలకు సంకెళ్లేశాయి. ప్రేమ అని వెంబడించేంత ఓపిక లేదు. పైగా ఆమె సంప్రదాయ బద్ధంగా ఉంది. ఆమెని ఇబ్బంది పెట్ట కూడదు అన్నది తన మనో నిశ్చయం. అందుకే వీలున్నప్పుడల్లా ఆ అందాన్ని, అణకువనీ చూస్తూ భువిలోని ఆ పారిజాతాన్ని ఎలా సొంతం చేసుకోవాలా అని ఎదురు చూశాడు. ఆమెని చూడడానికి అమెరికా సంబంధం వస్తే, ఇహ కాత్యాయని తనకు దక్కదన్న స్థిర నిర్ణయానికి వచ్చేశాడు. కానీ ఆ సంబంధాన్ని ఒద్దని తిప్పి కొట్టారని తెలిసి ఆనందం అర్ణవమైంది. ఇహ ఆలస్యం చేస్తే కాత్యాయని తనకు దక్కదు ఎలా? అని ఆలోచిస్తుంటే తన ఇంటి ఓనర్ రాజా రావు గారితో, అచ్యుత రామయ్య గారు రావడం కనిపించింది. మనసుకు ఎందుకో వెయ్యేనుగుల బలం వచ్చింది. పంచ కళ్యాణిలా పరిగెత్తింది. సరా సరి వెళ్లి రాజా రావు గారి పాదాల మీద వాలి పోయాడు 'అన్యథా శరణం నాస్తి' అన్నట్టు. ఆయన కరిగి పోయి తమ పెళ్లికి నడుం బిగించాడు.

చుట్టూ ఉన్న ప్రకృతిని చూస్తూంటే, అతనిలో అల్లరి ఆలోచనలు కలగ సాగాయి..కొద్దిదూరంలో కుండీలో సంపూర్ణంగా విరిసిన తెల్ల గులాబీ, గాలికి అల్లన మెల్లన ఊగిసలాడుతూ నవ్వులు రువ్వుతున్నట్టుగా ఉంది. 'మరి కాసేపట్లో నా కాత్యాయని వస్తోంది, అప్పటి దాకా నువ్వెంత అందగత్తెవో అన్న పొగరును అనుభవించు తర్వాత నువ్వు ముడుచుకు పోవలసి వస్తుంది'. గుత్తులుగా ఉన్న పూలతో నాజూగ్గా ఉన్న సన్న జాజి కొమ్మ గోడల మీద పాకుతూ వయ్యారాలు పోతోంది. 'కాత్యాయని నడుం ముందు నీ తీగ దిగదుడుపే, ఇప్పుడే గోడ దూకేయ్ తర్వాత తట్టుకోలేవ్'. మంద్రంగా వీస్తున్న గాలితో 'తను ఒచ్చాకా ఇలాగే సువాసనా భరితంగా వీయాలి సుమా, అది నీకే గొప్పతనాన్ని చేకూర్చుతుంది' ఇలా భావ ప్రవాహంలో ఉన్న అతనికి డాబా తలుపు తీసిన చప్పుడైంది. ఆలోచనల్నుంచి బయట పడి అటు వైపుగా చూశాడు. లోపలికి వచ్చిన కాత్యాయనిని అలా రెప్ప వేయకుండా

చూస్తూండి పోయాడు.

ఆమె తల వంచుకుని అడుగులో అడుగు వేసుకుంటూ వస్తోంది, వెనకాల తలుపులు మూత పడ్డాయి. ఇద్దరి తలపుల మూతలు తెరవ బడ్డాయి.తెల్లని చీరలో మెరిసి పోతూ, అవసరమైన నగలతో, అలంకరణతో అద్భుత సౌందర్య రాశిలా కనబడుతోంది.

తను తేరుకుని మునివేళ్లతో ఆమె చేయందున్నాడు. మొట్ట మొదటి సారి తండ్రి కాకుండా పరాయి మగాడు ముట్టుకున్నందుకు కలిగే ప్రకంపన ఆ చేతుల ద్వారా అనుభవమైంది. ఆమెని నెమ్మదిగా తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు. అతనికి తెలుసు..




మొదటి సమాగమానికి హడావుడి పడకుండా నేర్పుగా, ఓర్పుగా వ్యవహరిస్తే వందేళ్ల సంసార జీవితానికి పటిష్టమైన పునాది పడుతుందని.

"కాత్యాయనీ నిజానికి నువ్వు స్వర్గంలో ఉండాల్సిన దేవ కాంతవు. నిన్ను చూసింది మొదలు నిన్ను పొంద గలనో లేదో అన్న భయం నన్ను వెంటాడింది. నీ అందం సంపూర్ణ వికసిత పుష్పమైతే, సౌశీల్యం తావి.

నేను అన కూడదు కాని నువ్వు అమెరికా సంబంధానికే తగిన దానివి, ఎందుకంటే, నిన్ను కాలు కింద పెట్టకుండా చూసుకో గల

ఐశ్వర్యం వారికుంటుంది. స్వర్గంలో ఉండాల్సిన దానివి భూమి మీదకు వచ్చావు, మళ్లీ స్వర్గానికి వెళ్ల లేవు కదా ! అది నాకు దక్కిన వరం. హృదయ పూర్వకంగా చెబుతున్నాను- నేను ఏ జన్మలోనో భగవంతుడి చరణాల మీద అత్యంత భక్తి ప్రపత్తులతో రెండు పుష్పాలు వేసుంటాను. దాని ప్రతి ఫలమే నువ్వు నాకు దక్కడం. ఈ స్పృహ నా జీవితాంతం కలిగి ఉంటాను.

మధ్య తరగతి వాణ్ని గనక నిన్ను గొప్పగా చూసుకో లేక పోవచ్చు, కాని అపురూపంగా, జాగ్రత్తగా చూసుకుంటాను.

ప్రమాణం చేస్తున్నాను. నువ్వూ మాట్లాడు కాత్యాయని" అన్నాడు ఆమె చుబుకం ఎత్తి.

తనను ఎదురుగా పెట్టుకుని పొగడడం ఆమెను కొద్ది క్షణాల పాటు అత్తిపత్తిని చేసింది. తేరుకుని- "మనకు సమాజంలో ఆడ పిల్లలు తండ్రి నిరాదరణకు గురవడం తెలుసు. కానీ ఆడపిల్లే తనకు తను మానసికంగా కుంగి పోవడం ఈ పెళ్లిళ్ల వల్ల జరుగుతుంది. మగ పెళ్లి వారి కట్న దాహం, కానుకల లిస్ట్, గొంతెమ్మ కోరికలు ఆమె తండ్రిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే, 'అందుకే తన తండ్రి తను పుట్టంగానే అంతలా అల్లల్లాడి పోయాడు, అలా చూశాడు అన్న తలంపు' కలుగుతుంది.

డబ్బు ఎన్నటికీ ప్రధానం కాదండి. మనసు ముఖ్యం. పెళ్లయ్యాక 'బరువును వదిలించుకున్నా'నన్న రిలీఫ్ ను మా నాన్న ముఖంలో చూడలేదు. దానికి కారణం మీరు. ఈ రోజు నుంచి మనసా వాచా మీకే అంకితం. మా అమ్మ అంటుండేది 'ఆడ పిల్లకు మనసును అంటి పెట్టుకునే వాడు దొరకడం అదృష్టమని..అది పెళ్లి చూపుల్లోనే తెలిసింది" అంది.

రాత్రి పన్నెండయింది.

అక్కడక్కడా వెహికిల్స్ వెళుతున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దం లోకి జారుకుంటోంది. గాలిలో చల్లదనం పెరిగింది. అర్ధ రాత్రికి పరిపూర్ణంగా విచ్చుకున్న పుష్పాలు సువాసనల్ని గాలి పొరలపై పేరుస్తున్నట్టున్నాయి, అక్కడి వాతావరణం సుగంధ భరితమైంది.

మనసు లోని మదనుడు కమలాకర్ ను, రతీ దేవి కాత్యాయనిని అల్లరి చేస్తున్నాయి. ఇంత వరకూ వాళ్లు అనుభూతించని అవ్యక్తమైనవేవేవో మనసు లోనూ, శరీరం లోనూ కలుగుతున్నాయి. జరుగుతున్నాయి.

అయస్కాంతం లోని ఉత్తర దక్షిణ ధృవాలు లటుక్కున కలవడానికి తొందర పడుతున్నట్టు, కలయిక కోసం వాళ్ల శరీరాలు ఉబలాట పడుతున్నాయి.

"చలి పెరుగుతోంది లోపలికి వెళదామా?"అన్నాడు కమలాకర్.

"ఊఁ.."అంది సిగ్గుతో!

ఆమె దగ్గరకి వెళ్లి రెండు చేతులతో పొదివి పట్టుకుని గది వైపుగా తీసుకెళ్ళాడు.     బయట నుంచి వేసున్న గడె తీశాడు.

లోపలి నుంచి సవాసన భరితమైన చల్లని గాలి ఇరువురిని సోకింది.

ఇద్దరి శరీరాలపై ఉన్న నూగారు చైతన్య వంతమైంది.

లోపలికి అడుగు పెట్టారు.

ఎదురుగా పెద్ద వికసించిన తామర దాని చుట్టూ రక రకాల పూలు అమర్చి ఉన్నాయి. మంచమూ గులాబులతో,

తెల్ల చామంతులతో ముస్తాబై ఉంది. గోడల మీద అక్కడక్కడా శృంగార భావాలను ఉద్దీపింప జేస్తూ

వాత్స్యాయన కామ సూత్రాల కేలండర్లు.

ఆమెని మంచం మీద కూర్చో బెట్టి, తను వెళ్లి తలుపుకి గడె వేసి వచ్చాడు.

మంచం పక్కనే టీ పాయ్, దానిపై ఇత్తడి పల్లెంలో రక రకాల పళ్లు, రెండు గ్లాసుల పాలు.

పక్కన ఒక అందమైన లేత గులాబీ రంగు ఉత్తరం. తీసి చదివాడు.

డియర్ కొత్త దంపతులూ!

మీ ఇద్దరి జీవితల్లోనూ ఈ రాత్రి ప్రత్యేకం. ఇది మీ మనసులో ఎంతలా ముద్రించుకు పోతే మీ వైవాహిక బంధం అంత సుదృఢ మవుతుంది.

ఈ రాత్రికి ఓ ప్రత్యేకతను అందిస్తూ కలిసిపోండి, కరిగిపోండి.

మీ రాజారావంకుల్.

ఆమె వంక చూశాడు.      కిటికీ లోంచి జాలు వారుతున్న వెన్నెల, మంచం మీద కూచున్న

ఆమె మీద పడి పాల రాతితో తీర్చిదిద్దిన అప్సరసలా భాసిస్తోంది. మంచం మీద కూర్చుని ఆమెని తన వైపుగా తిప్పుకున్నాడు.

ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకుని ఆమె ఎర్రని పెదాలపై గాఢ చుంబనాన్ని ముద్రించాడు.

"ముద్దు తియ్యగా ఉంటుందని చదివి, దానికి తియ్యని రుచి ఎలా వస్తుందని అనుకునే వాణ్ని? ఇప్పుడర్థమైంది.

తియ్యదనానికి పై మాట తెలియక మన వాళ్లు అక్కడితో వదిలేశారని." ఆమె చెవిలో గుస గుసగా అన్నాడు.

అతని పెదవుల కదలికలు ఆమె నాజుకైన చెవులకు తాకి గిలిగింతలు రేపాయి. ఒళ్లంతా పువ్వై విచ్చుకుంటోంది.

సుగంధాలు వెదజల్లుతోంది. అతను ఆమె పాదాల వేళ్ల నుంచి ప్రారంభించి చూపుడు వేలితో స్పృశిస్తూ,


అలా..అలా పైకి వస్తూ పలుచని నడుముని దాటి ఎత్తైన పర్వతాల పై కి చేరబోతుంటే ఆమె పరవశంతో వివశురాలైంది.

అతను కళ్లెం విడిచిన గుర్రం అయ్యాడు.

మధు పాత్ర ఒలికింది.

ఇద్దరూ తాగినంత తాగారు. మళ్లీ..మళ్లీ తాగారు. ఆద మరిచి ఒకరి నొకరు అల్లుకు పోయి,

సొమ్మ సిల్లి పోయినట్టు పడుకుండి పోయారు.




బాగా పొద్దెక్కాక ఇద్దరూ ఫ్రెషై కిందకి వచ్చే సరికి రాజా రావు గారింటిలో ఆయన, ఆయన భార్యా, అచ్యుత రామయ్య గారు, యశోదమ్మ కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకొంటున్నారు. వీళ్లని చూడగానే ముందుగా రాజా రావు గారు "ఏం కొత్త దంపతులూ మా ఇంట్లో ఇబ్బదేం కలగ లేదుగా?"అన్నాడు నవ్వుతూ.

ఇద్దరు సిగ్గు పడి పోయి ఆయన కాళ్లకు దణ్ణం పెట్టారు.

అయన ఇద్దర్నీ లేపి "ఎప్పుడూ ఇలాగే కలిసి మెలిసి సంతోషంగా ఉండాలి"అన్నాడు.

ఆ తర్వాత వాళ్లు రాజా రావు గారి భార్యకి, అచ్యుత రామయ్య గారికి, యశోదమ్మ కాళ్లకి దణ్ణం పెట్టారు.

వాళ్లందరి కనుల పండువగా ఉంది ఆ జంట.

ఆ ఇంట్లోనే మూడు రాత్రులను మనసులో కమ్మని మరచి పోలేని మధురానుభూతుల ముద్రికగా నమోదు చేసుకున్నారు.

***

కొత్త దంపతులు ఉండడానికి రాజా రావు గారి ఇల్లు చాలనందున కమలాకర్, ఆఫీసు దగ్గరలో డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్ తీసుకుని కాపురం పెట్టాడు. అతను ఇల్లు ఖాళీ చేసేప్పుడు రాజా రావు గారికి ఎంతో బాధ కలిగింది. సొంత కొడుకే వేరు వెళ్లి పోతున్నంత దుఃఖం కలిగింది. ఇద్దరికీ బట్టలు, స్వీట్లు పెట్టాడు.

"మీ ఇద్దరూ నా పిల్లలు. ఏ అవసరం వచ్చినా నిస్సంకోచంగా మనింటికి రావచ్చు" అన్నాడు డగ్గుత్తికతో.

***

ఆఫీసు దగ్గరలో శ్రీ గాయత్రీ అపార్ట్ మెంట్ గ్రౌండ్ ఫ్లోర్లో ఫ్లాట్ తీసుకుని అక్కడికి షిఫ్ట్ అయ్యారు వాళ్ళు.

పేరుకు తగ్గట్టే శ్రీ గాయత్రీ అపార్ట్ మెంట్ అక్కడున్న ఇతర అపార్ట్మెంట్లలో కడిగిన ముత్యంలా, కింద పార్కింగ్ ఏరియా చుట్టూ తులసి, మందార, మరువం, దవనం లాంటి చెట్లతో, వాటి మధ్య కొలువు దీరిన గాయత్రీ అమ్మవారి ప్రతిమతో తో , వచ్చిన వాళ్లకు పవిత్ర భావన కలగజేస్తూంటుంది. నాలుగు రోడ్ల కూడలిలో ఉండడం మూలానూ, బస్టాప్, హాస్పిటల్, సినిమా హాల్స్ అన్నీ దగ్గరే. అందుకే రెంట్ కూడ కాస్త ఎక్కువే. ఓనర్లు కమలాకర్ ఫ్రెండ్ కు తెలుసున్నవాళ్ళు అవడంతో అతనే ఆ ఇంటిని కమలాకర్ కు అద్దెకి ఇప్పించాడు.

కొన్ని అవసరమైన వస్తువులు అచ్యుత రామయ్య గారు కొనిచ్చారు. మరికొన్ని గిఫ్ట్స్ గా వచ్చాయి. ఫ్లాట్ లోని గదుల్లో అన్ని సామానులు నీట్ గా సర్దింది కాత్యాయని.

ఒక బెడ్ రూం కమలాకర్ వాళ్లమ్మకీ, రెండోది వాళ్లిద్దరికీను.

బెడ్రూం వాళ్లిద్దరికీ ప్రత్యేకమైంది కావడంతో డబల్ బెడ్ కాట్, వాటిపై మెత్తని పరుపు, తెల్లటి దుప్పటీ, లైట్ గులాబీ కలర్ పిల్లోస్,

పక్కన టీపాయ్, దానిపై కృష్ణుని గాఢ పరిష్వంగంలో వివశురాలైన రాధ పాల రాతి బొమ్మ, పళ్లు పెట్టుకునే బుట్ట, గోడలకి శృంగారానికి ఉత్ప్రేరకంగా నిలిచే పెయింటింగ్స్, చక్కగా, అందంగా సర్దుకున్నారు. వాళ్ల బెడ్రూం కి ఉన్న రెండు గోడలకీ రెండు కిటికీలున్నాయి. వాటికి అటు సైడు దట్టంగా ఉన్న పూల మొక్కలూ, సువాసన మొక్కలూ ఉంటాయి. అందువల్ల కిటికీ లోంచి కమ్మటి సువాసన అన్నివేళలా వస్తూంటుంది. ఆ ఇల్లు అదృష్టవశాత్తు వాళ్లకి దొరికింది. ఆ గదిలో ఆ దంపతులకు ప్రతి రాత్రీ వసంత రాత్రే!

కమలాకర్ జీతం కూడా మంచిదే అవడంతో అయిదారు నెలల్లో ఇంటికి కావలసిన హంగులు సమకూర్చాడు.

అప్పుడప్పుడూ వాళ్లింటికొచ్చి చూసి వెళుతున్న అచ్యుత రామయ్య గారు యశోదమ్మలు, తమ పిల్లను యువ రాణీలా చూసుకుంటున్న అల్లుని మంచితనానికి మనసులో ప్రణామాలర్పిస్తూ, మనసంతా ఆనందాన్ని నింపుకుని వెళుతున్నారు.

ఆనందం అనేది కాల చక్రానికి కందెన (ఆయిల్). అది ఎటువంటి ఇబ్బంది లేకుండా గిర్రున తిప్పేస్తుంది.

సంవత్సరం అయింది. కమలాకర్ కు మంచి ఇంక్రిమెంట్ వచ్చింది.

ఆ ఆనందంలో తన తల్లికీ, రాజా రావు గారికి, ఆయన భార్యకు, అత్త మామలకు పెద్ద హోటల్లో మంచి పార్టీ ఇచ్చి ఖరీదైన బట్టలు పెట్టాడు.

ఇంటికొస్తున్నప్పుడు అచ్యుత రామయ్య గారు 'రాజా రావు గారు, మరో తండ్రిలా బాధ్యత వహించి కాత్యాయనికి మంచి సంబంధం చూశారని' భార్యతో ఎన్నిసార్లు అన్నాడో.

కమలాకర్ దంపతులతో సహా అందరూ పిల్లల కోసం చూస్తున్నారు.

ఆ వరం కూడా భగవంతుడు ప్రసాదిస్తే వాళ్లది బ్లెస్డ్ లైఫ్!

అయితే అన్నీ మనమనుకున్నట్టుగా జరిగితే ఇంకేముంది? అనూహ్యమైన సంఘటనలు జరగాలి. అప్పుడే షడ్రుచులున్న జీవితం అవుతుంది. అసలు అందు కోసమే కొంత మందిని ముందు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి చేసి తర్వాత జీవితాలతో ఆడుకుంటుంది విధి.

అదే జరిగింది వాళ్ల జీవితం లోనూ!




కమలాకర్ ఆఫీసులో తన సెక్షన్ నుంచి మరో సెక్షన్ కు వెళ్లాలంటే రెండు ఫ్లోర్లు మెట్లెక్కాలి. ఆ ఆఫీసులో లిఫ్ట్ సౌకర్యం లేదు. అదో ఎక్సర్ సైజ్ గా ఉంటుందని చక చక మెట్లెక్కేవాడు. కాని ఈ మధ్య మెట్లెక్కుతుంటే ఆయాసం వస్తోంది. పెళ్లయిన కొత్త, పెళ్లాం మనసు పెట్టి వండే వంటలు అద్భుతంగా ఉంటున్నాయి కాబట్టి పొట్టెక్కువై అలా ఆయాసం వస్తోందనుకున్నాడు. ఒక పది రోజుల పాటు డైట్ కంట్రోల్ చేసి చూశాడు. అయినా ఆయాసం వస్తోంది. నాలుగు మెట్లెక్కే సరికి గుండె వేగంగా కొట్టుకుంటోంది. కొద్ది సేపు ఆగి మెట్లెక్కాల్సొస్తోంది. ఈ మధ్య తరచూ చెమటలు కూడా పడుతున్నాయి. ఎందుకైనా మంచిది డాక్టర్ కు చూపించుకుంటే మంచిదనుకుని రాత్రి కాత్యాయనితో చెప్పాడు.

"అయ్యో, అదేంటండి. డాక్టర్ కి చూపించుకోడం ఎంతైనా మంచిది" అంది ఆందోళనగా.

"నువ్వు గాబరా పడకు, రేపు వెళతాలే" అన్నాడు.

"ఊహూ ఇప్పుడే వెళ్లి చూపించుకుందాం. మన అపార్ట్ మెంట్ కు రెండు అపార్ట్ మెంట్స్ అవతల డాక్టర్ క్లినిక్ ఉంది. ఆయన బాగా చూస్తాడట. పక్కింటావిడ మాటల సందర్భంలో చెప్పారు" అంది.

"కాత్యాయనీ రేపు వెళదామన్నానుగా"అన్నాడు కాస్త విసుగు మాటల్లో కనబరుస్తూ.

"పక్కనే కదండీ, కాస్త తినేసి అలా వాకింగ్ చేస్తూ వెళ్లి చూపించుకుందాం. సమయానికి చెప్పకపోవడం వల్ల ఇప్పటికే ఆలస్యమైంది. డాక్టరు గారు చూసి బలానికి మంచి మందులు రాసిస్తే కాస్త ధైర్యంగా ఉంటుంది"అంది బేలగా.

"నువ్విలా హడావుడి చేస్తావనే చెప్పలేదు.. సరే వెళ్దాం లే" అన్నాడు నీరసన్గా నవ్వుతూ.

రాత్రి లైట్ గా భోజనాలు చేశాక, నడుచుకుంటూ క్లినిక్ కు వెళ్లారు.

క్లినిక్ లోపల ఒక చిన్న టేబుల్, అక్కడో రిసెప్షనిస్ట్, ఆమెకి ఎదురుగా ఒక వరసలో నాలుగు కుర్చీలున్నాయి. వాటి ఎదురుగా టీపాయ్ మీద తెలుగు, ఇంగ్లీష్ పేపర్, ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఉన్నాయి. 'ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చెయ్యాలి, ఏం తినాలి' అన్న విషయాల మీద తెలుగులో మంచి పోస్టర్లు అతికించి ఉన్నాయి.

వీళ్లెళ్లే సరికి చివరి పేషేంట్ కూడా డాక్టరుకు చూపించుకుని, వీళ్ల ముందు నుంచే వెళ్లిపోయాడు. రిసెప్షన్ లో కన్సల్టేషన్ ఫీజు చెల్లించి, ఆమె ఇచ్చిన ఫైల్ తీసుకుని లోపలికి తీసుకుళ్ళారు.

"రండి..రండి" అన్నాడు నవ్వుతూ డాక్టర్.

డాక్టర్ పాతికేళ్ల కుర్రాడు. చలాకీగా ఉన్నాడు. అతన్ని చూసే సరికీ ఇద్దరికీ తెలియని ధైర్యం వచ్చింది.

ఆయన ఎదురుగా కూర్చుని తన సమస్య చెప్పాడు కమలాకర్.

అతను స్టేతస్కోప్ ని కమలాకర్ గుండె పైనా, వెనక్కి తిరగమని వీపు పైనా ఉంచి పరీక్షించి "మీకేమైనా సిగరెట్లు, మందు తాగడం లాంటి అలవాట్లున్నాయా?"అనడిగాడు.

"లేవండీ"అన్నాడు కమలాకర్.

"అయితే వర్రీ అవ్వాల్సినదేం లేదు. కొన్ని విటమిన్, ఐరన్ ట్యాబ్లెట్స్ ఇస్తాను, అంతా సర్దుకుంటుంది. వన్ వీక్ తర్వాత ఒక సారి రండి" అన్న డాక్టర్ మాటలతో ఇద్దరి మనసులూ తెరిపిన పడ్డాయి.

***

కమలాకర్ కు రెండు రోజులు బాగానే అనిపించింది. మెట్లు కూడా రెండు మూడు సార్లు ఎక్కి దిగాడు. ఏమీ అనిపించలేదు. అదే విషయాన్ని 'మీకిప్పుడు ఎలా ఉంది?' అని రోజూ అడుగుతున్న భార్యతో పంచుకున్నాడు.

ఒకసారి మూడో అంతస్తులో ఫ్లోర్ ఇంచార్జ్ దగ్గరకెళ్లి కొన్ని ఇంపార్టెంట్ మ్యాటర్స్ డిస్కస్ చెయ్యవలసి వచ్చింది. రెండు ఫైల్స్ తీసుకుని మెట్లెక్కుతున్నాడు. గుండె చిక్కబట్టినట్టు అనిపించింది. విపరీతంగా చెమటలుపట్టాయి. మెట్ల రెయిలింగ్ కానుకుని నుంచుండి పోయాడు.

అదృష్టవశాత్తు అప్పుడే మెట్లు దిగి వెళ్లబోతున్న భాస్కర్ "ఏంటి సార్? ఏమైంది" అంటూ ఆందోళనగా కమలాకర్ దగ్గరకు వచ్చి, జాగ్రత్తగా పట్టుకుని కిందకి తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు.

అందరూ చుట్టూ ముట్టారు. డి జి ఎం వచ్చి "వాట్ హేపెండ్ కమలాకర్?"అన్నాడు. పేలవంగా నవ్వాడు కమలాకర్.

తన అసిస్టెంట్ ను పిలిచి 'కమలాకర్ ను ఇంట్లో దింపితే, రెస్ట్ తీసుకుంటాడు. వెళ్లి ఆ పని చూడు' అన్నాడు.

కమలాకర్ ను కార్లో ఎక్కించి, ఇద్దరు స్టాఫ్ చెరో పక్కా కూర్చుని ఇంటికి పోనిచ్చారు.

డోర్ బెల్ మోగంగానే, వెళ్లి తలుపు తీసిన కాత్యాయని తన భర్తకి చెరోపక్కా ఇద్దరు వ్యక్తులుండడం గమనించి "ఏమైందండి?"అంది ఏడుపుగొంతుతో.

"ఏం లేదమ్మా, సార్ కాస్త వీక్ గా ఉన్నారు. ఇంట్లో రెస్ట్ తీసుకుంటారని పట్టుకొచ్చాం. అంతే" అన్నాడు వాళ్లలో ఒకతను. వాళ్లు కమలాకర్ ను ఇంట్లో సోఫా దాకా తీసుకొచ్చి, అక్కడ కూర్చోబెట్టి "మేడం మేము వెళతాం"అన్నారు.

"మీకు కనీసం కాఫీ కూడా ఇవ్వలేదు.."అంది నొచ్చుకుంటున్నట్టు.

"పర్వాలేదు మేడం"అంటూ వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లిపోయాక వెనక్కి తిరిగి చూస్తే..

v



"ఇప్పుడే డాక్టరు గారు బయటకొచ్చి నాతో మాట్లాడారు. అబ్బాయికి ఏం ఫర్వాలేదట. నువ్వు వర్రీ అవుతుంటావని చెబుతున్నాను. రాజారావంకుల్ పది నిముషాల క్రితం ఇంటికి వెళ్లాడు. నాతో పాటూ ఉంటాననే అన్నాడు. నేనే వద్దన్నాను. ఆయన రేపు ఆఫీసుకి వెళ్లాలి కదా! నాకిక్కడ బానే ఉంది. నువ్వు హాయిగా రెస్ట్ తీసుకో. మీ అత్తగార్నీ, అమ్మని జాగ్రత్తగా చూసుకో. ఆవిడకీ అబ్బాయి విషయం చెప్పి బాధ పడొద్దని చెప్పు. సరేనా" అన్నారు అచ్యుత రామయ్య గారు.

ఆ మాటలు విన్నాక ఆమె మనసు కొంత కుదుట పడింది.

భోజనాలు చేస్తున్నప్పుడు అమ్మకు, అత్తమ్మకూ కూడా విషయం చెప్పింది. వాళ్ల మనసులూ తేటపడ్డాయి.

***

అసలు హాస్పిటల్లో ఉండడమంటే పేషెంట్ తో పాటు అతనితో ఉండే వాళ్లకూ ఓ భీతి గొలిపే అనుభవం. బాధలతో నరక యాతన అనుభవిస్తూ వచ్చేవాళ్లు, మూల్గులు, ముక్కులు, ఏడుపులు, పెడబొబ్బలు వీటన్నింటి మధ్యా ఆనందంగా డిస్చార్జ్ అయి వెళుతున్న వాళ్లు, 'తమకీ అలాంటి రోజు వస్తుందా?' అనుకునేవాళ్లు. హాస్పిటల్లో బెడ్ కో బాధ ఉంటుంది. ఒక్కో రూమ్ కూ ఒక్కో హృదయ విదారక చరిత్ర. వాళ్లందరినీ చూస్తుంటే మానవ జన్మ ఎందుకు ఎత్తామా? అనిపిస్తుంది.

పై వాటికి తోడు పేషెంట్ ఐ సి యూలో ఉంటే బయట ఉండే వాళ్లకు అదింకా భయానకం. సిస్టర్లు, డాక్టర్లూ ఐ సి యూ డోర్స్ తీసుకుని ఎవరి కోసమొస్తున్నా బయట ఉన్నవాళ్ల గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఒక వేళ అలా నర్స్ లు బయటకు వచ్చి లోపలున్న పేషెంట్ కు మందులు తేవడానికో, బిల్లు కట్టమని చెప్పడానికో లేక 'ఫలానా పేషెంట్ కు సంబంధించిన వాళ్లు వచ్చి కలవాలని' అరచి చెబితే, 'తమకే వార్త చెబుతారో' అని గుండె డబల్ స్పీడ్ తో కొట్టుకుంటుంది.

మూడ్రోజులు ఐ సి యూలో పూర్తయ్యాక కాత్యాయన్నీ, అచ్యుత రామయ్య గారినీ డాక్టర్ తన క్యాబిన్ కు పిలిపించుకుని 'అతని కండీషన్ సెవెర్లీ కాంప్లికేటెడ్, ఆపరేషన్ చెయ్యాలి. దానికి లక్షల్లో ఖర్చవుతుంది. మీరు 'ఊ' అంటే స్టార్ట్ చేసేద్దాం"అన్నాడు.

ఆ మాటలు విని ఎదురుగా కూర్చున్న ఇద్దరి గుండెలూ జారి పోయాయి.

"అంటే సుమారుగా ఎంత అవుతుంది డాక్టర్?" కాత్యాయని నోటి నుంచి మాటలు పేలవంగా వెలువడ్డాయి.

డాక్టర్ పేపరు మీద ఎస్టిమేషన్ వేసి ఎక్స్ ప్లెయిన్ చేశాడు.

అది చూశాక ఇద్దరి కళ్లలో నీళ్లు తిరిగాయి.

"డాక్టర్ గారూ..అంత డబ్బు.."కాత్యాయని బాధతో మాటలు తడబడుతూండగా అంది.

"తెలుసమ్మా..కానీ ఏం చేయలేం. బయట నుంచి ఎక్స్ పర్ట్ కార్డియాక్ టీం ను తెప్పించాలి. మన హాస్పిటల్ ఎక్స్ పెన్సెస్ లో అంటే చాలా వరకూ డిస్కౌంట్ ఆఫర్ చేయవచ్చు. కానీ బయట వాళ్లతో అంటే కష్టం" కళ్ల జోడు లోంచి సూటిగా చూస్తూ అన్నాడు.

"పోనీ డబ్బులు అరెంజ్ అయ్యే వరకూ మెడిసిన్స్ ఇస్తూ.." అంది బాధగా..

"కొంత వరకూ ప్రొలాంగ్ చెయ్యొచ్చు బట్ పేషెంట్ లైఫ్ నో గ్యారంటీ, డెసిషన్ హాస్ టు బి టేకెన్ యాస్ సూన్ యాస్ పాజిబుల్ "అని లేచాడు ఇహ తనకు వేరే పనుందన్నట్టుగా..

అతనికి హెల్త్ ఇన్సూరెన్స్ లేదు. బ్యాంక్ బ్యాలెన్స్ లు, మనీ రిజర్వ్స్ చూశారు కాత్యాయనీ, అచ్యుత రామయ్య గారు. లక్షన్నర ఉంది. ఆఫీసులో అతను ఇంకా పర్మనెంట్ కాలేదు. సంస్థ నుంచి ఏమీ రావు.

అచ్యుత రామయ్య గారు తను పోస్టాఫీసు లో ఫిక్స్ డ్ చేసింది డ్రా చేసి ఆపరేషన్ చేయిస్తానన్నాడు. కానీ కాత్యాయని "నాన్నా.. మీరూ పెద్దవాళ్లవుతున్నారు. ఇన్నాళ్లూ కష్ట పడి పోగేసిందంతా మా కోసం ఖర్చు పెడితే రేపు అమ్మకు కానీ మీక్కానీ ఏమైనా వస్తే ఎవరు చూసుకుంటారు? కొద్దిగా టైం తీసుకుని ఆలోచిద్దాం. భగవంతుడు ఏదైనా దారి చూపిస్తాడేమో" అంది బాధగా.

ఆపరేషన్ తర్వాత చేయించుకుంటామని కాత్యాయని చెప్పిం తర్వాత రెండు రోజులు జనరల్ వార్డ్ లో ఉంచి కమలాకర్ ను

పదిహేను రోజుల కో మారు చూపించాలని అడ్వైజ్ చేస్తూ, మెడిసిన్స్ ఎలా వాడాలో, ఏ టెస్ట్ లు చేయించాలో చెప్పి డిస్ చార్జ్ చేశారు.

యాభై ఐదు వేలయింది. అంతా అచ్యుత రామయ్య గారే ఖర్చు పెట్టారు. అప్పటికి ఆయన దగ్గరా అంత డబ్బు లేదు. రాజా రావు గారు పది వేలు సర్దు బాటు చేశాడు.

అందరికీ మనసంతా వికలం అయి పోయింది.

కమలాకర్ పేలవంగా నవ్వుతూ అందరితో మాట్లాడుతున్నాడు కానీ తన ఆరోగ్య సమస్య అందరినీ కృంగ దీస్తోందని అర్థమవుతోంది. ఏం చెయ్యడానికీ పాలు పోని పరిస్థితి.

మానసికంగా వీక్ అయిపోయాడు. ఇంటి కొచ్చాక కూడా నాలుగడుగు లేస్తే అతనికి దమ్మొస్తోంది. వెంటనే మంచం మీద పడుకుండి పోతున్నాడు.

అతన్ని చూస్తుంటే కాత్యాయని కడుపు తరుక్కు పోతోంది.

ఇలా అయితే జరుగుబాటు ఎలా? ఆపరేషన్ ఎలా? అందరూ పరామర్శించి పోతున్నారు. వీలైనంత తొందరగా ఆపరేషన్ చేయించమని హెచ్చరికతో కూడిన అభ్యర్థన ముందు పెడుతున్నారు. కానీ ఎవరూ సొల్యూషన్ చెప్పడం లేదు. పోనీ తను ఉద్యోగం చేసి ఇంటిని చూసుకుందామంటే, చదివింది పది వరకే! తనకి ఉద్యోగమెవరిస్తారు? ఏం చేయాలి? ఏం చేయాలి?? ఆలోచనలు ఆమె మనసును గిర గిరా తిప్పేస్తున్నాయి.

జీవితంలో మొట్టమొదటి సారి ఆమెకి మాడునొప్పి వచ్చింది.




జీవితం ఉన్నట్టుండి నిస్సారంగా తయారైంది కాత్యాయనికి. ఒక వైపు భర్త, మరో వైపు కళ్లు లేక కొడుకు పరిస్థితికి మనసు లోనే మధనన పడుతున్న అత్తగారు.

కమలాకర్ ఏవీ చేయలేని తన పరిస్థితికి కుమిలి పోతూ, 'కాత్యాయని నీకు అన్యాయం జరిగి పోయింది. నన్ను క్షమించు. ఈ వ్యాధి నాకే రావాలా?' అని అంటుంటాడు.

'సమస్య వచ్చినప్పుడే మనో ధైర్యం తెచ్చుకుని గట్టిగా ఎదుర్కోవాలి' అని భర్త డిప్రెషన్ లోకి పోతాడని సాంత్వన వచనాలు చెబుతుంది. భర్తకు అనునయ వాక్యాలు చెబుతోంది కానీ కాత్యాయనిని వాస్తవం పెద్ద పర్వతంలా భయపెడుతోంది. అన్ని దారులూ మూసుకు పోతే అల్లల్లాడే పరిస్థితి తనది.

బ్యాంకులో ఉన్న డబ్బు తీసి పొదుపుగా, జాగ్రత్తగా ఖర్చు చేస్తూ కాలం గడుపుతోంది. అతని మందులకు, టెస్ట్ లకూ ఎక్కువ ఖర్చవుతోంది. ఇలా అయితే ఆపరేషన్ మాట దేవుడెరుగు ముందు ముందు జీవించడం కూడా దుర్భరమయి పోతుంది. నిర్వికారంగా తన పని తను చేసుకు పోయే కాలానికి ఒకరి కష్టాలు, సుఖాలతో పని లేదు. అది అలా సాగి పోతూనే ఉంటుంది.

***

కాత్యాయని కమలాకర్ కంట్లో పడ్డాక, వెంబడించి, రాజారావుతో మాట్లాడించి ఎలా తన సొంతం చేసుకున్నాడో, అలాగే కాత్యాయని అందాన్ని చూసి ఫిదా అయి పోయాడు మనోహర్ ! కాకపోతే ఆమె పెళ్లయ్యాక. అదీ కాకతాళీయంగా.

కాత్యాయని, కమలాకర్ లు శ్రీ గాయత్రీ అపార్ట్ మెంట్ లో ఫ్లాట్ తీసుకుని అద్దెకు దిగాక, ఒకసారి ఆమె రిలయన్స్ మాల్ లో సామాన్లు కొనుక్కొళుతుంటే చూశాడు మనోహర్. అప్సరసలు ఆకాశంలో, స్వర్గంలో ఉంటారని అతను విని ఉన్నాడు. అలాంటిది తన ముందు నుంచి నడిచి వెళ్లడం చూసి షాక్ అయి పోయాడు.

మనోహర్ ఆరడుగుల పొడవుతో, దబ్బపండు ఛాయతో, కోల ముఖం, నుదుటిపై పడే కర్లీ హెయిర్ తో, షార్ప్ చూపులు ప్రసరించే కళ్లతో, క్లీన్ షేవ్, సన్నటి మీస కట్టుతో, చక్కటి డ్రెస్ సెన్స్ తో అమ్మాయిలు చూడగానే కలల రాకుమారుడిగా హృదయాల్లో నిలిచి పోవడం ఖాయం.

అతను ఓ ఎమ్ ఎన్ సీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గా మంచి పొజిషన్ లో ఉన్నాడు. కాత్యాయనీ వాళ్లుండే అపార్ట్ మెంట్ కి కొద్ది దూరంలో ఉండే పోష్ బ్లూ మూన్ రెసిడెన్సీలోని ఫ్లాట్ లో ఉంటున్నాడు. చిన్నప్పుడు అతని కుటుంబం జీవిక కోసం చాలా కష్ట పడింది. తండ్రి ఒక బట్టల షాపులో గుమాస్తాగా చేసేవాడు. ముగ్గురాడపిల్లల తర్వాత ఒక్కగానొక్క మగ నలుసుగా పుట్టాడు. ఇంట్లో అందరూ గారాబంగా చూడ్డంతో, ఏది కోరుకుంటే అది వచ్చే దాకా పంతం పట్టేవాడు. అష్ట కష్టాలు పడి అతని కోర్కెలు తీర్చే వాళ్లు తోడ బుట్టిన వాళ్లు, తల్లి దండ్రులు.

మనోహర్ పెరుగుతూంటే అతని కోరికలు కూడా పెరగ సాగాయి. ఒక రోజు సైకిల్ కొనివ్వమంటాడు, మరో రోజు పిల్లలు తొక్కే కారు కావాలంటాడు. అతని కంట్లో నీరు చూడలేని తండ్రి తల తాకట్టు పెట్టైనా కొనిచ్చే వాడు. మరింత పెద్దవుతూంటే అతనికి ఊహ తెలిశాక, తండ్రి పరిస్థితి అవగాహన లోకి వచ్చింది. ఆడ పిల్లల్ని చదివించే స్థోమత లేదు కనక తను అశక్తుణ్ణని చేతులెత్తేశాడు. మనోహర్ మగ పిల్లాడు కాబట్టి చదివిస్తున్నాడా తండ్రి.

కోరికలు తీరడం మాటటుంచి కనీస అవసరాలు కూడా తీరక పోవడం వల్ల సమాజం మీద, తన కుటుంబం మీదా చాలా చిరాకు వచ్చింది అతనికి. తను ఆ ఊబి లోంచి బైటకు రావాలంటే, బాగా చదువుకోవాలని, చదువు తోటే అన్ని సుఖాలూ పాదాక్రాంతమవుతాయని చిన్న వయసులోనే మనసులో బీజం నాటుకున్నాడు.

అప్పట్నుంచి అతని ఆశ, ఆశయం, శ్వాస చదువే అయ్యాయి. చదువు పూర్తయి మంచి ఉద్యోగమూ సంపాదించాడు.


ముగ్గురమ్మాయిల పెళ్ళిళ్లు చేశాక తన బాధ్యత తీరిందనుకున్నాడో ఏమో అతని తండ్రి మరణించాడు. ఆయనతో కలిసి ఏడడుగులు నడిచిందన్న విశ్వాసంతో అతని తల్లి వారం తిరక్కుండా మరణించింది.

మనోహర్ కు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, ప్రాజెక్ట్ బోనస్ లు..ఇలా జీవిత పరమపద సోపాన పఠంలో నిచ్చెనలు ఎదురొచ్చి మరీ అతన్ని పైకి చేర్చాయి. పుష్కలంగా డబ్బు, ఫ్రీక్వెంట్ గా విదేశాలు చుట్టబెట్టే అవకాశం. ఒక మగాడికి అనుభవించడానికి, అనుభూతించడానికీ, ఇంకేం కావాలి!

ఏ దేశానికి వెళ్లినా అతని కోసం అక్కడి లగ్జరియస్ హోటల్లో అందమైన అమ్మాయిలతో రూం బుక్ చేసి ఉంటూంది. కాస్ట్ లీ మందు తాగుతూ, నాన్ వెజ్ నంజుకుంటూ, సువాసన మయంగా ఉన్న గదిలో, రాత్రి అందమైన మెత్తటి పరుపులతో ఉన్న మంచం మీద అద్భుతమైన కొలతలతో, వాత్సాయన కామ సూత్రాలను ఆపోశన పట్టిన, మెరిసే గోధుమ రంగులతో, బంగారు రంగు జుత్తులతో, రంభా ఊర్వశి మేనక లాంటి అప్సరసల మిళితంలా అగుపించే అమ్మాయిలతో రాత్రంతా సుఖించడమంటే మనోహర్ కు పిచ్చ సరదా!

అలాంటిది ఇప్పుడు మనోహర్ మనసు లోకి చొచ్చుకు పోయిన కాత్యాయని, అతనికి మానసిక ప్రశాంతత లేకుండా చేస్తోంది. ఆమె ఒంపు సొంపుల అవయవాల సంపద ఒక ఎత్తు, ఇన్నాళ్లూ తృప్తి పొందాడనుకున్న ఆనందం మరో ఎత్తుగా అనిపించ సాగింది. అంతెందుకు? డబ్బిచ్చి పొందిన తన ఇన్నాళ్ల సుఖం శూన్యం అన్న భావానికి వచ్చేశాడు.

ఆమెని పొంద లేని జీ..వి..తం..వృధా అనిపించ సాగింది. అప్పటి రావణాసురుడు, కీచకుడు అనుభవించిన పరిస్థితి లాంటిదే అతని అప్పటి మనోస్థితి. పరిస్థితి.




మనోహర్ ఏదన్నా తల్చుకుంటే సాధించకుండా ఉండడు. ఇప్పుడు కాత్యాయనిని సాధించడమే అతని ముందున్న ఛాలెంజ్ !

ఫస్ట్ స్టెప్ గా కాత్యాయని ఇంటి పక్కనున్న అపార్ట్ మెంట్ ఫస్ట్ ఫ్లోర్ లోని ఫ్లాట్ లోకి మారి పోయాడు. అదేమంత గొప్పగా ఉండదు. సాధారణ మనుషులు ఉండే అతి మామూలు అపార్ట్ మెంట్. కాని ఏదైనా సాధించాలంటే, కొన్ని కోల్పోవాలని అతనికి తెలిసినంత మరెవరికీ తెలియదు. చిన్న చిన్న సుఖాలని త్యాగం చేస్తే అమర సుఖం సొంతమయి తీరుదుందన్నది అతని థీరీ!

ఆ ఫ్లాట్ లోని ఉత్తరం వైపున్న కిటికీ తలుపు తెరిస్తే కాత్యాయని ఉండే ఇంటి పెరడు మొత్తం స్పష్టంగా కనిపిస్తుంది. లేట్ నైట్ పడుకుని ఉదయం పదకొండు, పన్నెండు గంటలకు బద్ధకంగా నిద్రలేచే మిస్టర్ మనోహర్ ఇప్పుడు అయిదు గంటలకే బుద్ధిగా నిద్రలేస్తాడు. లేవంగానే మొదట చేసే పని కిటికీ రెక్కలు తీసి కాత్యాయనిని వీక్షించడానికి ఓపిగ్గా మేక కోసం ఎదురు చూసే పులిలా నుంచుంటాడు. కాత్యాయని చక్కగా స్నానం చేసి పెరట్లో ఉన్న తులసి మొక్క కు పూలతో పూజ చేసి, అగరొత్తులు వెలిగించి అక్కడి మట్టిలో గుచ్చి, దణ్ణం పెట్టుకుని వెళ్లి పోతుంది. అది సుమారుగా పదిహేన్ని మిషాల కార్యక్రమం. అది మనోహర్ కి రోజంతా కిక్కిచ్చే అద్భుత దృశ్యం. అప్పుడే స్నానించిన గులాబీలా బొద్దుగా, ముద్దుగా ఉండే కాత్యాయనిని చూస్తే మనోహర్ కి పిచ్చెక్కి పోతుంది. 'ఆ శృంగార దేవత ఎప్పుడు తనను కరుణిస్తుందో. తనకి అమర సుఖం చవి చూపిస్తుందో' అని మనసులో అనుకుంటూ భారంగా కదిలి పోయి తన నిత్య కృత్యాల్లో పడిపోతాడు.

ఆమె టైం టేబుల్ అతను ఎంతగా స్టడీ చేశాడంటే ఆమె ఎప్పుడెప్పుడు ఏయే టైములో ఏ పని మీద బయటకెళుతుందో అతను కంఠతా పట్టేశాడు. ఆమె భర్త కమలాకర్ అనారోగ్య పరిస్థితి, అత్యవసరంగా ఆపరేషన్ చేయించాల్సిన అవసరమూ తెలుసుకున్నాడు. ఆమె దైన్య జీవితం అతని ఎరకి తప్పకుండా పడుతుందని మనసులో నిశ్చయించుకున్నాడు. అప్పుడప్పుడూ కావాలని ఆమెకి ఎదురు పడి, యాదృచ్ఛికంగా చూసినట్టు చూసి నవ్వేవాడు. ఆమె చటుక్కున తల దించుకోవడం అతనికి భలేగా అనిపించేది. ఆడా-మగ రిలేషన్స్ బయటి లోకంలో ఎన్నో చూశాడు. కొంత మంది తమ స్వార్థం కోసం నైతిక విలువలను తాకట్టు పెట్టుకోవడమూ తెలుసూ. ఒకప్పుడు తలుపు చాటున నిలబడ్డ ఆడవాళ్లు, ఈనాడు జాబ్ కోసం, కెరీర్ కోసం తమ శరీరాలను సమర్పించే స్థాయికి దిగజారడమూ చూశాడు.

సినిమాల్లో 'నీకామె పడిందా?' 'వాడు నీ వెనక కుక్కలా తిరుగుతున్నాడు' లాంటి మాటలతో శృంగారాన్ని రోడ్డు మీదకి ఈడ్చుకు రావడమూ చూశాడు. ఇప్పుడు ప్రేమ అన్నది కేవలం 'లస్ట్' అంతే! అది అతని నిశ్చితాభిప్రాయం. అలాంటిది గంజాయి వనంలో తులసిలా ఫ్రెష్ గా, సంప్రదాయంతో తళుకులీనుతున్న కాత్యాయని అతనికో విచిత్రం. అందుకే ఆమెని అనుభవిస్తేనే అతని మగతనానికి ఓ ప్లస్ అనేది అతని ఫీలింగ్!

ఒక రోజు పొద్దున్నే హఠాత్తుగా నిద్ర లేచిన మనోహర్ టైం చూసి, ఆరూ పది అవడంతో ఆలస్యంగా నిద్ర లేచినందుకు తనను తను బూతులు తిట్టుకుంటూ కిటికీ లోంచి బయటకి చూశాడు. అప్పటికే తులసి పూజ అయిపోయిన గుర్తుగా తులసి మొదట్లో పూలేసి, అగరొత్తులు వెలిగించి ఉన్నాయి. అతన్ని ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది. డల్ గా ఫ్రెష్ అయి ఆ రోజు కేలండర్ చూసి, ఆరోజే కాత్యాయని తన భర్తని ఆస్పత్రికి తీసుకెళ్లే రోజని గుర్తించి గబగబా రెడీ అయి పది గంటలకు బయట కెళ్లి ఎదురు చూస్తూ నుంచున్నాడు.

బ్లాక్ కలర్ ట్రౌజర్ పై వైట్ షర్ట్ టక్ ఇన్ చేసుకుని, లైట్ బ్రౌన్ కలర్ గాగుల్స్ తో, పార్క్ అవెన్యూ డియోడోరెంట్ స్ప్రే చేసుకుని అమ్మాయిల కళ్లని హిప్నటైజ్ చేసి తన వైపు కట్టేసుకునేంత హేండ్ సమ్ గా ఉన్నాడు.

కాత్యాయని ఒక చేత్తో ఆమె భర్తకు సపోర్ట్ ఇస్తూ బయటకు నడిపించుకొచ్చింది. ఆమె మరో చేతిలో మెడికల్ హిస్టరీ ఫైల్ ఉంది.కాత్యాయని గ్రీన్ శారీ లో వన దేవతలా మగ చూపుల్ని క(చు)ట్టి పడేసేంత అందంగా ఉంది. అప్పటికే సూర్యుడు చండ ప్రచండమవుతూ నిప్పులు చెరగడానికి సిద్ధ పడుతున్నాడు. ఆ వెలుగులో ఆమె మరింత మెరిసి పోతోంది. బహుశా ఆమె అందాన్ని ప్రపంచానికి చూపించడానికే సూర్యుడు తన వెలుగును పెంచుతూ తాపత్రయ పడుతున్నట్టుంది.

' ఆటో ' దూరంగా వెళుతున్న ఆటోను పిలిచింది కాత్యాయని.

ఆటో అతను అది పట్టించుకోకుండా వేగంగా వెళ్లి పోయాడు.


డైరెక్ట్ గా చూస్తే బాగోదని క్రీగంట ఆ అందాల రాశి అందాలను కళ్లతో గ్రోలుతూన్నాడు.

మరో ఆటోని పిలిచింది. అతను ఆమె దగ్గరగా వచ్చాడు. కొద్ది సేపు మాట్లాడిన తర్వాత ఆ ఆటో వెళ్లి పోయింది. బహుశా ఫేర్ కుదర లేదనుకుంటా!

మరో ఆటోను పిలిచినా రాలేదు. ఎండ చుర్రుమనిపిస్తోంది. చేతిలో ఉన్న మెడికల్ ఫైల్ ను సూర్యుడి తీక్షణతకు అడ్డంగా పెట్టి, భర్త ముఖానికి, తన ముఖానికి కాస్త నీడ వచ్చేలా చేసుకుంది.

మరో ఆటోను ఆమె పిలిచేంతలో.. ఉన్నట్టుండి కమలాకర్ సొమ్మసిల్లినట్టు వాలి పోయాడు.

"ఏవండీ.."గట్టిగా అరిచింది కాత్యాయని గుండె జారి పోతుండగా.



ఆ అరుపు వినగానే ఒక్క అంగలో మనోహర్ అక్కడికి చేరుకుని "మీరు కంగారు పడకండి" అని కమలాకర్ ను లేపి తన భుజం ఆసరాతో పక్కనే ఉన్న బస్ షెల్టర్ లో ఉన్న సిమెంట్ బెంచి మీద ఆమెని కూర్చోబెట్టి, కమలాకర్ ను ఆమెకి ఆన్చి కూర్చోబెట్టి "మీరు బెంబేలు పడొద్దు, ఏం కాదు" అని తమ చుట్టూ గుమి గూడబోయిన వాళ్లని "ఇక్కడేముంది వెళ్లండి..వెళ్లండి" అంటూ సెల్ తీసి ఎవరికో ఫోన్ చేశాడు.

క్షణాల్లో ఆ సిటీలోనే ఖరీదైన హాస్పిటల్ కి సంబంధించిన అంబులెన్స్ వచ్చి వాళ్ల ముందు ఆగి, స్ట్రెచ్చర్ మీద కమలాకర్ ను పడుకోబెట్టి లోపలికి తీసుకెళ్లారు. అదేం పట్టించుకునే స్థితిలో లేదు కాత్యాయని. భర్త పరిస్థితికి ఆమె మనసు తీవ్రంగా రోదిస్తోంది, కళ్లు అవిశ్రాంతంగా కన్నీళ్ళని వర్షిస్తున్నాయి. ఆమెతో పాటు మనోహర్ కూడా అంబులెన్స్ ఎక్కాడు. అలాంటి పరిస్థితిలోనూ అప్పుడప్పుడూ పూల చెండులా తగుల్తున్న ఆమె అందాలు అతనిలోని మగతనానికి ఆజ్యం పోస్తున్నాయి.

అంబులెన్స్ లోపల ఒక డాక్టర్ ఉండి కమలాకర్ కు ఫస్ట్ ఎయిడ్ ట్రీట్ మెంట్ మొదలు పెట్టేశాడు. 'చాలా కాలం నుంచి ఆహారం సరిగా లేనందుకు పొద్దున్నే ఎండలో చాలాసేపు నుంచోబెట్టినందుకు అన్ కాన్షియస్ అయ్యాడని' మనోహర్ తో ఇంగ్లీష్ లో చెప్పాడు.

ఆ తర్వాత హాస్పిటల్లోకి దూసుకు పోయిన అంబులెన్స్ లోంచి మనోహర్ ను యుద్ధ ప్రాతిపదిక మీద ఐ సీ యూకి చేర్చారు. కొద్ది సేపటి తర్వాత బయటకొచ్చిన డాక్టర్ తో మాట్లాడిన మనోహర్ కాత్యాయని దగ్గరకొచ్చి "మీ ఆయనకు ఇంకేం ఫర్వాలేదు..జస్ట్ సన్ స్ట్రోక్ తగిలిందంతే.."అన్నాడు ఆమెని ఊరడిస్తూ.

ఖరీదైన వాతావరణంతో స్వర్గలోకం లోని ఆసుపత్రిలా కనిపిస్తూంటే, డాక్టర్లను, నర్స్ లను చూస్తూ అతని మాటలతో ఈ లోకంలోకి అప్పుడొచ్చింది కాత్యాయని. అంతే కాదు గబుక్కున లేచి "సారీ అండీ, మీకు శ్రమ ఇచ్చాను. ఉన్నట్టుండి ఆయన హఠాత్తుగా పడిపోతేనూ..ఏం చెయ్యాలో తోచక.."మళ్లీ చిన్నగా వెక్కుతూ ఏడవ సాగింది.

"ఏం ఫర్వాలేదని చెప్పా కదండీ..మనిషిని మనిషి ఆదుకోకపోతే మనకూ, జంతువులకూ తేడా ఏంటండీ" అన్నాడు అనునయంగా.

"ఇంత పెద్ద హాస్పిటల్ ను మేము భరించలేమండీ" అంది.

"భరించమని నేను చెప్పానాండి! మాకో ఛారిటబుల్ ట్రస్ట్ ఉంది. ఈ హాస్పిటల్ ఎం డీ దాన్లో మెంబర్. నెలకో పదిమందికి ఉచితంగా ట్రీట్ చేస్తాడు. మీరు చాలా లక్కీ అండి. సరిగ్గా మీ ఆయన పడిపోయే టైం కి నేనక్కడ ఉన్నాను" అన్నాడు.

"భగవంతుడున్నాడండి. ఎక్కడో కాదు మీరే" అంది రెండు చేతులూ జోడిస్తూ.

"ఉండండి మీరు మరీనూ, కొంపదీసి ఎవరన్నా విన్నారా ఏంటి? అసలే మనవాళ్లు 'ఎవరు దొరుకుతారా, దేవుణ్ని చేసేయడానికి' అని ఎదురు చూస్తుంటారు. పూలు, పళ్లు, కొబ్బరికాయలతో పూజారిని తీసుకుని పూజకు సిద్ధమైపోతారు" అన్నాడు చిరు భయాన్ని నాటకీయంగా ప్రదర్శిస్తూ.

అంత బాధలోనూ ఆమెకి నవ్వొచ్చింది. పెదవులు విడీ విడకుండా నవ్వింది.

'ఈ నవ్వును సెల్ తో కాప్చర్ చేసుకునే అవకాశం ఉంటే ఎంత బావుండేది. ఇంటి ఎంట్రన్స్ కు ఎదురుగా ఉండే డ్రాయింగ్ రూమ్ లో లైఫ్ సైజ్ కటౌట్ గా గోడకి పెడితే బ్యూటిఫుల్ సీనరీలన్నీ దాని ముందు బలాదూరే!' ఆ నవ్వుకు తాదాత్మ్యం చెందుతూ మనసులో అనుకున్నాడు.

కొద్దిగా పక్కకెళ్లి అక్కడున్న మేల్ అసిస్టెంట్ కు డబ్బులిచ్చి ఇడ్లీ, కాఫీ తెప్పించి ఆమె ముందు పెట్టాడు.

"అయ్యో, ఇంట్లోంచి తినే బయల్దేరానండి.." అంది ఇబ్బందిగా ఫీల్ అవుతూ.

"మీకు తెలుసో లేదో, మనం మధ్యాహ్నంలోకి ప్రవేశిస్తున్నాం. లోపల మీ ఆయనకు టెస్ట్ లు జరుగుతున్నాయి. డాక్టర్ వచ్చి రిపోర్ట్స్ చెక్ చేసి విషయం చెబుతాడు. ఆయనెప్పుడొస్తాడో చెప్పలేం. అప్పటి దాకా మీరేం తినకుండా ఉండి స్పృహ తప్పితే మిమ్మల్ని కూడా ఇదే హాస్పిటల్లో అడ్మిట్ చేయాల్సి వస్తుంది. దానికి మాత్రం బోలెడు కర్చవుతుంది. ఎందుకంటే ఒక ఫ్యామిలీలో ఒక్కరికే ఫ్రీ ! మీరు తింటూ ఉండండి. నేను కిందకెళ్లి కాస్త తినేసి వస్తాను" అని ఆమె ముందున్న ఇడ్లీ ప్యాకెట్ విప్పబోతుంటే "అయ్యయ్యో నేను తింటాన్లేండి"అంది అతన్ని వారిస్తూ.

అతను నవ్వుతూ వాళ్ల ముందున్న లిఫ్ట్ బటన్ ప్రెస్ చేసి, లిఫ్ట్ వచ్చి మెత్తగా తలుపులు తెరుచుకున్నాక లోపలికెళ్లి డోర్స్ క్లోజ్ చేశాడు.

ఆమె సుకుమారంగా ఇడ్లీ చిన్న చిన్న ముక్కలుగా తుంపి తింటూ కలలా జరిగిందంతా నెమరేసుకోసాగింది. తర్వాత హఠాత్తుగా తండ్రి గుర్తొచ్చి ఫోన్ చేసి జరిగిందంతా చెప్పింది.

ఆయన ఆగమేఘాల మీద ఆ హాస్పిటల్ కి వచ్చాడు. ఆకాశాన్నంటేలా, అనేక హంగులతో ధగ ధగలాడుతున్న ఆ హాస్పిటల్ ను చూస్తూనే ఆశ్చర్య పోయాడు. తన కూతురు చెప్పిన హాస్పిటల్ అదేనా? కాదా? అని కొద్ది సేపు ఆలోచనలతో మెదడును వేడెక్కి, తర్వాత కూతురుకు ఫోన్ చేసి నిజమేనని నిర్ధారణ చేసుకుని లిఫ్ట్ ఎక్కి పైకెళ్లి కూతుర్ని చేరాడు.

మనోహర్ తనకు చెప్పిందంతా, తండ్రికి చెప్పింది.

"నువ్వదృష్టవంతురాలివని నాకు తెలుసమ్మా. భగవంతుడు అందరికీ సమస్యలిస్తాడు, నీకు పరిష్కారమూ చూపిస్తాడు"అన్నాడు కూతురు తల ఆప్యాయంగా నిమురుతూ.

"అన్నట్టు మీ అత్తగారు.."అడిగాడాయన.

"ఇలాంటి పరిస్థితి ఎదురవ్వొచ్చని ఊహించే, పక్కింటి రాధమ్మగారికి 'మా అత్తగారిని కనిపెట్టుకుని ఉండమని చెప్పి' ఆయన్ని తీసుకుని హాస్పిటల్ కి బయలుదేరా. ఆవిడ చాలా మంచిది అత్తమ్మను జాగ్రత్తగా చూసుకుంటుంది." తండ్రితో చెప్పింది.

ఆయన ముఖంలో సంతృప్తి.

అప్పుడే లిఫ్ట్ తలుపులు తెరుచుకుని మనోహర్ బయటకొచ్చాడు.

అతన్ని చూడంగానే "నాన్నా..ఈయనే దేవుళ్లా వచ్చి నన్ను ఆదుకున్నాడు" అంది సంతోషంగా.




లిఫ్ట్ గోడకు ఆనుకుని నుంచున్న మనోహర్ కుప్పపోసి ఉన్న కాత్యాయని అందాన్ని కళ్లతో జుర్రుకుంటున్నాడు. ఆ లిఫ్ట్ కి ఒక వైపున గ్లాస్ ఉండడం చేత బయట లాన్లో ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తోంది కాత్యాయని. ఆమెను గబుక్కున అందుకుని ముద్దు పెట్టుకోవాలన్న కోరికను బలంగా అణచుకున్నాడు. లిఫ్ట్ మెత్తగా కిందకు జేరాక డోర్స్ తెరచుకున్నాయి.

ముందుగా మనోహర్ బయటకు నడిచి కాత్యాయనిని బయటకు రమ్మన్నట్టుగా రెండుచేతులూ సాచి ఆహ్వానించాడు. అతని

మన్మధ హృదయానికి అది హాస్పిటల్ లా లేదు. బృందావనంలా ఉంది. ఎందుకంటే అక్కడున్న డాక్టర్లు, నర్స్ లు, స్టాఫ్, హాస్పిటల్ వాతావరణం ఏదీ కనిపించడం లేదు. తను కోరుకున్న శృంగార దేవత తనముందు ఉండడమే దానికి కారణం!

ఆమె సిగ్గుపడుతూ దిగాక తను ముందు నడుస్తూంటే ఆమె అతణ్ని అనుసరించింది. వచ్చేటప్పుడు టెన్షన్తో చూడలేదు గాని అది చాలా పెద్ద హాస్పిటల్. అన్ని రకాల వ్యాధులకి అక్కడ పెద్ద పెద్ద డెడికేటెడ్ బ్లాకులు ఉన్నాయి. అవగాహన లేకుండా వాటిల్లోకి అడుగుపెడితే తప్పిపోయే ప్రమాదం కూడా ఉంది. పెద్ద అడవిలో ఉన్న లేడిపిల్లలా ఉంది ఆమె పరిస్థితి. ఆశ్చర్యం, భయంలతో కళ్ళు పెద్దవవుతున్నాయి. ఒళ్లు గగుర్పొడుస్తోంది. కాళ్లూ చేతులు చల్లబడుతున్నాయి. అతని వెనకాలే మంత్రగాడి వెనక మంత్రించబడిన అందమైన అమ్మాయిలా వెంబడిస్తోంది.

హాస్పిటల్ బయటకు వస్తూండగానే ఫోన్ చేయడం చేత క్యాబ్ అప్పటికే అక్కడ వాళ్లకోసం ఎదురుచూస్తోంది. అతను ఆమెను ముందు ఎక్కమని, తర్వాత తనూ ఎక్కి ఆమె పక్కన కూర్చున్నాడు. ఇప్పుడు ఇలా ఆమెకి ఆనుకుంటూ సీట్లో కూర్చోడం అతనికి చాలా కంఫర్ట్ బుల్ గా ఉంది.

ఆ కారుకు కుదుపులుండవు. అయినా మన గతుకుల రోడ్ల వల్ల కారు గోతుల్లో వెళుతుంటే చిన్నగా ఎదురయ్యే కదలికలకు అటూ ఇటూ చిన్నగా కదులుతూ ఆమె పై ఒరుగుతుంటే అతని నర నరం తీయని స్వరాలు పలుకుతోంది. ఆమెని ఆ కారు వెనక సీటు మీద పడుకోబెట్టి అప్పటికప్పుడే ఆమెను ఆక్రమించుకోవాలన్న తపన అతనిలో క్షణ క్షణం అధికమవుతుంది. కళ్లు ఎర్రబారుతున్నాయి. ఒళ్లు మైకాన్నలుముకుంటోంది. సరిగ్గా అదే సమయంలో వాళ్లు దిగాల్సిన ఇల్లు వచ్చేసింది. అదీ ఆమె విండోలోంచి తమ కాలనీ చూసి 'ఇక్కడే' అని గట్టిగా డ్రైవర్తో చెప్పింది. ఆ అరుపులాంటి మాటకి ఈ లోకంలోకి వచ్చాడు మనోహర్. 'ఊహే ఇంతగా ఇనస్పైర్ చేస్తే రేపన్న రోజున తెల్లటి దుప్పటి పరచి, దానిపై పూలు జల్లి, రూమంతా ఫ్రాగ్రాన్స్ అలముకుని ఉన్న మంచం మీద ఆమెని పడుకోబెట్టి ఆమెపై ఒరిగి అణువణువునూ తడుముతూ, ఆమె శరీరంలో తన కంటబడకుండా గోప్యంగా, అపురూపంగా ఉన్న భాగాలని స్పృశిస్తూ అలా అలా సాగిపోతుంటే..ఓహ్!' అనుకుంటూ కిందకు దిగాడు.

"థాంక్సండీ, మీరన్నవారు లేకపోతే ఇవాళ నా పరిస్థితి ఏమయిపోయేదో. నేను బట్టలు సర్దుకుని బస్సులోనో, ఆటోలోనో హాస్పిటల్ కి వెళతాను" అంది.

"నో..నో మీరు ఇబ్బంది పడతారు. నేను కార్ ముందే మాట్లాడి పెట్టాను. రేపు మీరు ఇంటి పని చూసుకుని బయటకొచ్చేసరికి సిద్ధంగా ఉంటుంది. మీరు వెళ్లండి. నేను రేపు సాయంత్రం హాస్పిటల్ కి వస్తాను" అన్నాడు.

‘అయ్యో ఎందుకండీ..’ఆమె అంటున్నా వినిపించనట్టుగా వెళ్లిపోయాడు. చేసేదేం లేక ఆమె ఇంట్లోకెళ్లి తన అత్తగారికి, అక్కడే ఉన్న రాధమ్మకీ ఉదయం నుంచి జరిగింది చెప్పింది. అత్తగారు బాధ పడుతున్నట్టుగా శరీరం కంపించసాగింది. కళ్లు కన్నీళ్లు కార్చసాగాయి. రాధమ్మ బాధపడి ‘మళ్ళీ రెపొస్తానని ’చెప్పి వెళ్లిపోయింది.

కాత్యాయని అత్తగార్ని ఊర్కోబెట్టి మెల్లగా ఇంటి పనిలో దిగింది. స్నానం చేసి అన్నం, కూర వండి అత్తగారికి పెట్టి, తనూ తిని పడుకుంది. పడుకుందేకాని చాలా సేపు నిద్రపట్టలేదు. గజిబిజిగా ఆలోచనలు మెదడంతా స్వైర విహారం చేసి, చివరికి మనోహర్ గుర్తొచ్చేసరికి మనసు ప్రశాంత మైంది. నిద్రాకమ్ముకుంది.




ఉదయం లేచి చక్కగా ముస్తాబయి, లేత నీలం రంగు చీర జాకెట్టులో ఆకాశ సుందరిలా ఉంది. అన్నం వండి అత్తగారికి ఇంతపెట్టి తనూ ఇంత తిని, పక్కింటి రాధమ్మకి అత్తగారిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి హాస్పిటల్ కి వెళదామని బయటకి రాగానే ఎప్పటి నుంచి ఉందో ఒక కారు ఆమె కోసం ఎదురు చూస్తూ ఉంది. ఆమెకి అతను ‘కార్ రెడీగా ఉంచుతా’ అన్న విషయం గుర్తుకొచ్చి, వెళ్లి ఎక్కి కూర్చుంది. కారు వెళుతూ ఉండగా ఆమెకి తమకంత సహాయం చేసిన వ్యక్తి పేరు తెలుసుకోలేదన్న విషయం గుర్తుకొచ్చింది. కార్ డ్రైవర్ని ‘తన కోసం కార్ అరెంజ్ చేసింది ఎవరని’ అడిగింది. అతను సీరియస్ గా ముందుకు చూస్తూ డ్రైవ్ చేస్తూనే ‘మనోహర్ సాబ్’ అన్నాడు. ‘ఓహ్!’విండోలోంచి బయటకు చూడసాగింది.

కారు హాస్పిటల్ గేటులోకి దూసుకెళ్లి పోర్టికోలో ఆగి, కాత్యాయని దిగంగానే సర్రున వెళ్లిపోయింది.

కాత్యాయని మొదట ఎటు వెళ్లాలో కాస్త కన్ఫ్యూజ్ అయి తర్వాత నిదానంగా అన్నీ గుర్తు తెచ్చుకుని తను వెళ్లాల్సిన బ్లాక్ కి వెళ్లి లిఫ్ట్ ఎక్కి తమ గదికి వెళ్లింది. రూం లో అచ్యుతరామయ్యగారు పేపర్ చదువుకుంటున్నాడు.

కాత్యాయనిని చూడంగానే గబ గబ లేచి "ఇంత చక్కటి గదిలో ఇంతవరకూ నా జీవితంలో ఉండలేదమ్మా. అస్సలు హాస్పిటల్లో ఉన్నట్లే లేదమ్మా. లగ్జరీ హోటల్ గదిలో ఉన్నట్టు ఎంత సౌకర్యవంతంగా ఉందో! ఇదిగో పొద్దున్నే ఇంగ్లీష్, తెలుగు పేపర్లు కూడా తెచ్చిచ్చారు చదువుకోడానికి, అన్నట్టు నేను వేడి వేడి ఇడ్లీలు తిన్నాను. నువ్వు టిఫిన్ చేశావా?" అన్నాడు ఆనందంగా.

తండ్రి సంతోషానికి కారణమైన మనోహర్ కి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది. టిఫిన్ చేశానన్నట్టుగా తలాడించింది.

బాయ్ రూం కి తెచ్చిన కాఫీ తాగి ఇద్దరూ అలా కూర్చున్నారో లేదో.

డాక్టర్ వాళ్ల రుమ్ డోర్ నాక్ చేసి, కాత్యాయని తలుపు తీశాక లోపలికి వచ్చి అక్కడున్న ఈజీచైర్ లో కూర్చుని, 'శాంపిల్స్ సేకరించి టెస్ట్ లకు పంపారని, బహుశా రెండూ మూడూ రోజుల్లో డాక్టర్స్ అవైలబిలిటీని బట్టి కమలాకర్ కు ఆపరేషన్ చేసే అవకాశం ఉందని' నమ్రతగా చెప్పాడు.

కాత్యాయని మౌనంగా విని తలాడించింది.

***

మూడురోజుల పాటు అన్ని రకాల పరీక్షలూ చేసి సంతృప్తి చెందాక మరో రెండు రోజుల తర్వాత ఆపరేషన్ డేట్, టైమ్ ఫిక్స్ చేశారు.

అన్ని రోజులూ పొద్దున్నా సాయంత్రం రక రకాల పళ్లతో పరామర్శకన్నట్టుగా వచ్చి కూర్చుని కాత్యాయనితో మాట్లాడి వెళుతున్నాడు మనోహర్.

మరుసటిరోజే ఆపరేషన్.

కాత్యాయని ఉదయానే తలంటోసుకుని హాస్పిటల్ ప్రాంగణం లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్లింది. హాస్పిటల్ లో ఎత్తైన ప్రదేశంలో కట్టడంతో అద్భుత కట్టడంలా భాసిస్తూ తెల్లగా మెరిసిపోతోంది. అక్కడే పక్కగా ఉన్న షాపులో పూలూ, కొబ్బరి కాయలూ తీసుకుని గర్భ గుడిలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామిని కళ్లారా చూసింది. ప్రశాంతమైన మోముతో ఆపద్బాంధవుడిలా కనిపించాడాయన కాత్యాయని కళ్లకి. గర్భగుడినుంచి తన ముందుకొచ్చిన పూజారికి తమ గోత్రం, పేర్లు చెప్పి అర్చన చేయమని చెప్పింది. తీసుకునికమలాకర్ కి ఆపరేషన్ సవ్యంగా జరిగి అతను కోలుకుంటే తిరుపతి వస్తానని కళ్లు మూసుకుని మనస్ఫూర్తిగా మొక్కుకుంది. అర్చన పూర్తయ్యాక పూజారిచ్చిన తీర్థ, ప్రసాదాలు, కొబ్బరి చిప్ప, పూలు తీసుకుని పూలు తలలో తురుముకుని, అక్కడే ఉన్న ఒక స్తంబానికి ఆనుకుని కూర్చుని కొబ్బరి చిప్పని నేలపై ముక్కలుగా కొట్టుకుని ప్రసాదం తింటూ తనకు కొద్దిదూరంలో కన్నీరు మున్నీరవుతున్న దంపతులను చూసింది. ఆయనది తన తండ్రి వయసే, వెళ్లి ఓదార్చలనిపించింది.

నెమ్మదిగా లేచి వాళ్లదగ్గరకు వెళ్లింది. తనను తను పరిచయం చేసుకుని 'ఎందుకు బాధ పడుతున్నారని' అడిగింది.

తనపేరు పరశురామ్ అని భార్య అనుపమ అని పరిచయం చేసుకుని, అనుపమకు లివర్ ప్రాబ్లం ఉందనీ, ఈ హాస్పిటల్ ఆ వ్యాధికి చక్కగా చికిత్స చేస్తారని తెలిసి ఊర్నుంచి వచ్చి జాయిన్ చేశామనీ, ఇప్పటికే బోల్డు డబ్బు కర్చయిందని, ఇప్పుడు ఆపరేషన్ అంటున్నారని, దానికి డబ్బు సమకూర్చుకోడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని..కళ్ల నీళ్లు నింపుకుంటూ చెప్పాడు పరశురాం.

"దానికంత ఇబ్బంది ఎందుకు? ఈ హాస్పిటల్లో ఛారిటీ ట్రీట్ మెంట్స్ జరుగుతాయి కదా! మీకు తెలియదా? ప్రయత్నించలేదా?"అంది.

పరశురాం తెల్లబోయి తర్వాత " ఇక్కడ అట్లాంటివేమీ లేవమ్మా..ఉచితం అనేమాట పక్కన బెట్టండి. కనీసం కాస్త డిస్కౌంట్ కూడా ఇవ్వరు. పక్కా కమర్షియల్" అన్నాడు కొంచెం కోపం, కొంచెం బాధ మిళితం చేస్తూ.

"మీరు సరిగ్గా కనుక్కోలేదేమో, మా ఆయనకి రేపు ఆపరేషన్, అంతా ఛారిటీతోటే జరుగుతోంది. ఇంతవరకూ ఒక్క పైసా పెట్టలేదు. అంతా భగవంతుడి దయ" అంది కాత్యాయని శ్రీ వేంకటేశ్వరస్వామి వైపు తిరిగి చేతులు జోడిస్తూ.

"అలాంటిదేమీ లేదు తల్లీ" అన్నాడు నింపాదిగా.

"అయ్యో, అయితే పదండి. రిసెప్షన్ లో చెప్పిస్తా"అంటూ లేచింది. వాళ్లలో ఆశ ఉత్సాహం నింపింది. ఆమెతో పాటూ వాళ్లూ

లేచారు.

రిసెప్షన్ కి వెళ్ళాక కాత్యాయని"మేడం, ఇక్కడ నెలకి పది ఛారిటీ ట్రీట్ మెంట్స్ జరుగుతాయి కదండీ..చెబితే వీళ్లు నమ్మడం లేదు. కొంచెం మీరైనా చెప్పండి" అండి.

"అలాంటివేం లేవండి. అన్నీ కమర్షియల్ యాస్పెక్ట్ లోనే జరుగుతాయి" సౌమ్యంగా, మధురంగా చెప్పింది రిసెప్షనిస్ట్.

"మాకు ఛారిటీ త్రూ నే ట్రీట్ మెంట్ జరుగుతోంది. ఇంతవరకూ ఒక్క పైసా మేం స్పెండ్ చేయలేదు"

"ఇట్స్ ఇంపాసిబుల్..పేషెంట్ డిటేయిల్స్ చెప్పండి" అంది.

అక్కడ జరిగేది విచిత్రంగా చూస్తున్నాడు పరశురాం.

కమలాకర్ పేరు చెప్పింది. ఆమె కంప్యూటర్ లో యాక్సెస్ చేసి "సో ఫార్ టు అండ్ హాఫ్ లాక్ అయింది మేడమ్. మిస్టర్ మనోహర్ వన్ లాక్ పే చేశారు. రిమెయినింగ్ ఇవాళ ఆన్ లైన్లో పే చేస్తారు" అంది.

రెండున్నర లక్షలైందా? మనోహర్ పే చేశాడా? ఎందుకు? అతనెవరో కూడా తమకు తెలియదే! కాత్యాయనికి కళ్లు తిరిగాయి. మెదడు మొద్దుబారిపోయింది.




అలా ఎంత సేపుందో కాని"ఏవండీ, కాత్యాయనిగారూ అలా రిసెప్షన్ లో నుంచుని ఆలోచనలో పడిపోతే, హాస్పిటల్ వాళ్లు ఊర్కోరండి. మిమ్మల్ని కూడా అడ్మిట్ చేస్కుని ఖరీదైన ట్రీట్ మెంట్ స్టార్ట్ చేసేస్తారు"అని నవ్వుతూ కాత్యాయని దగ్గరకు వచ్చాడు మనోహర్.

ఆమె కళ్లలో నీళ్లు, శరీరం కంపించడం చూసి ఏదో జరగకూడనిది, జరిగిందనుకుని "ఎందుకలా ఉన్నారు? కమలాకర్ గారు బానే ఉన్నారు కదా?"ఆందోళనగా అన్నాడు.

"మా ఆయనకు ఛారిటీ ట్రీట్ మెంట్ జరుగుతోందని ఎందుకు అబద్ధం చెప్పారు. మానుంచి ఏవాశించి అలా చెప్పారు?"అంది ఏడుస్తూ.

నిజం తనకు తెలిసిపోయిందని అర్థం చేసుకుని "మీరు ఇక్కడ ఎంట్రన్స్ లో ఏడుస్తూ నన్ను నిలదీస్తే అందరూ నన్నో అపరాధిలా చూస్తున్నారు. మీకంతా మంచే జరిగింది కదా! అన్నీ చెబుతాను. మీరూ నేనూ అలా బైటకెళ్లి పార్క్ లో కూర్చుని మాట్లాడుకుందాం. నా మాట వినండి"అన్నాడు ముందుకు కదులుతూ.

అందరూ తమని చూడ్డం గమనించి, అది సభ్యత కాదని తలచి, చేసేదేం లేక అతనేం చెబుతాడో వినాలని అతణ్ని వెంబడించింది.

పార్క్ లో కొంత ఇంటీరియర్ గా నడిచాక, నున్నటి రాళ్లున్న చోట తను కూర్చుని అతనికి కొద్ది దూరంలో ఉన్న రాయిని ఆమెకి చూపించి కూర్చోమని సైగ చేశాడు.

రాయిపై కూర్చున్న కాత్యాయని ఆకుపచ్చ చీరలో వనకన్యలా భాసిస్తోంది. ఆమె అందాన్ని కళ్లతో జుర్రుకుంటూన్న మనోహర్ 'చెప్పండి'అన్న ఆమె మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు.

"చూడండీ కాత్యాయని నేను చెప్పేది సావధానంగా వినండి. ప్రపోజల్ మీకు నచ్చితే 'ఊ' అనండి. లేదంటే లేదు. అంతేకాని అరచి గగ్గోలు చేయొద్దు. అఫ్కోర్స్ అలా చేసే మనస్తత్వం మీది కాదనుకోండి. విషయం ఏంటంటే- నేను పెద్ద సంస్థలో మంచి స్థాయిలో పని చేస్తున్నాను. డబ్బుకు కొదవలేదు. మనమాటల్లో చెప్పాలంటే, ఆడింది ఆట, పాడింది పాటలాంటి జీవితం నాది. ఎక్కడ ఏదేశానికి వెళ్లినా మందు, మగువ, విచ్చలవిడి జీవితం నా స్టైల్ ఆఫ్ లైఫ్. అలాంటిది మా ఏరియాలోనే ఒక మాల్లో మిమ్మల్ని చూశాక నా ఆలోచనలకు కేంద్రం మీరయ్యారు. అప్పటిదాకా కృతకత్వానికి అలవాటు పడిన నా జీవితానికి మీ సహజత్వం జీవం పోసింది. మీకు పెళ్లి కాకపోయుంటే, ఏమైనా చేసి మిమ్మల్ని పెళ్లి చేసుకునేవాణ్ని. కాని దురదృష్టవశాత్తూ మీకు పెళ్లైపోయింది. మీమీద అభిమానంతో, ప్రేమతో ఎక్కడో పాష్ ఫ్లాట్ లో ఉండాల్సిన నేను

మిమ్మల్ని రోజూ గమనించొచ్చని మీ ఇంటి పక్కన ఉన్న ఫ్లాట్ లో దిగాను. మీకు తెలియకుండా మీకు సంబంధించిన ఎవ్విరి డిటేయిల్ కాప్చర్ చేశాను. మీ హజ్బెండ్ కున్న ప్రాబ్లమ్..మీ ఫైనాన్సియల్ స్టేటస్ అన్నీ అన్నీ నాకు తెలుసు. నాక్కావాలనుకున్నదానిమీద నా ఇంటెలిజెన్స్, అవేర్నెస్, పొటెన్షియల్ అన్నీ అక్కడే ఫోకస్ చేస్తాను కాబట్టి, ఇంతవరకు నేను కావాలనుకున్నదేదీ నాకందకుండా లేదు. అందుచేత.."ఆమె వంక సూటిగా చూస్తూ ఆగాడు.

ఆమెకి విషయం చూచాయగా అర్థమవుతోంది. ఆమె గుండెలు గుబ గుబ లాడుతున్నాయి.'అతని నోటినుంచి ఏం వినాల్సొస్తుందో' అని.

ఉన్నట్టుండి పక్షుల కువకువలు చాలా డిస్టర్బ్డ్ గా వినిపించాయి. ఆమె మనసులో తీవ్ర భావసంచలనం.

కొంత సేపటి తర్వాత ఎండుటాకు కదలిక కూడా వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది. బహుశా ప్రకృతికి కూడా అక్కడ జరిగేది విని, చూడాలన్న కుతూహలం కలిగిందేమో.

"నాది బిజినెస్ మైండ్, నిజానికి నాదేంటి? అందరిదీ అంతే, అవసరాలు తీరే వరకే ఎవరికి ఎవరైనా. ఎంత ప్రేమించి పెళ్లి చేసుకున్నా, తన అవసరాలు తీర్చని భర్తని అంటిపెట్టుకుని ఉండదు భార్య. అలాగే ఇంటి పనులు 'తన అవసరాలు' తీర్చని భార్యని సహించడు భర్త. తల్లిదండ్రుల అవసరం తీరంగానే విదేశాలకు తరలిపోయి తమదైన జీవితం సృష్టించుకుంటారు పిల్లలు.

ఈ ప్రపంచంలో మానవ సంబంధాలన్నీ అవసరార్థం ఏర్పడే ఆర్థిక బంధాలే. అవి రక్త సంబంధాలైనా, ఏర్పరచుకున్నవైన ఒక్క మాటలో చెప్పాలంటే, రిలేషన్స్ అన్నీ బుల్షిట్" అన్నాడు.


"అందుచేత ఉభయకుశలోపరిగా..అంటే ఇద్దరికీ బెనిఫిసియల్గా ఒక ప్రొపోజల్ పెట్టబోతున్నాను. నేను ముందే చెప్పినట్టుగా మీకు సమ్మతమయితేనే యాక్సెప్ట్ చేయండి. మీరంటే నాకు అమిత ఇష్టం కాబట్టి, మీకు మాత్రమే నేనిస్తున్న అవకాశం ఇది. అదే మరొకరి విషయమో, మరొకటో అయితే ఈపాటికి అచీవ్ చేసి తీర్దును" అన్నాడు.

కాత్యాయని మ్రాన్పడిపోయింది. "ఏం..టం..డి అది"అంది వణకుతున్న గొంతుతో.

ఆమె వంక సూటిగా చూసి"మీరు ముందు వైబ్రేట్ అవకుండా స్టేబుల్ అవ్వండి. మనసును ప్రశాంతం చేసుకోండి. మీరేం వర్రీ అవ్వల్సింది లేదు. ఎందుకంటే మీరొప్పుకుంటేనే అన్నానుకదా!"అన్నాడు.

కొద్ది క్షణాల తర్వాత 'అయ్యేది ఎలాగు అవకమానదు' మనసులో అనుకుని కొంతవరకూ శరీరాన్ని, మనసును స్వాధీనంలోకి తెచ్చుకుంది.

అతను "కాత్యాయనీ.."అంటూ ప్రారంభించాడు.




."మనవన్నీ బిజినెస్ రిలేషన్స్ అని చెప్పాను కదా! అంతా ఇచ్చి పుచ్చుకోవడమే ! మీ ఆయనకి వచ్చిన ఖరీదైన వ్యాధికి మీరు వైద్యం చేయించ లేరు. మీ పుట్టింటి వాళ్లూ అంత కలిగిన వాళ్లేం కాదు. చేయి జాపి ఎవరి సహాయమూ అర్థించ లేరు. ఎందుకంటే మీరలా పెరిగారు. ఇహ ఆయనకు ఆపరేషన్ ఎలా జరుగుతుంది? దిన దినం అతను మృత్యువుకు దగ్గరవుతున్నాడని మీకూ తెలుసు. ఒకవేళ అతనేమన్నా అయితే వాళ్లమ్మను మీరెలా చూసుకుంటారు?. ఆవిడ అంధురాలు. కొడుకుంటే మీరంత బాధ్యత వహించాల్సిన అవసరముండదు. కాబట్టి అతను బతకడమే కరెక్ట్! ఏవంటారు?"అని ఆగాడు.

ఆమేం మాట్లాడ లేదు.

"ఒకే, ఐ విల్ కంటిన్యూ..చెప్పా కదా మిమ్మల్ని మొదటి రోజు చూసినప్పుడే నా మనసు ఫిదా అయిపోయింది. మిమ్మల్ని పొందాలన్న ప్రగాఢమైన కాంక్ష కలిగింది. మీ మెజర్ మెంట్స్ మీకు తెలుసో తెలిదో కాని మగాణ్ని పిచ్చోణ్ని చేస్తాయి. రావణుడికి, కీచకుడికీ తేడా ఉంది. రావణుడు సీత అందాన్ని చూడ లేదు. ఆమెని కోరుకోలేదు. చెల్లెలి మీద ప్రేమతో ఆమెకి జరిగిన అన్యాయానికి, ఆమె చెప్పిన మాటలకు కలిగిన కసితో సీతను ఎత్తుకెళ్లాడు. కీచకుడు అలా కాదు. ద్రౌపది అందానికి దాసోహంతో ప్రపోజల్ పెట్టాడు. చచ్చాడు. నేను వాళ్లిద్దరిని కాను. మీ ఆయన మొత్తం ట్రీట్ మెంట్ నేనే బేర్ చేస్తాను. నాకు మీరు ఒక్క.. రా..........త్రి...........కి కావాలి. ఇదే డీల్. మీకు ఇష్టమైతేనే! ఇష్టమైతేనే అంటే లిటరల్ గా మీకిష్టమని కాదు. నేను మీకు చేసిన దాన్ని బేలన్స్ చేస్తారని. ఒకవేళ మీకు నచ్చక ఒప్పుకోకపోయినా నేనేం అనుకోను. ఎందుకంటే ఆ ఒక్క రాత్రి మీ సంపూర్ణ సహకారంతో మిమ్మల్ని పొందాలి. అప్పుడే తృప్తి. అందుకే మీ యాక్సెప్టెన్స్ నాకు చాలా చాలా ముఖ్యం. ఆ ఒక్క రాత్రి

అయింతర్వాత ఇహ నేను మీకు కనిపించను. ఐ స్వేర్. మీ ఆయనతో మీరు హాయిగా, ఆనందంగా ఉండొచ్చు. మీరు మధురమైన స్మృతిలా భావిస్తారో, పీడకల అనుకుంటారో మీ ఇష్టం. ఇట్స్ మై ప్రపోజల్ దట్సాల్."అని ముగించాడు.

కాత్యాయనికి గుండె బద్దలై పోయినట్టనిపించింది. 'ఎంత మాటన్నాడు. అతను చేసిన సహాయానికి తన మానాన్ని కోరుకుంటున్నాడు. ఆడది ఎప్పటికీ మగాడికి లోకువే! ఇప్పుడు తనేం చేయ గలదు? అతని ట్రాప్ లో పడిపోయింది. కనీసం 'హాస్పిటల్లో అలాంటి ఛారిటీ ట్రీట్ మెంట్ ఉందా?' అని కూడా వాకబు చేయలేదు. రేపు తెల్లవారితే కమలాకర్ కు ఆపరేషన్. ఆపరేషన్ అయితే అతనికి మరో జన్మ దొరికినట్టే. తన సంగతి పక్కన బెట్టినా, పాపం అతని తల్లికి అతనే లోకం. ఆమె లోకం విడిచే వరకు అతనే ఆధారం. అలా అని తను తన మానాన్ని కోల్పోవాలనుకోవడం లేదు. ఇలాంటి విచిత్ర పరిస్థితి ఎవరికీ రాకూడదు.' ఆమె మనసులో ఆలోచనల సుడి.

వైబ్రేట్ అవుతున్న ఆమె శరీరం, ఎర్ర బారిన కళ్లు.. అవిశ్రాంతంగా స్రవిస్తున్న కన్నీళ్లు చూసిన మనోహర్ కాస్తంత విచలితుడయ్యాడు. లేచి నిలబడి "కాత్యాయనీ, ఇవ్వాళ మీ ముందు ఇలా రివీల్ అవడం నాకు చాలా రిలీఫ్ గా ఉంది. మీ ఆయనకి ఆపరేషన్ పూర్తయి, డిస్చార్జ్ అయి మీ సహకారంతో కోలుకోడానికి ఓ పదిహేను రోజులు పడుతుంది. ఇదిగో ఈ కార్డ్ తీసుకోండి. ఇది ఒక హోటల్ ది. మీరు ఇరవై ఒకటో రోజు సాయంత్రం ఆరు గంటలకి ఆ హోటల్ కి వస్తారని ఆశిస్తున్నాను. అక్కడ నా పేరుతో ఎప్పటికీ ఒక రూం అల్లాటై ఉంటుంది. మీరు రిసెప్షన్ లో నా పేరు చెబితే సెలెబ్రిటీ ట్రీట్ మెంట్ ఇస్తూ నా గదికి తీసుకొస్తారు. ఎందుకో మీకు అర్థమైందని నాకు తెలుసు. నేను మీ మీద ఇష్టంతో మీ ఆయన మీద పెట్టిన పెట్టుబడికి న్యాయం చేయాలనుకుంటే మీరొస్తారు! ఒకవేళ నేను మోసం లేదా బ్లాక్ మెయిల్ చేశాను అన్న భావన కలిగితే రారు. మీరు వచ్చినా, రాక పోయినా ఆ తర్వాతి రోజు నుంచి నేను మీకు కనిపించను. అంతే కాదు రేపటి నుంచి కూడా మీకు కనిపించను. ఎందుకంటే నేను ఎదురు పడితే మీకు ఎంబ్రాసింగా ఉంటుంది. మీ అవసరాలన్నీ చూడడానికి ఒక పదిహేనేళ్ల కుర్రాణ్ని పెడతాను. మీకు ఫెసిలిటీస్ ప్రొవైడ్ చేయడంతో పాటు కావలసిన అమౌంటూ స్పెండ్ చేస్తాడు. అదంతా నాదే. నేను మీ కోసం కర్చు పెట్టాలనుకున్నదే! మళ్లీ మనం కలిసేది సరిగ్గా ఇరవై రోజుల తర్వాతే. అదీ మీరనుకుంటేనే!" అంటూ వెళ్లి పోయాడు. ఆ కార్డ్ ని విసిరికొట్టాలని, ఆ ప్రపోజల్ ని, ఆ కుర్రాణ్ని రిజెక్ట్ చేయాలని అనుకుంది. కాని ఏదో తెలీని నిస్సత్తువ ఆవరించడంతో అలాగే కూర్చుండి పోయింది.

సంధ్య చీకట్లు కమ్ముకున్నాయి. "ఏమ్మా..ఇగ మీరు ఎల్లాల" అంటూ కాకీ డ్రస్ వేసుకున్నతను తన దగ్గరగా వచ్చి అనడంతో ఈ లోకంలోకి వచ్చింది. లేచి కళ్లు తుడుచుకుంది. అన్య మనస్కంగా లేచి వెళ్లబోతుంటే, "అమ్మా, ఇక్కడ మీ కార్డ్ ఒకటి ఉంది" అని అక్కడ పడి ఉన్న కార్డ్ తీసుకొచ్చి ఆమె చేతిలో పెట్టాడు. కాత్యాయని అసంకల్పితంగా దాన్ని చేతిలో పట్టుకుని హాస్పిటల్ వైపు నడవసాగింది.

నడిచే ఉప్పెనలా ఉందామె.

హాస్పిటల్లోకి చేరగానే రిసెప్షన్ లో ఆమె కోసం ఎదురు చూస్తున్న అచ్యుతరామయ్య "ఏమ్మా ఏమైంది..అలా ఉన్నావు?

అసలెక్కడికి వెళ్లావు?"అడిగాడు ఆందోళనగా.




.ఆమేం మాట్లాడకపోయేసరికి "ఏమ్మా, ఆరోగ్యం బాగాలేదా?" అడిగి "పాపం, మీ ఆయన హాస్పిటల్లో అడ్మిట్ అయినప్పటి నుంచి కడుపు  నిండా సరిగా తినడం లేదు, కంటి నిండా నిద్రపోవడం లేదు. ఇలా అయితే ఎలా చెప్పు?" అన్నాడు బాధగా.

'తను ఏం చెబుతుంది? డబ్బు ఎరగా వెదజల్లి మనోహర్ తమ జీవితాలతో ఆడుకున్నాడని ఎలా చెబుతుంది, పైగా మనోహర్ తనతో ఒక రాత్రి గడపమన్నాడని తండ్రితో నిస్సిగ్గుగా ఎలా చెబుతుంది. పరిస్థితులన్నీ ఒక్కసారిగా పగబట్టి కార్నర్ చేసినట్టుగా అనిపిస్తోంది.'

పమిట కొంగుతో కళ్లు తుడుచుకుని "ఏం లేదు నాన్నా, తల నొప్పి వచ్చింది. నొప్పి భరించలేక పోయాను. అందుకని ఇంటికెళ్లి కాఫీతో మాత్ర వేసుకుని కొద్దిసేపు పడుకుని వచ్చాను. పదండి ఆయనున్న వార్డ్ కెళదాం"అంది.

ఇద్దరు వెళ్లేసరికి తనకు కనెక్ట్ చేసిన మానిటర్ లోని పల్సెస్ వంక నిర్లిప్తంగా చూస్తూ కనిపించాడు కమలాకర్. గదిలోకి వచ్చిన భార్యని, మామగారిని చూసి పేలవంగా నవ్వాడు.

"ఇంకేంటయ్యా..రేపు నీకు ఆపరేషన్ జరిగితే నువ్వు పులి అయిపోతావు. భగవంతుడు ఆ మనోహర్ రూపంలో వచ్చి మనకింత ఉపకారం చేశాడు. నీ మంచి మనసు, కాత్యాయని చేసిన పూజలూ ఎక్కడికి పోతాయి చెప్పు. దేవుడు లేడూ"అన్నాడు అచ్యుతరామయ్య అల్లుడికి ధైర్యం నూరిపోస్తూ.

’పిచ్చి నాన్న, ఆ మనోహర్ ఇదంతా ఊరకే చేస్తున్నాడనుకుంటున్నాడు. మనోహర్ తను చేసినదానికి బదులుగా కూతురు మానాన్ని కోరుకుంటున్నాడని తెలిస్తే కుప్పకూలిపోతాడు’ మంచం మీద మడతలు పడిపోయి లుంగచుట్టుకుపోయున్న దుప్పటీని సరిజేసి కమలాకర్ తలకింద దిండును సరిగా పెడుతూమనసులో అనుకుంది.

*****

హాస్పిటల్ స్టాఫ్ కమలాకర్ ను ఆపరేషన్ కి సిద్ధం చేస్తున్నారు.

"కమలాకర్ కు ఇవాళ ఆపరేషన్ అని తెలుసుగా, మనోహర్ గారు రాలేదేమిటి? ఆయనుంటే కాస్త ధైర్యంగా ఉండేదమ్మా. "అన్నాడు అచ్యుతరామయ్య.

కాత్యాయని ఏం మాట్లాడలేదు.

రెండుగంటల ఆపరేషన్ పూర్తయిం తర్వాత ఐసీయూలో ఉంచారు కమలాకర్ ను.

ఓ పెద్ద ఫ్లవర్ బొకె ను కమలాకర్ స్పీడీ రికవర్ కోసం పంపించాడు మనోహర్. కాత్యాయని దాన్ని పెద్దగా పట్టించుకోలేదు కాని, కమలాకర్ కోలుకున్నాక చూపించాలని దాన్ని భద్రంగా పెట్టాడు అచ్యుతరామయ్య.

ఓ ఐదు రోజులు కమలాకర్ ను ఐ సి యూ లోను, మరో ఐదు రోజులు జనరల్ వార్డ్ లోనూ ఉంచి పూర్తిగా కోలుకున్నాక మళ్లీ ఎప్పుడు విజిట్ చేయాలో, ఏ టెస్టులు చేయించుకుని ఎప్పుడు రావాలో, ఏ మందులు ఎప్పుడెప్పుడు వాడాలో ప్రిస్క్రైబ్ చేసి సమ్మరీ షీట్ ఇచ్చి డిస్చార్జ్ చేశారు.

అప్పటి దాకా అయిన కర్చులన్నీ మనోహర్ నియమించిన చైతన్య అనే కుర్రాడు దగ్గరుండి చూసుకున్నాడు. మనోహర్ అతన్ని ఎవరితో ఎక్కువ మాట్లాడకుండా కేవలం పనిమీదే కాన్సన్ ట్రేట్ చేయమన్నట్టున్నాడు, ఎవరితో ఏం మాట్లాడకుండా కావలసిన పనులను గ్రహించి, కొన్ని ముక్తసరిగా అడిగి తెలుసుకుని చక్కగా నెరవేర్చేవాడు.

ఒక రోజు అన్ని ఫెసిలిటీస్ ఉన్న అంబులెన్స్ లో కమలాకర్ ను ఇంట్లో డ్రాప్ చేశారు. పక్కింటావిడ గుమ్మడికాయతో దిష్టి తీసి వాళ్లను లోపలికి ఆహ్వానించింది. కమలాకర్ తల్లికయితే ఆనందం అర్ణవమైంది. కళ్లు ఆనందబాష్పాల చెలమలయ్యాయి.

కాత్యాయని మనసులోకి అప్పుడప్పుడూ మనోహర్ వాంఛ వచ్చి చిత్రవధ చేస్తోంది.

కానీ ఏం చేయగలదు.

ఇంట్లో కూడా కొన్ని మార్పులు చేర్పులు చేయించాడు చైతన్య. అంతేకాదు దగ్గరున్న పేథలాజికల్ లాబ్ వాళ్లతో, అపోలో మెడికల్ షాప్ వాళ్లతో, కమలాకర్ వాళ్లకు ఏవి ఎప్పుడు కావలసి వచ్చినా ఇమ్మీడియేట్ గా అరెంజ్ చెయ్యాలని వాటికి కావలసిన అమౌంట్ తను పే చేస్తానని చెప్పాడు.

ఇప్పుడు ఇల్లు ఒక రూపాన్ని సంతరించుకున్నట్టుగా అనిపించింది కాత్యాయనికి. రోజులు ఇంతకుముందంత భారంగా లేవు. కమలాకర్ మెల్లగా నాలుగడుగులతో మొదలెట్టి బాగానే నడుస్తున్నాడు. నవ్వుతూ అహ్లాదంగా, ఉల్లాసంగా ఉన్నాడు. పునర్జీవనం పొందాడు కదా! అతన్ని చూస్తే కాత్యాయనికీ ఆనందంగా ఉంది.

అనుకోకుండా కేలండర్ చూసిన కాత్యాయనికి ఇంకో రెండు రోజుల్లో మనోహర్ తనకిచ్చిన టార్గెట్ డేట్ అన్న విషయం స్ఫూరణకొచ్చింది. మనసు వికలం అయిపోయింది.




కాత్యాయని ఆ రోజు ఆలస్యంగా నిద్రలేచింది. అప్పటికే కమలాకర్ లేవడం ఎక్కడికో వెళ్లడం జరిగిపోయింది. అత్తగారు స్నానం చేసి పడక్కుర్చీలో కూర్చుని ఉన్నారు.

గబ గబ బయట వాకిట్లో కళ్లాపి జల్లి, ముగ్గేసి, స్నానం చేసి దేవుడికి దణ్ణం పెట్టుకుని, వంటింట్లో కెళ్లి ఉప్మా చేసి అత్తగారికి తనకి ప్లేట్లలో పెట్టుకుని తీసుకొచ్చి ఆవిడకొకటిచ్చి తనూ మరొకటి తీసుకుని కుర్చీలో కూర్చుని తినసాగింది. తింటోందన్న మాటే గాని ముద్ద ముద్దకు మనోహర్ ప్రపోజల్ ను ఏం చేయాలన్న ఆందోళన విస్తృత మవుతోంది. అప్పుడే ఆమెకి సరిగ్గా ఓ ఆలోచన వచ్చింది.

గబ గబ తినేసి కాళ్లకు చెప్పులేసుకుని గుడికి బయల్దేరింది.

ఆమె వెళ్లే సరికి పూజలు పూర్తయి గర్భగుడి తలుపులు మూయబోతున్న అయ్యవారు ఆమెని చూసి నవ్వుతూ తలుపులు ఎడంగా తీశారు.

ఆమె కుడివైపుగా నుంచుని స్వామిని ఒక్కసారి తేరిపార చూసింది. లోకంతో తనకేమీ సంబంధం లేనట్టు నిర్లిప్తంగా చిన్న

చిరునవ్వుతో నుంచుని ఉన్నాడు. ఆమె మనసులో నిట్టూర్చి కళ్లు మూసుకుని అంతా సవ్యంగా జరిగేట్టు చూడమని కోరుకుంది. అయ్యవారు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆమెని దీవించాడు.

ఆయన గుడి తలుపులు మూసి వచ్చే వరకు ఆమె అక్కడే ఉండడం చూసి ఆశ్చర్యపోతూ 'ఏమ్మా, నాతో ఏవన్నా మాట్లాడాలా?"చెప్పమ్మా" అన్నాడు లాలనగా.

ఆమె చెమర్చిన కళ్లతో తలూపింది.

తడిసిన ఆమె కళ్ల వెనక ఉన్న బాధను అర్థం చేసుకుని ఆమెని అక్కడే కొద్దిగా పక్క నున్న గదిలోకి తీసుకెళ్లాడు. అక్కడ దేవుడి పూజలు, ప్రత్యేక కార్యక్రమాలకు      సంబంధించిన వస్తువులు భద్రపరుస్తారు. అక్కడ అయ్యవారికి మాత్రమే ప్రవేశం. మరెవరూ లోపలికి రాడానికి సాహసించరు.

అక్కడ ఉన్న టేబుల్ కు అటువైపు ఉన్న కుర్చీలో తను కూర్చుంటూ తన ఎదురుగా ఉన్న కుర్చీలో ఆమెని కూర్చోమని సంజ్ఞ చేసి గ్లాసుడు మంచి నీళ్లిచ్చి తాగమని, ఆమె నీళ్లు తాగి కాస్త కుదుటపడ్డాక "చెప్పమ్మా, నీ మనసులో ఉన్న బాధంతా నీ తండ్రిలాంటి వాణ్ని నాకు చెప్పు. నా ద్వారా స్వామి నీకు పరిష్కారం చూపుతాడని నా విశ్వాసం. అలాగే నువ్వు చెప్పేది నేను ఎవ్వరికీ చెప్పనని స్వామి మీద ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు.

కాత్యాయని కొద్దిసేపు మౌనాన్నాశ్రయించి జరిగినదంతా చెప్పడం మొదలెట్టింది. తన మొర స్వామే వింటున్నంత శ్రద్ధగానూ చెప్పింది. ఇన్నాళ్లు తన మనసులో గూడు కట్టుకున్న బాధ మరొకరికి చెప్పుకోవడంతో కాస్త మనసుకు సాంత్వన కలిగింది.

అంతా విన్నాక      ఆయన "కాత్యాయనీ, కొంతమందితో దేవుడు ఇలా ఎందుకు ఆడుకుంటాడోనమ్మా! ఈ సమస్య చిన్నదేం కాదు. మహాశివుడు క్షీరసాగర మథనంలో హాలాహలం మింగే ముందునాటి పరిస్థితి. అంత క్లిష్టమైనదీనూ. ఇహపోతే ఈనాటి లోకం డబ్బుకు పూర్తిగా దాసోహం. విలువలు పూర్తిగా అడుగంటి పోయాయి. మీకున్న ఆర్థిక పరిస్థితికి కమలాకర్ కు సరైన వైద్యం జరిగి బతుకుతాడనుకోవడం కల్ల. సమయానికి దేవుళ్లా వచ్చిన మనోహర్ తగిన ఆర్థిక సహాయం చేసి కమలాకర్ ను పునర్జీవింపజేశాడనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆ తర్వాతే కోరరాని కోరిక కోరి తనలోని రాక్షసత్వాన్ని ప్రదర్శించాడు. ఇక్కడో విషయం గమనించాలి. అతనిలో రాక్షసత్వం కొంత పాలే ఉంది- దానికి ఉదాహరణగా అతను నీతో ఎప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదు. అతని కోరిక నీ ముందు పెట్టాక, తనిక నీకు కన్పించనని మాటిచ్చాక, ఈనాటి వరకూ నీకు కన్పడలేదు కూడా. అతను అన్నమాటకి కట్టుబడతాడని అర్థ మవుతోంది. అతనిలోని ఫక్తు వ్యాపారస్తుడు నిన్ను కోరుకున్నాడు. దాన్లో తప్పూ

లేదు.

వ్యభిచారం రెండు రకాలమ్మా. ఒకటి మానసిక వ్యభిచారం- అందాన్ని చూసినప్పుడల్లా అనుభవించాలని కోరిక కలగడం. ఇది నూటికి తొంభై మందిలో జరుగుతుంది. పెద్ద పెద్ద రుషులకే తప్పలేదు ఆ రిమ్మ తెగులు. ఇహ రెండోది శారీరకం. అవకాశం వస్తే ఉపయోగించుకోవాలనుకు నే వాళ్లే ఎక్కువ. అలాంటప్పుడు శీలం అన్న దానికి విలువ ఉన్నదంటావామ్మా! పైగా నువ్వు చపలత్వంతో అడ్డదారి తొక్కడం కాదు. పరిస్థితిల ప్రాభల్యం అది.

అంచేత..అంచేత...:కాస్త ఆగాడు.

ఆమె గుండె ధన ధన కొట్టుకుంటోంది. నుదుటన చెమటలు కమ్ముకుంటున్నాయి.




ఆమె వంక ఒక మారు చూసి "చూడమ్మా.. పతివ్రత అన్న పదం నోటికి సంబంధించింది కాదు. మనసుకు సంబంధించింది. శరీరానికి సంబంధించిందైతే ద్రౌపది ఆ పదానికి ఎంత మాత్రం అర్హురాలు కాదు. మనసును పవిత్రంగా ఉంచుకున్నవాళ్లందరు పతివ్రతలే! మన పురాణాలు క్షుణ్ణంగా చదివిన జ్ఞానంతో చెబుతున్నాను.

నీ విషయానికి వస్తే, అతను ముందు చెప్పక పోయినా, తర్వాత అతని ఉద్దేశం నీకు స్పష్టంగానే చెప్పాడు. చేసిన దానికి కృతజ్ఞతా పూర్వకంగా తగినది చేయడం న్యాయం. అతనెలాగూ తర్వాత నీకు కనిపించనన్నాడు. ఆడవాళ్లని మోసం చేసిన వాళ్లు సమాజంలో ఎలా చెలామని అవుతున్నారో మనకు తెలియంది కాదు. అపవిత్ర శరీరాలతో పవిత్రమైన పెళ్లి పీటలెక్కేవాళ్లూ మనకు తెలుసు. అతను నిన్ను, వేదించినా, మరో రకంగా బాధించినా మనం ఏం చేయలేని అసహాయులం. అంచేత అతనడిగింది తప్పయినా.. నీకు తప్పనిసరి. నీ పసుపు కుంకుమలు నిలిపిన అతను నీకు దేవుడే. అతని కోరిక తీర్చడంలో నాకేం తప్పు కనిపించడం లేదు. భగవంతుని సన్నిధానంలో నాకు తోచింది ఆయన వాక్కుగా భావించి చెబుతున్నాను. ఇందులో నా ప్రమేయం లేదు. నేను నిమిత్తమాత్రుణ్ననే భావన తోటే ఇది చెబుతున్నాను. ఇహ నీకు తోచింది నువ్వు చేయి తల్లి. ఇప్పుడు నాకు నువ్వు చెప్పిన విషయాలేవీ ఎవరితోనూ, ఎట్టి పరిస్థితిల్లోనూ పంచుకోనని భగవంతుడి మీద ప్రమాణం చేస్తున్నాను" అంటూ లేచాడు. ఆమె లేచి ఆయన పాదాలనంటి, ఆయన దీవించాక బయటకు వచ్చింది.

***

ఇంటికొచ్చిన కాత్యాయనికి, వీధి వాకిట్లో చెప్పులేసుకుని బయల్దేరుతూన్న కమలాకర్ ఆమెకి కనిపించాడు. అతను ఆమె వంక చూసి, ఆమె తల మీద నిలిచిన అక్షతల్ని చూసి "ఓహ్! గుడికి వెళ్ళావా? అమ్మకి చెప్పి వెళ్లకపోయావా? ఎక్కడికెళ్లావో అని నాకు ఎంత భయం కలిగిందో.. అందుకే నీకోసమని బయల్దేరుతున్నాను"అన్నాడు ఆందోళన నిండిన స్వరంతో.

ఆమె పేలవంగా నవ్వి సరాసరి వంటింట్లో కెళ్లి అన్నం వండడంలో మునిగిపోయింది.

***

ఆరోజు సాయంత్రమే కాత్యాయని మనోహర్ ను కలవాల్సింది. లేచిందగ్గర్నుంచి విసుగ్గాను, చిరాగానూ ఇంకా ఏమిటేమిటోగా ఉందామెకి. సాయంకాలం మూడు గంటల ప్రాంతంలో కమలాకర్ 'స్నేహితుల్ని కలవడానికి వెళుతున్నానని, వచ్చేప్పటికీ రాత్రి చాలా ఆలస్యమవుతుందని' చప్పి వెళ్లిపోయాడు.


సాయంత్రం ముఖం కడుక్కుని, మామూలు నేత చీర కట్టుకుని మనోహర్ ఇచ్చిన కార్డ్ తీసుకుని దాని వంకోసారి పేలవంగా చూసి బయటకు అడుగుపెట్టబోతూ, ఏదో గుర్తుకొచ్చినట్టు అసంకల్పితంగా అత్తగారి దగ్గరకు వెళ్లి తను ఓ ఫ్రెండ్ పెళ్లికి వెళుతున్నానని వచ్చేప్పటికీ ఆలస్యమవుతుందని, మరీ ఆలస్యమైతే అక్కడే పడుకుని మరుసటి రోజు ఉదయం వస్తానని, ఆవిడకి, కమలాకర్ కు కావలసినవన్నీ డైనింగ్ టేబుల్ మీద అమర్చిపెట్టిందనీ చెప్పి బయటకు అడుగుపెట్టింది.

***

బ్రహ్మ దేవుడు అది చూసి పడీ పడీ నవ్వాడు. "చూశావా సరస్వతీ! అప్పుడు కదిలే శక్తిలేని పువ్వును సృష్టించి తుమ్మెద దౌష్ట్యానికి గురయ్యేలా చేశానని నన్ను నిందించావు, మరి కదిలి ఆలోచించే శక్తి ఉన్న కాత్యాయని మనోహర్ దగ్గరకు తనకు తానుగా తరలి వెళ్లిపోతోందేమిటి?" అన్నాడు.

"ఇదీ మీ సృష్టిలోని లోపమే, ఈ విధి లిఖితమూ మీ ప్రతిభే కదా! ఆడదాన్ని అబలగా ఉంచాలన్న కోరిక సృష్టికర్తగా మీకూ ఉంటే ఇక మాకు స్వయం ప్రకాశమూ, సమానత్వం ఎలా సాధ్యమవుతాయి?" అంటూ కోపంగా విస విస వెళ్లిపోయింది.

'ఔరా! స్త్రీలు బహు చమత్కారులు. ఎప్పుడూ వాళ్ల చేయి పైనే!' అని తలలు పట్టుకున్నాడు.




రెండు రోడ్లవతలకి వెళ్లి ఆటో మాట్లాడుకుని మనోహర్ ఇచ్చిన కార్డ్ లోని హోటల్ కి వెళ్లింది.

ఆటో అతను 'ఆటోలను ఈ గేటు లోపలికి రానివ్వరమ్మా.. ఒక్క ఖరీదైన కార్లనే పోనిస్తారు' అన్నాడు హోటల్ గేటుకు కొద్ది దూరంలో ఆటో ఆపి.

కాత్యాయని దిగి అతనికి డబ్బులిచ్చి లోపలికి  వెళ్లి రిసెప్షన్ లో ఉన్న అందమైన అమ్మాయికి తన చేతిలో ఉన్న కార్డ్ ఇచ్చింది.

ఆమె వెంటనే ఇంటర్ కాం లో ఎవరికో ఏదో చెప్పింది.

కొద్ది క్షణాల్లో ఆమె ముందు ప్రత్యక్షమైంది సుమారు పదహారేళ్ల వయసుండే ఓ స్మైలీ గాళ్, చేతిలో ఫ్లవర్ బొకెతో వచ్చి దాన్ని కాత్యాయనికి ఇచ్చి 'హార్ట్లీ.. ప్లెజెంట్ వెల్ కం టూ హెవెన్'అంది.

కాత్యాయని కుంచించుకుపోతూ అది అందుకుంది. అలాంటి పరిస్థితిలో కూడా ఆమెకి ఎక్కడలేని సిగ్గూ ముంచుకొచ్చి బుగ్గల్లోకి ఎరుపు తన్నుకొచ్చి బొకె లోని ఎర్రగులాబీలతో పోటీ పడ్డాయి. కాత్యాయనిని సాదరంగా ఆహ్వానించాక తనను ఫాలో అవమన్నట్టుగా ముందుకు నడిచింది.

కాత్యాయని ఆమె వెనగ్గా బయలుదేరింది.

కొద్ది దూరంలో మూడూ లిఫ్ట్ లున్నాయి. వాటి మీద వివిధ టైం లను డిస్ ప్లే చేసే వాల్ క్లాక్స్ ఉన్నాయి.

ఆ అమ్మాయి తన చూపుడు వేలితో లిఫ్ట్ బటన్ నొక్కింది. కొన్ని క్షణాల్లో లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయి. ఇద్దరూ లోపలికి ఎంటర్ అయ్యాక తలుపులు మూసుకున్నాయి.

తలుపులు తెరుచుకున్నాక ఇద్దరూ బయటకు అడుగుపెట్టారు.

"మేడమ్ ఈ హోటల్ లో ఇప్పుడూ మనమెళ్లబోయే రూం మనోహర్ గారి పర్మనెంట్ సూట్. హోట మేనేజ్ మెంట్ అది ఎవ్వరికీ అలాట్ చేయదు. మనోహర్ సార్, బిజినెస్ డీల్స్ అన్నీ అందులోనే. ఆయనకు లక్కీ రూం ఏమో!" అంది.

కాత్యాయని తప్పనిసరన్నట్టుగా చిన్నగా నవ్వింది.

సెంట్రల్లీ ఏ సీ ఎన్విరాన్ మెంట్ లో అటూ ఇటూ ఉన్న ఖరీదైన రూం ల మధ్య నుంచి ఎర్రటి తివాచీ మీద మెత్తగా నడుస్తున్నారు. దాదాపు ఎండ్ కార్నర్ లో ఉందా గది. అక్కడకి కొద్ది పక్కగా ఉన్న గ్లాసెస్ లోంచి చూస్తే బయట ఉన్న లాన్, అందంగా విరబూసిన విదేశి పూల మొక్కలు, మధ్యలో ఫౌంటెన్ చూడ రెండు కళ్లు చాలవు.

కళ్లు అందాల్ని చూస్తున్నా, శరీరం అందమైన పరిసరాల మధ్యనున్నా మనసు అభావంగా ఉంది కాత్యాయనికి. తలుపును చిన్నగా నాక్ చేసింది తనతో వచ్చిన అమ్మాయి.

అది ఆటోమేటిక్ తలుపు. లోపలున్న వాళ్లు, రిమొట్ లో వచ్చిన వాళ్లని డిస్ ప్లే లో చూసుకుని కా(రా) వలసిన వాళ్లయితే రిమోట్ తోనే తలుపు ఓపెన్ చేయొచ్చు. అయినా వచ్చింది కాత్యాయని అని తెలుసుకుని అతను స్వయంగా తలుపు తీసి కాత్యాయనితో వచ్చిన అమ్మాయిని 'ఇహ వెళ్లొచ్చన్నట్టుగా' కళ్లతో సంజ్ఞ చేసి, ఆమె వెళ్లిపోయాక కాత్యాయనిని సంతోషంగా, చిన్నగా నవ్వుతూ లోపలికి ఆహ్వానించాడు. ఆమె సిగ్గుతో ముడుచుకుపోతూ లోపలికి రాగానే తలుపు ఆటోమేటిక్ గా మూసుకుపోయింది.

ఆమెను మంచం మీద కూర్చోమని చెప్పి, కూర్చున్నాక ఆమె ముందుకు కుర్చీలాక్కుని కూర్చుని ఆమెని తదేకంగా చూస్తున్నాడు. మంచులో తడవడానికి సిద్ధంగా ఉన్న గులాబీమొగ్గలా గోచరించిందామె అతని కళ్ళకి.

ఆమె మరింత కుంచించుకుపోయింది. ఆమె కళ్లలో సన్నటి నీటిపొర. మనసు కల్లోల సాగరంగా ఉంది. ఈ రోజుతో తన మానం ఎంగిలైపోతోంది. బయటకి ప్రకటితం కాకపోయినా తన మూలంగా తన వంశ ప్రతిష్ట మంటగలిసిపోతోంది. అయ్యవారు ఇంతకుముందు ఎంత చెప్పినా, జరుగబోతున్నది తలుచుకుంటే ఒళ్లు గగుర్పాటుకు లోనవుతోంది.

అతను 'కాత్యాయనిగారూ..' అన్నాడు సౌమ్యంగా.

ఆమె చిన్నగా తలెత్తింది.

ఆమె కళ్లకు అతను మసగ్గా కనిపించాడు.




"కాత్యాయని గారూ, మీకు నేను మొదట్లో చెప్పినట్టుగా నేననుకున్నది సాధించే వరకు నిద్రపోకపోవడం నా మనస్తత్వం. అలాంటి పట్టుదల స్వభావంతో ఇదిగో ఈ స్థాయికి చేరాను. నేను మిమ్మల్ని చూసిన మొదటి క్షణం నుంచి మిమ్మల్ని పొందడం మీదే నా ధ్యాస. దాని కోసం ఎంత కసరత్తు చేశానో మీకు తెలియదు. మీ ఆయనకు హెల్త్ ప్రాబ్లం ఉండకపోతే నా పని అంత సులువయ్యేది కాదు. ఎందుకంటే మీరు పెరిగిన పద్ధతి, మీ వ్యక్తిత్వం నాకు తెలుసు. ఏదేమైనా మీరొచ్చారు. నాకు పండగొచ్చింది." అన్నాడు.

ఆమె తలదించుకుని అతని మాటల్ని వింటోంది.

"మీరెళ్లి ఆ వార్డ్ రోబ్ లో ఉన్న చీర తీసుకుని స్నానం చేసిరండి"అన్నాడు.

ఆమె అన్యమనస్కంగా అది తీసుకుని స్నానం చేసి వచ్చింది.

"ఓహ్! కుందనపు బొమ్మ. చిదిమి దీపం పెట్టుకోవచ్చు లాంటి మాటల్ని కొంతమంది అలవోకగా అనేస్తుంటారు. వాళ్లకు మిమ్మల్ని చూపించాలి. అప్పుడు వాళ్లకు తెలుస్తుంది పోల్చడం కూడా ఖచ్చితంగా ఉండాలని. సరే, అలా కుర్చీలో కూర్చోండి" అని దూరంగా ఒక బ్యాగ్ లో ఉన్న ప్యాకెట్ తీసి అందులోంచి కొంత డబ్బు, పసుపు కుంకుమ ప్యాకెట్లు, పూలు ఆమె చేతిలో

పెట్టాడు.

'కొంతకాలం వరకు మిమ్మల్ని పొందాలన్న తీవ్ర వాంఛలో ఉన్న నేను, నిజం మీకు తెలిసి మళ్లీ ఇదిగో ఈ రోజు వరకు మిమ్మల్ని కలవను' అన్నాక నాలో ఆలోచన మొదలయ్యింది. విదేశాల్లో లాగా మనదేశంలో సెక్స్ అనేది ఆ నిముషానికి కోరిక తీర్చుకుని మరిచిపోయేది కాదు. అది మానసికంగా నాటుకుపోతుంది. ముఖ్యంగా ఆడవాళ్లలో. రావడం వచ్చారు గాని, మిమ్మల్ని చూస్తే అర్థమవుతోంది. మీ మనసులో ఎంత భావసంచలనం కలుగుతోందో. కొన్ని క్షణాల నా తృప్తి కోసం మిమ్మల్ని యావజ్జీవిత జీవచ్ఛవాన్ని చేయలేను. మలిన పరచదలచుకోలేదు. మీ ఆయనకి ప్రాణం పోసిన నేను మీ ప్రాణం తీయలేను. మొట్టమొదటిసారిగా నా జీవితంలో ఒక స్త్రీని గౌరవిస్తున్నాను. ఇవి తీసుకుని మీరు మీ ఇంటికి వెళ్లిపోండి. నేను మీకు మాటిచ్చినట్టుగా, ఈ ఊళ్లో ఉండను. ఇహ కనిపించను. హోటల్ పోర్టికోకు మీరు చేరగానే కారు సిద్ధంగా ఉంటుంది. డ్రైవర్ మిమ్మల్ని ఎక్కడ దింపమంటే అక్కడ దింపేస్తాడు. వెళ్లిరండి" అన్నాడు.

ఆమెకు మనసులోఆశ్చర్యంతో పాటు మరెన్నో భావాలు కలగాపులగంగా కలిగాయి. ఆమె వెంటనే లేచి ఏం చేయాలో తెలీక అతని కాళ్లపై పడింది. అతను ఆమెని పైకి లేపి తలుపు దగ్గరగా తీసుకెళ్లి ఆమెని బైటకి పంపి తలుపు వేశాడు.

కాత్యాయని నడుచుకుంటూ లిఫ్ట్ దగ్గరకు వెళ్లి దాన్లో కిందకు చేరి అక్కడ నుంచి పోర్టికోకు రాగానే ఆమె కోసం కారు సిద్ధంగా ఉంది. ఆమె కార్ ఎక్కంగానే బయలుదేరింది.


దారిలో పెద్దమ్మ తల్లి గుడి కనబడంగానే డ్రైవర్ ను కార్ ఆపమని చెప్పి అతను ఆపాక డ్రైవర్తో 'ఓ అరగంటలో వస్తాన'ని చెప్పి గుడి లోకి వెళ్లింది.

గుడిలోకి వెళ్లి అక్కడి ఆఫీసులో మాట్లాడి ఒక రూం లోకెళ్లి తలారా స్నానం చేసి మానసిక మాలిన్యాన్ని వదుల్చుకుని, అమ్మవారి ముందుకొచ్చి అక్కడి కుంకం ధరించి మనోహర్ కు సంబంధించిన ఆలోచనల మనో మాలిన్యాన్ని వదిలించుకుని తన జీవితం పెడదోవ పట్టకుండా కాపాడినందుకు ఆ తల్లికి కృతజ్ఞతలు చెప్పి, కారెక్కి తమ ఇంటికి రెండు సందుల అవతల కారు దిగి ఇంట్లోకెళ్లింది.

అప్పటికీ కమలాకర్ రాలేదు.

కాత్యాయనికి ఎందుకో చాలా ఉత్సాహంగా అనిపించింది. మనసు మీంచి టన్నుల బరువు తొలగిపోయిన అనుభూతి. గబ గబ

ఇంట్లో పనులన్నీ పూర్తిచేసి కమలాకర్ వచ్చేసరికి అందంగా ముస్తాబై ఎదురు చూడసాగింది.




కమలాకర్ చాలా పొద్దుపోయాక వచ్చాడు. రాగానే కడిగిన ముత్యంలా కనిపించిన భార్యని చూశాక అతనిలోని మన్మధుడు ఆనంద చిందులేశాడు. చాలా కాలానికి ఆమె అందాన్ని తనివితీరా చూశాడు.

ఆమె దగ్గరగా వెళ్లి గట్టిగా కౌగిలించుకుని, నుదుటితో ప్రారంభించి అన్ని చోట్లా ఆత్రంగా ముద్దులుపెట్టి 'ఇప్పుడే వస్తాను' అని స్నానానికెళ్లి, సువాసన షాంపూతో తల స్నానం చేసి పంచ, జుబ్బా కట్టుకుని వచ్చాడు.

అతను వచ్చేసరికి కాత్యాయని డైనింగ్ టేబుల్ మీద ఆహార పదార్థాలు వేడి వేడిగా సర్దిపెట్టింది. కళ్లతో ఆమె అందాన్ని నంజుకుంటూ బోజనం చేసి 'నువ్వు కూడా భోజనం చేసి గదిలోకి రా' అని ఆమె చెవిలో గుస గుసగా చెప్పి గదిలోకి వెళ్లిపోయాడు.

ఆమె పనంతా పూర్తి చేసుకుని అతని గదిలోకి వెళ్లేసరికి పావుతక్కువ పన్నెండయింది.

మాంచి ఆకలిమీద ఉన్న మద సింహంలా ఉన్నాడు. ఆమె రాగానే ఒక్క ఉదుటున మంచం మీదకి లాగి ఆమె మీద పడిపోయాడు.

చాలాకాలానికి వాళ్ళిద్దరి మధ్య వెంట్రుకవాసి గ్యాప్ కూడా లేకుండా ఒక్కటైపోయారు.

***

కమలాకర్ అదే ఆఫీసులో జాయిన్ అయ్యాడు.

వాళ్ల జీవితంలో రోజులు మళ్లీ సాధారణ వేగాన్నందుకున్నాయి.

ఒకటి రెండు సార్లు కాత్యాయని భర్తకు మనోహర్ విషయం చెప్పాలనుకుంది. కాని అతను అర్థం చేసుకోకుండా అపార్థం చేసుకుంటే మళ్లీ జీవితాలు అల్లకల్లోలమైపోతాయన్న మీమాంశతో పెదాలదాకా వచ్చిన మాటల్ని మింగేసింది.

ఒకరోజు లంచ్ టైం.

మధ్యాహ్నం కమలాకర్ పక్కన విశాల్ కూర్చున్నాడు. వాళ్లిద్దరూ లేట్ గా రావడంతో కేంటీన్ లో ఎవ్వరూ లేరు.

విశాల్ అకౌంట్ సెక్షన్ లో పనిచేస్తాడు. ఇద్దరికీ బాగానే పరిచయం ఉంది.

కాసేపు ఆఫీసు రాజకీయాలు, సినిమాలూ మాట్లాడుకున్నాక "మొత్తానికి మృత్యు ముఖం దాకా వెళ్లి మృత్యుంజయుడిలా భలే తిరిగొచ్చావు బాస్"అన్నాడు విశాల్.

అవునన్నట్టుగా తలూపాడు కమలాకర్.

"ఎక్స్పెండిచర్ చాలానే అయ్యుంటుంది. నాకు తెలిసి నీకు మన కంపెనీ నుంచి గాని, పర్సనల్గా గాని మెడిక్లెయిమ్ ఫెసిలిటీ లేదు. అసలు అవి లేకే కదా అసలు నీకు ట్రీట్ మెంట్ అవుతుందో లేదో అన్న బెంగలో మీ ఫ్యామిలి మెంబర్స్

ఉండెవాళ్లు..అలాంటిది..నీకు మెడికల్ కవర్ ఎలా దొరికింది గురూ" అడిగాడు.

"హాస్పిటల్లో ఛారిటీ ట్రీట్ మెంట్ తో" తనకు తెలిసింది చెప్పాడు కమలాకర్.

"లేదు బాస్, ఆ హాస్పిటల్లో అలాంటిదేం లేదు. నేను సంవత్సరానికి రెండు సార్లు ఆ హాస్పిటల్ అకౌంట్స్ చూడ్డానికి వెళతాను" అన్నాడు.

ఆఖరి ముద్ద తినబోతున్న వాడు ఎందుకో అది సహించక టిఫిన్ బాక్స్ లో వేసేశాడు.

"ఏదేమైన నీకు ట్రీట్మెంట్ జరిగి మళ్లీ బతికి మా మధ్యలోకి వచ్చినందుకు శుభాకాంక్షలు గురూ"అని వెళ్లిపోయాడు విశాల్.

చాలా సేపు అలానే ఆలోచిస్తూండిపోయాడు.

సాయంత్రం ఆఫీసు వదలంగానే..క్యాబ్ మాట్లాడుకుని సరాసరి హాస్పిటల్ కి వెళ్లాడు.

రిసెప్షన్ కి వెళ్లి 'తనకు జరిగిన ట్రీట్ మెంట్ కు డబ్బు ఎవరు పే చేశార'ని అడిగాడు?

ఆమె అతనికి సంబంధించిన డిటేయిల్స్ తీసుకుని కంప్యూటర్ లో చెక్ చేసి "మిస్టర్ మనోహర్"అంది.

అతని గుండె ఆగినంత పనయింది. తన వైద్యం కోసం అతనెందుకు అంత డబ్బు కర్చు పెడతాడు? కారణం ఏమిటి? ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కిపోయింది.

బయటకొచ్చి ఆటో మాట్లాడుకుని ఇంటికి బయల్దేరాడు.




ఆటో ఆగిన చప్పుడవంగానే గుమ్మం దగ్గరకు వెళ్లిన కాత్యాయనికి భర్త ముఖం, కళ్లూ ఎర్రబారి ఉండడంతో అతనికి ఒంట్లో బాగోలేదేమోనని మదనపడుతూ.."ఏమైందండీ" అడిగింది.

కాత్యాయనీ "నా ట్రీట్ మెంట్ కు మనోహర్ డబ్బు కర్చు పెట్టాడట కదా? కారణం ఏమిటి? నువ్వూ మీ నాన్నా దేబురించారా? లేక..?"అని వెటకారంగా అడిగాడు.

"మీరు ముందు లోపలికి రండి" అని లోపలికి తీసుకెళ్లింది.

అతను విసురుగా లోపలికెళ్లి కుర్చీలో కూర్చుని "ఇప్పుడు చెప్పు"అన్నాడు.

కాత్యాయని నెమ్మదిగా విషయమంతా చెప్పింది.

"విషయం మొత్తం బానే చెప్పావు గాని చివర్లో మాత్రం నీకు తగ్గట్టుగా ఎడిట్ చేసుకున్నావు" అన్నాడు.

"అంటే?" అంది విషపు కత్తివాటుకు గురైనట్టుగా..

"అదే అక్కడి దాకా వెళ్లాకా నిన్ను ముట్టుకోకుండా, జాగ్రత్తగా మళ్లీ వెనక్కి పంపడం..అదీ నీ మీద మోజుతో.. అంత డబ్బు కర్చుపెట్టి.. నేను నమ్ముతాననే.."అన్నాడు కోపం ఆవేశం వ్యంగ్యం అన్నీ మాటల్లో మేళవిస్తూ..

"మీరు నమ్మినా, నమ్మక పోయినా అది వాస్తవం" అంది బాధతో.

"మీరందరూ అలాంటి పాపిష్టి డబ్బుతో నాకు వైద్యం చేయించకుండా నన్ను చంపేసినా బాగుండేది. ఇప్పుడు అందరూ నన్ను పరామర్శిస్తుంటే. . ప్రతిక్షణం చచ్చిపోతున్నాను. నన్నందరూ మోసం చేశారు. ముఖ్యంగా కోరి చేసుకున్న నువ్వు. నీ ముఖం నాకు చూపించకు..ఈ క్షణమే బయటకెళ్లిపో.."

"అదికాదండీ..నేను మిమ్మల్నెందుకు మోసం చేస్తాను?"

"మోసం కాక, కాసేపు నిన్నతను ఏం చేయలేదనే అనుకుందాం.. కాని నువ్వు ఆ ప్రపోజల్ కి ఒప్పుకునే కదా నాకు ఆపరేషన్ చేయించావు. అంటే అతనిపై నీకూ మోజుంది. ఒప్పుకో"

"ఏంటండి ఆ మాటలు"కన్నీరు మున్నీరై అతని పాదాలపై వాలిపోయింది. ముసలవిడ తన గదిలోంచి బయటకొచ్చి ముఖంలో భయాన్ని కనబరచింది. కొడుకు కోపానికి కారణమేమిటో ఆవిడకి అంతుపట్టలేదు.

"ఛ ఛ.. నన్ను ముట్టుకోకు. నువ్వు ఈ క్షణం బయటకు వెళ్లకపోతే నిన్నయినా చంపేస్తాను, లేదా నేనయినా చచ్చిపోతాను"కోపంగా ఊగిపోతూ లేచి నిలబడి అన్నాడు.

ఆమెకేం చేయాలో పాలుపోలేదు. ముందతని కోపం తగ్గాలంటే బయటకెళ్లాలి అని బయటకెళ్లింది.

ఆమె వెనకనే తలుపులు విసురుగా మూసుకుపోయాయి.

రాత్రి పది.

చాలాసేపు ఆ తలుపులు తెరుచుకుంటాయేమోనని చూసింది. ప్చ్..తెరుచుకోలేదు.

ఆమె బాధపడుతూ గుడికెళ్లింది. మరుసటి రోజు ప్రత్యేక పూజలుండడంతో అయ్యవారు ఇంకా అక్కడే ఉన్నారు.

ఆమె ఆయణ్ని కలిసి తన బాధను వ్యక్త పరచింది. విన్న చాలా సేపటికి ఆయన "అప్పటి ఆ త్రేతాయుగానికి, ఇప్పటి ఈ కలియుగానికి మగాడి మనస్తత్వంలో తేడా ఏం లేదమ్మా. నువ్వు పతివ్రతవు. మీ ఆయనకు కాస్త కోపం తగ్గి నిన్ను వెతుక్కునేదాకా నువ్వు మీ నాన్నగారింట్లో ఉండు"అన్నాడు.

"లేదు అయ్యగారూ..పెళ్లి చేసే దాకానే వాళ్ల బాధ్యత. తర్వాత నా కష్టాలకి కన్నీళ్లకీ నేనే బాధ్యురాల్ని. ఆ వయసులో వాళ్లకి మళ్లీ గుదిబండనవలేను"అంది.

"పోనీ ఓ పని చేస్తావా?"అన్నాడు.

'ఏంటన్నట్టు'గా కన్నీటి సముద్రంలాంటి ముఖాన్నెత్తింది.




"పక్క ఊరిలో అమ్మవారి దేవాలయం ఉంది. మా బాబాయ్ సోమయాజులుగారే దాని నిర్వహణ కర్త, పూజారి. నువ్వక్కడికి వెళ్లిపో తల్లి. ఆయనకి నేను ఫోన్ లో అన్ని విషయాలూ చెబుతాను. పరిస్థితులు కాస్త కుదుట పడ్డాక నువ్వు మళ్లీ వద్దువు గాని. నీ అదృష్టం బావుందమ్మా! ఇంకాస్సేపట్లో నెలకు సరిపడా గుళ్లకి పూజా ద్రవ్యాలు సప్లై చేసే వ్యాన్ వస్తుంది. అది ఇక్కడ కొన్ని ద్రవ్యాలు దింపి సరాసరి అక్కడికి వెళుతుంది. అందులో క్షేమంగా వెళ్లువు"అన్నాడు.

ఆయన కాళ్ల మీద పడిపోయింది.

"పిచ్చితల్లి లేమ్మా! సీతమ్మ తల్లి లాంటి దానివి. నీకు సహాయం చేస్తే నాకు ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయి"అన్నాడు.

"వ్యాన్ రాగానే ఆమెని వెనక సామాన్ల దాన్లో ఎక్కించి, నీ విషయం ఎవ్వరికీ చెప్పను. అలాగే అక్కడ నీకెంత కాలం ప్రశాంతంగా ఉండాల్సి వస్తే అంతకాలం ఉండు. అది నీ తండ్రి ఇల్లే అనుకో. స్వేచ్ఛగా ఉండు." వ్యాన్ బయలుదేరింది.

వ్యాన్ అమ్మవారి గుడికి చేరగానే, దాని కోసమే ఎదురు చూస్తున్న సోమయాజులు గారు వ్యాన్ దగ్గరకు వచ్చి తలుపు తీసి "రామ్మా.."అన్నారు. ఆయన భార్య వరాలమ్మ కాత్యాయనికి వ్యాన్ దిగడానికి చేయందించి దింపి, "అచ్చం ఆయన గుళ్లో

కొలిచే కాత్యాయని అమ్మవారి లాగానే ఉన్నావు. నువ్వు మా ఇంట్లో ఉండడం మా పూర్వ జన్మ సుకృతం తల్లి"అంది కాత్యాయనిని జాగ్రత్తగా తమ ఇంట్లోకి తీసికెళుతూ.

ఆమె నిర్లిప్తంగా ఆవిడ వంక చూసింది.

*****

మరుసటిరోజు తండ్రికి ఫోన్ చేసి జరిగిందంతా క్లుప్తంగా చెప్పి, 'కొన్నాళ్లపాటు అజ్ఞాతంలో ఉంటానని, తన గురించి బాధ పడొద్దని, తల్లిదండ్రులకు భారం కాకూడదనే పుట్టింటి గుమ్మం తొక్కలేదని, తను ఆత్మహత్య లాంటి నిర్ణయాలు తీసుకోనని, మంచి రోజులొచ్చి అజ్ఞాతంలోంచి తప్పకుండా బయటపడే రోజు వస్తుందని అంతవరకూ సంయమనం పాటించాలని"చెప్పింది.

ఆయన భారంగా నిట్టూర్చాడు. జరిగినదాంట్లో తప్పొప్పులు ఎంచడం చాలా కష్టం. అది ఆయా వ్యక్తిత్వాలపై ఆధారపడి ఉంటుంది. కూతురు తెలివైంది. తన జీవితం తనే చక్కదిద్దుకుంటుందన్న నమ్మకం ఆయనకు ఉంది.

******

మరుసటిరోజు ఉదయమే లేచి, స్నానం చేసింది. అప్పటికే సోమయాజులుగారు ఆయన ధర్మ పత్ని స్నానాలు చేశారు. ఆయన మడిబట్టలతో పూజాధికాలు నిర్వహించడానికి గుడికి వెళ్లిపోయారు. వరాలమ్మ వంటింట్లో అమ్మవారికి నైవేద్యం సిద్ధం చేస్తోంది.

సోమయాజులుగారు గుడి యాజమాన్యం, గుడికి ఓ పక్కగా కట్టిచ్చిన ఇంట్లోనే ఉంటారు. చుట్టూ పూల, పళ్ల మొక్కలు మధ్యలో పర్ణశాలల ఉంటుంది ఆ ఇల్లు. ఆమె కాసేపు మొక్కల మధ్య కూర్చుని జరిగిన జీవితాన్ని పునశ్చరణ చేసుకుంది.

మధ్యలో వరాలమ్మ కాఫీతెచ్చి ఆమెకోసం ఓ పక్కగా పెట్టి నవ్వి వెళ్లిపోయింది. పదకొండు గంటలు. సోమయాజులు గారు అమ్మవారికి నైవేద్యం పెట్టి, హారతిచ్చి గుడి తలుపులు మూసి ఇంటికొచ్చారు. కాళ్లు కడుక్కుని ఇంట్లోకొచ్చి తూగుటుయ్యాలలో కూర్చున్నారు. ఆయన్ని చూడగానే కాత్యాయని వచ్చి గోడకు ఓ పక్కగా నుంచుంది.

"చూడమ్మా కాత్యాయనీ, అక్కడ గర్భగుడిలో ఉన్న తల్లే నీ రూపంలో నాకు స్ఫురిస్తోంది. సమస్యలు కల్పించేదీ ఆ తల్లే, దూది పింజల్లా తొలగింపజేసేదీ ఆ తల్లే! నువ్వు ఇక్కడకు వస్తున్నట్టు అయ్యవారు చెప్పారు గాని, కారణమైన విషయమేమిటో నాకు చెప్పలేదు. నీకు చెప్పాలనిపిస్తే చెప్పు. లేదంటే చెప్పొద్దు. ఇది నీ ఇల్లు స్వేచ్ఛగా ఉండు. నిన్ను ఎవరూ ఇబ్బంది పెట్టరు. మాకు పిల్లలు లేరు. అంచేత నువ్వు ఆ దేవత మాకిచ్చిన ఎదిగిన కూతురివి"అన్నాడు మంద్రంగా నవ్వుతూ.

కాత్యాయని అంతా వివరంగా చెప్పి.."నేను అజ్ఞాతంలో ఉండదలచాను.. సమయం గడవడానికి నాకేదన్నా పనిస్తే చేసుకుంటాను" అంది.

తల్లీ నువ్వు తప్పుగా అనుకోకపోతే మన గుడిలో కసువు ఊడ్వడం, కళ్లాపి జల్లడం, ముగ్గేయడం, అమ్మవారి వస్తువులు శుభ్రపరచడం చేయగలవాతల్లీ, ఎంతో కాలం నుంచి ఎంతో మంది వచ్చారు, పోయారు. సరిగా కుదురుకోలేదు. ఆ తల్లికి సేవ చేసి పుణ్యం కట్టుకోమ్మా!"అన్నాడు చేతులు జోడించి.

"అయ్యో పెద్దవారు అలా చేతులు జోడించకండి. మంచి దారి చూపించారు. అమ్మకు సేవ చేయడం నా అదృష్టం. నాకేం ఇబ్బంది లేదు" అంది.

'అలాగే తల్లీ! అప్పుడప్పుడూ, అవసరమొచ్చినప్పుడు వరాలమ్మా నీకు సహాయ పడుతుందిలే..నీకు ఎప్పుడు ఇష్టం లేకపోయినా, లేక చేయలేకపోయినా నాకు నిరభ్యంతరంగా చెప్పు. మొహమాటపడకు. నువ్వు అజ్ఞాతంగానూ ఉంటావు ఎందుకంటే జనం వచ్చేలోపే నీ పనులన్నీ నువ్వు చేసేసుకోవచ్చు' అన్నాడు.

కాత్యాయని మనసులోనూ, శారీరకంగానూ శాంకరికి దణ్ణం పెట్టుకుంది.




ఉదయం నాలుగున్నరకు వరాలమ్మ, సోమయాజులుగారు నిద్రలేస్తారు. ఇప్పుడు వాళ్లతో పాటూ కాత్యాయని కూడా లేచేస్తోంది. వాళ్లని చూస్తుంటే ఆమెకి తన తల్లి తండ్రులు గుర్తొస్తున్నారు. వాళ్లకి తను ఒకతే సంతానం. ఇప్పుడు పిల్లల్లేని వీళ్లకు తను కూతురైంది. ఏమిటో విధి విచిత్రం.

గుడి ముందుకెళ్లి వాకిలి ఊడ్చి, కళ్లాపి జల్లి, మెట్లు కడిగి ముగ్గులేసి దేవుని సామాను శుభ్రపరచి గర్భ గుడి గుమ్మం ముందు ఉంచి, తొలి సూర్యకిరణం స్పృశించేసరికి ఇంటికొచ్చి స్నానం చేసి దొడ్లో ఉన్న రకరకాల పూలు కోసి, సజ్జలో వేసుకుని వెళుతుంటే, వరాలమ్మ నవ్వుతూ ఎదురొచ్చి అక్కడే ఉన్న అరటి చెట్టు నుంచి సన్నని నార తీసి, పూలను కొన్ని నిముషాల్లో చక్కని మాలగా కట్టిచ్చింది. దానిని సజ్జలో విడిపూలతో పాటు ఉంచి, గుడికి తీసుకెళ్లింది. అప్పటికే గర్భ గుడిలో దేవతా మూర్తులను కడిగి, బట్టలు కట్టి, బొట్లుపెట్టి హారతి పళ్లెం, శఠగోపం, పంచపాత్ర ఇత్యాది వస్తువులు చక్కగా సర్దుకున్నాడు సోమయాజులుగారు. పూల సజ్జను ఆయనకు అందించేసరికి ఆయన నవ్వుతూ ఆమెని కూర్చోమని సంజ్ఞ చేసి, కొన్ని విడిపూలను పూజకు ఉంచుకుని, దండలతో దేవతామూర్తులను చక్కగా అలంకరించారు.

అగరు.. అత్తరు సువాసనలు మత్తెక్కిస్తుంటే, దీపాల వెలుగులో నవ్వులు చిందిస్తున్న దేవతా మూర్తులను చూస్తూ, ప్రాతఃకాల సమయంలో వీచే చల్లనిగాలి.. స్నానించిన శరీరాన్ని స్పృశిస్తుంటే, మంద్రంగా వినవస్తున్న మంత్రాలకు ఒళ్లు పులకరించిపోతోంది కాత్యాయనికి. అప్రయత్నంగా శాంకరికి చేతులు జోడించింది.      ఒక్కొరొక్కరుగా జనం వస్తుంటే, పమిట చెంగు తలమీదుగా ముఖం కనబడకుండా వేసుకుంది. పూజ పూర్తయ్యాక తీర్థ ప్రసాదాలు తీసుకుని ఇంటి ముఖం పట్టింది.

కొత్త వాతావరణం, కొత్త పని కాలం కళ్లెం లేకుండా సాగిపోతోంది.

కాత్యాయనికి అది మరో జన్మలా ఉంది.

*****

ఛానల్ టీవీల ప్రపంచంలో కొత్తగా ప్రారంభించిన వాహ్ టీవీ రోజు రోజుకి తనదైన ప్రత్యేక కార్యక్రమాలతో వ్యూవర్స్ ను పెంచుకుంటూ ప్రభంజనం సృష్టిస్తోంది. ఆ ఛానల్ లో ప్రసారమయ్యే 'చీకటి మలుపు' కార్యక్రమం పి ఆర్ పి రేటింగ్ లో టాప్ లెవెల్ లో ఉంది. మనుషుల జీవితాల్లోని అనూహ్యమైన మలుపులను వాస్తవంగా చిత్రీకరిస్తూ జన హృదయాలకు బాగా దగ్గరయింది. దానిక్కారణం హేమ. హేమ ఓ జర్నలిస్ట్. చీకటి మలుపు కార్యక్రమ రూపకల్పన, నిర్వహణ అంతా ఆమెదే!

గుళ్లోని పూజారుల యథార్థ జీవనం మీద కార్యక్రమం షూట్ చేయడానికి అన్ని గుళ్లూ తిరుగుతోంది హేమ. తలుపులు తెరిచిందగ్గర్నుంచి, గుడి మూసే దాకా ఉండి పూజారుల వాస్తవ జీవన విధానాన్ని యథాతథంగా చిత్రిస్తోంది. అందులో భాగంగా తొలికోడి కూయంగానే తలంటు పోసుకుని, చక్కగా ముస్తాబై, కెమెరా మెన్ తో అమ్మవారి ఆలయానికి వచ్చింది. ముందే ఆలయ కమిటీ సభ్యులు చెప్పి ఉండడంతో సోమయాజులు కొద్ది దూరంలో చాప వేసి ఆమెని కూర్చోమన్నాడు. కాత్యాయని గుడిని శుభ్రపరచే పని చేసుకుంటోంది.


సోమయాజులుగారితో "మీరు గుడి గురించి ఏమీ చెప్పనక్కర్లేదండి. అందుకు చాలా ఛానల్స్ ఉన్నాయి. మీ గురించి చెప్పండి. మీ సమస్యలు చెప్పండి. మానవ సేవే మాధవ సేవ కదా! అందుకే నేనొచ్చాను" అంది.

సోమయాజులుగారు చెప్పేది శ్రద్ధగా వింటున్నా, జర్నలిస్ట్ కాబట్టి చుట్టూ పరీక్షగా చూస్తోంది. ఊడ్చే పనంతా చేసి, దేవుడి సామాగ్రి తోమిపెట్టి, వెళ్లి స్నానం చేసొచ్చి పూలమాలలు సోమయాజులుగారికిచ్చి, కాత్యాయని దూరంగా కూర్చోడం గమనించింది హేమ. కొంతసేపటి తర్వాత జనం రావడం ప్రారంభం కావడంతో తలమీదకి పమిట చెంగు లాక్కుని ఎవరికంటా పడకుండా జాగ్రత్త పడడం, తర్వాత వెళ్లిపోవడం హేమకి ఆసక్తి కలిగించింది.

మధ్యాహ్నం సోమయాజులుగారు గర్భగుడికి తాళం వేసి "అమ్మా, పద మళ్లా ఐదింటికి గుడి తెరుస్తాను. అప్పటిదాకా మా ఇంట్లో కాస్త ఎంగిలిపడి కాస్సేపు విశ్రాంతి తీసుకుని సాయంకాలం నాతో వద్దువుగాని"అన్నాడు.

ఆయన వంక రెండు నిముషాలు నిశ్చలంగా చూసి "పొద్దుట ఇక్కడ ఒకమ్మాయి ప్రవర్తన నాకు వింతగా అనిపించింది. ఆమెందుకో జనం కంట పడకుండా జాగ్రత్త పడుతున్నట్టనిపించింది. ఆమెవరు?" అని సూటిగా అడిగింది.

ఆ ప్రశ్న ఆయన్ని ఉలిక్కిపడేలా చేసింది.




అబద్ధం చెప్పలేని, చెప్పని మనిషాయన. కాత్యాయని విషయం ఎట్టి పరిస్థితిల్లోనూ లోకానికి వెల్లడించకూడదని కడుపులో దాచుకున్న మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. ఇప్పుడు ఆయనకు సంకట పతిస్థితి ఎదురయింది. "అమ్మా మా పూర్వికులు కూడా భగవంతుడి సేవలో నిమగ్నమైనవారే.."అంటూ ఏదో చెప్పబోయారు. "అయ్యవారూ..ఆ విషయాలు సాయంకాలం నుంచి రాత్రిదాకా గుళ్లో తీరిగ్గా మాట్లాడుకుందాం. మీరు మాట తప్పిస్తున్నారంటే, అది తెలుసుకోవాల్సిందే అనిపిస్తోంది. నాకు ఆవిడ విషయం చెప్పండి దయచేసి" అంది దృఢంగా.

ఆయన ఒకపరి ఆమె వంక తేరిపార చూసి "చూడమ్మా, ఆమెకి సంబంధించిన వివరాలు ఎవరికీ చెప్పనని, ఆమెకి ఆశ్రయం

ఇచ్చాను. ఆ విషయంలో నన్ను ఇబ్బంది పెట్టడం నీకు తగదు" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"నేను ఆమెని ఒక్కసారి కలుస్తానంతే, మా కెమెరామెన్ ను కూడా నా వెంట తీసుకురాను. ఆమె అనుమతి లేకుండా బయటి ప్రపంచానికి ఆమె ఉనికిని ఎట్టిపరిస్థితిల్లోనూ వెల్లడించనని ఆత్మసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. నన్ను నమ్మండి" అంది నిశ్చలంగా. చేసేదేంలేక ఆమెని ఇంటికి తీసుకెళ్లి కాత్యాయనిని ఆమెకి పరిచయం చేశాడు.భోజనాలయ్యాక వాళ్లిద్దరినీ కాత్యాయని గదిలోకి వెళ్లి మాట్లాడుకోమన్నాడు.

"చూడండి కాత్యాయనిగారూ, గుళ్లో మీ ప్రవర్తన వింతగా తోచి నేనెన్నోమార్లు అడిగిన మీదట అయ్యవారు మిమ్మల్ని కలుసుకోనిచ్చారు. మీకు సంబంధించిన ఏ విషయం మీ అనుమతి లేకుండా లోకానికి వెల్లడి చేయను. నన్ను నమ్మి మీకు సంబంధించిన వివరాలు చెప్పొచ్చు. మీకు న్యాయం చేయడానికి నేను ఏమాత్రం సహాయం చేయగలిగినా చాలు. అందరూ అనుకునేట్టు నాలుగ్గోడల మధ్య ఉండే జీవితాలను నడివీధిలో పడేయ్యడం జర్నలిజం కాదు. సమాజానికి సరైన దిశానిర్దేశం చేసి, వ్యక్తులకు న్యాయం చేయడం జర్నలిజం. జర్నలిజం నా వృత్తికాదు, ప్రాణం" అంది హేమ.

హేమ మాటల్లోని నిజాయితీ, ఆత్మవిశ్వాసం కాత్యాయని మనసులో హేమపట్ల నమ్మకాన్ని కలిగించింది. పైగా దాదాపు ఒకే వయసు. చాలాకాలం తర్వాత హాయిగా ఆనందంగా ఆమెతో సంభాషించింది.

హేమ సాయంకాలం సోమయాజులుగారితో గుడికి వెళ్లలేదు. దానికన్నా కాత్యాయనితో గడపడమే ముఖ్యమనుకుంది. కెమెరామెన్ తో హోటల్ రూం కి వెళ్లిపొమ్మంది.

సోమయాజులుగారింటికొచ్చాక, మొట్టమొదటిసారి హేమతో ఆమె స్కూటీమీద షాపింగ్ కి వెళ్లింది కాత్యాయని. హేమ కాత్యాయనికి బట్టలు కొనిచ్చి, హోటల్ కి తీసుకెళ్లింది. మంచి ఫ్యామిలీ మూవీకి వెళ్లారు. ఇంటికి వస్తు వస్తూ సోమయాజులుగారి దంపతులకు పళ్లుతీసుకున్నారు.

ఆరోజు కాత్యాయని పొందిన సంతృప్తిలో కూడిన ఆనందం అంతఇంత కాదు.

ఆ రాత్రి కాత్యాయనితోపాటు అక్కడే ఉంటానని సోమయజులుగారికి చెప్పింది. ఆయన అంగీకరించారు. ఇద్దరాడపిల్లలు ఇంటికి పండు వెన్నెల పట్టుకొచ్చారని మురిసిపోయారు ఆ వృద్ధదంపతులు. ఆ రాత్రి హేమ, కాత్యాయని డాబామీదకి వెళ్లారు.

నిండు పున్నమి చంద్రుడు అల్లంత ఆకాశంలోనే ఉండి.. వెండి వెన్నెల వెదజల్లుతున్నప్పటికీ చేయి చాస్తే అందేంత దూరంలో

ఉన్నట్టున్నాడు. కాసేపు చంద్ర బింబం వంక కన్నార్పకుండా చూశాక "చెప్పు కాత్యాయనీ, నీ గురించి నీ అనుమతి లేకుండా ఏదీ బయటకి వెల్లడించనని మరోసారి ప్రమాణం చేస్తున్నాను."

ఆ మాట విన్నాక కాత్యాయని కాసేపు మౌనాన్నాశ్రయించింది. అప్పటిదాకా ఆమె మనసు పొరల్లో దాగున్న దృశ్యాలన్నీ ఒక్కటొక్కటిగా మనోఫలకంపై కదలాడసాగాయి.




కాత్యాయని నెమ్మదిగా నోరు..కాదు కాదు మనసు విప్పింది.

అమ్మానాన్నలవద్ద లేడికూనలాంటి తన అందమైన జీవితం, కమలాకర్ తో ముడిపడిన జీవితం, అనుకోకుండా తమ జీవితంలో అశనిపాతమై నిలిచిన కమలాకర్ కు వచ్చిన వ్యాధి, మనోహర్ ఆదుకోవడం, ఆపైన అతని ప్రపోజల్, ఆ తర్వాత జరిగిన పరిణామాలు, కమలాకర్ ఇంట్లోంచి గెంటేయడం, పుట్టింటి గుమ్మం తొక్కడం ఇష్టం లేని తనను, అయ్యవారు ఇక్కడికి పంపడం, సోమయాజులుగారి దంపతులు తనను కన్నవాళ్లలా ఆదుకోవడం అన్నీ పూస గుచ్చినట్టు వివరంగా చెప్పింది.

హేమ కళ్లలో సన్నటి నీటిపొర నిలిచింది. ఆనాటి సీత నుంచి ఈనాటి కాత్యాయని వరకు స్త్రీలు అబలలే! పరిస్థితిలు అనుకూలంగా ఉంటే సబలల్లా కనిపిస్తారంతే! సమాజంలో నిర్ణయాలెప్పుడూ మగవాళ్లవే, భరించాల్సింది ఆడవాళ్లే!

"సరే, కాత్యాయనిగారు బాగా పొద్దుపోయింది. మనం పడుకుందాం. అనవసరంగా నేను మిమ్మల్ని గతం అడిగి మీ మనసునొప్పించానని అనను. ఎందుకంటే, అది మీ మనసులో దాగున్న ముల్లు. అప్పుడప్పుడూ కలుక్కుమనిపిస్తూనే ఉంటుంది. దాన్ని శశ్వతంగా ఎలా తొలగించాలా? అని ఆలోచించాలి. మన జీవితం తెగిన గాలిపటం ఎన్నటికీ కాకూడదు. పదండి" అంది.

ఇద్దరూ గదికొచ్చి నిద్రపోయారు.

***

హేమ, కాత్యాయని ఉదయం పెందళాడే లేచారు.

కాత్యాయనితోపాటూ హేమ కూడా అన్ని పనులూ చేసింది. మొట్టమొదటిసారిగా, అలవాటు లేని పనులతో కాస్త అలసిపోయినప్పటికీ, పట్నపు కృత్రిమ వాతావరణం నుంచి ఎంతో సేద దీరినట్టుగా అనిపించింది హేమకి.

మధ్యాహ్నపు భోజనాలనంతరం సోమయాజులుగారి ఇంటికి ఆనుకుని ఉన్న అరెకరం పూల, పళ్ల తోటలో ఉన్న మట్టి దిబ్బ మీద కూర్చున్నారు ఇద్దరూ.


"కాత్యాయనీ, నీ జీవితం, అందులోని ఒడిదుడుకులు పిక్చరైజ్ చేసి టెలికాస్ట్ చేద్దామనుకుంటున్నాను. అందులో నువ్వుండవు, ఉన్నా ఆకారం తెలియకుండా మేనేజ్ చేస్తాను. నీకు ద్రోహం చేసిన వాళ్లెవరో వాళ్లను మాత్రం బల్లెంలా పొడుస్తుంది. ఇలాంటి చేదు అనుభవం పొంది జీవితాన్ని కోల్పోయామని బాధపడుతూండే వాళ్లకు, ఆత్మహత్యచేసుకుందామనుకునే వాళ్లకు ఒక స్ఫూర్తిమంత పాఠం. నువ్వంగీకరిస్తేనే నేను ముందడుగేస్తాను. లేకపోయినా నేను నీ స్నేహితురాల్నే. నువ్వు నాకు చాలా దగ్గరయ్యావు. నా స్వార్థం కోసం మాత్రం నేనిది టెలికాస్ట్ చెయ్యాలనుకోవడం లేదు. నన్ను నమ్ము" అంది.

కాత్యాయని 'తనకి అంగీకారమేనని, సోమయాజులుగారి అంగీకారం తీసుకుంటానని' అంది.

హేమ సంతోషంగా 'సరే' అంది.

ఆ రాత్రి సమయాజులుగారి దగ్గర విషయం కదిపితే- "నీకు అభ్యంతరం లేకపోతే, నాకెందుకు ఉంటుందమ్మా? కానైతే కాస్త జాగ్రత్త. మమ్మల్ని మాత్రం టీవీలోకి లాగొద్దు దయచేసి" అన్నాడు.

"అలాగే అయ్యగారూ. మీకే సమస్యలూ రావు. నన్ను నమ్మండి" అంది హేమ.




తల్లిదండ్రుల సమక్షంలో చలాకీగా తిరిగే పిల్ల, పెళ్లి పేరుతో ఎలా బంధీ అవుతుంది, పరిస్థితిలు అననుకూలమైతే ఆమె బతుకు ఎంత అంధకారబంధురమవుతుంది, అలాంటి విపత్కర పరిస్థితిని తమకనుకూలంగా మలచుకునే మేకవన్నె పులులెలా ఉంటారు అన్న అంశాలతో, హృదయాన్ని కదిలించే దృశ్యాలతో, మనసును మెలిసే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్..వాయిస్ ఓవర్ తో చక్కగా పిక్చరైజ్ చేసి ఓ గుడ్ డే టెలికాస్ట్ చేసింది హేమ.

అప్పటి దాకా ఏ ప్రోగ్రామ్ కి రాని అనూహ్యమైన ప్రతిస్పందన. ఎన్నో మహిళా మండళ్లు ఆమె ఎవరో తెలియజేస్తే తగిన సహాయ సహకారాలందిస్తామని, ఆర్థికంగా, హార్థికంగా తోడుంటామని వస్తే 'కాత్యాయని గురించి ఎవరికి చెప్పనని' మాటిచ్చింది కనుక హేమ సున్నితంగా తిరస్కరించింది.

ఆ విషయాలన్నీ హేమ కాత్యాయనితోనూ, సోమయాజుల దంపతులతోనూ చెబితే, అంత మంచితనం ఉంది కాబట్టే రుతువులు గతి తప్పట్లేదని సోమయాజులుగారంటే, తన జీవితం కొంతమందికన్నా స్ఫూర్తినిచ్చి, ఆలోచనలో పడేసిందని కాత్యాయని సంతోషించింది.

హేమ ఆ ప్రోగ్రామ్ ని యూ ట్యూబ్ లోనూ అప్ లోడ్ చేసింది.

వచ్చిన కామెంట్లయితే ఓ వరదే!

రోజులు యథాప్రకారం గడిచిపోతున్నాయి.

అప్పుడప్పుడూ హేమ సోమయాజులుగారింటికొచ్చి కాత్యాయనితో గడిపి వెళుతోంది.

ఇప్పుడు ఆయనకూడా హేమను తను నిత్యం కొలిచే జగదంబ ఇచ్చిన మరో కూతురనుకుంటున్నాడు.

*****

ఇదిలా ఉండగా ఒకరోజు-

హేమ బిజీగా స్క్రిప్ట్ వర్క్ చేసుకుంటోంది. ఆఫీస్ అసిస్టెంట్ వచ్చి.."మేడమ్, మీకోసం ఎవరో వచ్చారు" అంది.

ఆమె కార్యక్రమాలు టెలికాస్ట్ అయ్యాక ఎవరో ఒకరు రావడం పరిపాటే!

"కొద్ది సేపు వెయిట్ చేయమను. నేను వర్క్ ఫినిష్ చేసుకుని వచ్చి కలుస్తానని చెప్పు"అంది.

ఆమె వెళ్లిపోయింది.

పదిహేను నిముషాల తర్వాత మళ్లీ వచ్చి హేమకు అతని గురించి గుర్తు చేసింది.

నిజానికి అసిస్టేంట్ అతన్ని గురించి చెప్పిన విషయాన్ని హేమ మర్చిపోయింది, కాని.. "ఓ పది నిముషాల్లో వస్తున్నానని చెప్పు" అంది.

ఆమె వెళ్లిపోయింది.

మళ్లీ పదిహేను నిముషాల తర్వాత తన ఎదుటకి వచ్చిన ఆసిస్టెంట్ ను చూసి 'పద' అంది.

బయట సోఫాలో సూటూ బూటులతో ఒక వ్యక్తి హుందాగా కూర్చున్నాడు.

"గుడ్మార్నింగ్ సార్.. మీరు..?" అంది అర్థోక్తిగా.

"ఐయామ్ మనోహర్" అన్నాడు.

క్షణకాలంలో ఆమె మనసులో కాత్యాయనిని అన్యాయం చేసిన మనోహర్ మెదిలాడు. ఆమె ముఖం జేగురు రంగులోకి మారిపోయింది. కళ్లు కోపంతో ఎరుపెక్కాయి. ఆమె ముఖ కవళికలను చూసి ఆమె అంతర్మథనాన్ని గమనించి.."మేడమ్ కుడ్ వి సిట్ ఫర్ కపుల్ ఆఫ్ మినిట్స్" అభ్యర్థించాడు.ఆమె అసిస్టెంట్ ను వెళ్లిపొమ్మని' కొద్ది దూరంలో ఐసోలేటేడ్ గా ఉన్న గ్లాస్ ఛాంబర్ లోకి తీసుకెళ్లింది.

అక్కడ కూర్చున్నాక "మేడమ్ నేను కాత్యాయనిగార్ని చూడాలి"అన్నాడు ఆమె వంక సూటిగా చూస్తూ.

"నో నెవర్"అంది విసురుగా..తీవ్రంగా.




ఉదయం పదకొండు గంటలు.

సోమయాజులు గారి ఇంటి ముందు ఆగిన క్యాబ్ లోంచి దిగిన హేమ గబ గబ ఇంట్లోకి వెళ్లి అప్పటికే సిద్ధంగా ఉన్న కాత్యాయనిని బయల్దేరదీసి, సోమయజులుగారి దంపతులకు తాము వెళుతున్నామని, మళ్లీ కాత్యాయనిని జాగ్రత్తగా ఇంట్లో దింపే బాధ్యత తనదేనని చెప్పి బయటకొచ్చి కాత్యాయనితో సహా కారెక్కింది.

కార్ స్మూత్ గా సాగిపోతోంది.

"కాత్యాయనీ, గతాన్ని తలచుకోకు. మనకు వర్తమానం ముఖ్యం. ఏం జరుగుతుంది, ఎలా జరుగుతుందన్నది మనకు తెలియదు. అందుకే శష భిషలతో కాలం వృధాచేయకూడదన్నది నా పాలసీ. మన కార్యక్రమం అంతటి బిజీ మనిషి కంట్లో పడడం కేవలం యాథృచ్ఛికం కాదు. మరేదో దైవ సంకల్పిత నిర్ణయం ఉందని నాకనిపిస్తోంది. నువ్వూ అదే నమ్ము"అంది.

కాత్యాయని తలూపింది. ఆమె మనసు మాత్రం గతాన్ని ఒక్కసారిగా వేగంగా స్పృశించి, ఇప్పుడే పరిణామాలు జరగబోతున్నాయో అన్న సంధిగ్ధ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

కారు ఛానల్ టీ వీ కార్యాలయం ముందు ఆగింది. ఖరీదైన మనుషులతో, ఖరీదైన కార్య కలాపాలు జరిగే అతి ఖరీదైన ప్రాంతమది. అక్కడ కొలువైన ప్యాలెస్ లాంటి ఛానల్ సంస్థను కళ్లింతలు జేసుకుని ఆశ్చర్యంతో చూస్తోంది కాత్యాయని. ఇంత గొప్ప సంస్థలోనా హేమ పనిచేస్తున్నది? అన్న విస్మయం ఒకవైపు, అయినా ఏ రకమైన భేషజాలు లేకుండా తమతో కలిసిపోయిందన్న ఉదాత్త భావన మరోవైపు.

లోపలి కెళ్లాక రిసెప్షన్ లో ఏం చెప్పకుండానే సరాసరి తన సీట్ కి తీసుకుపోయి, కాత్యాయనికి సీట్ చూపించి, కూర్చోమని, తనూ కూర్చుని ఇంటర్ కామ్ లో రెండు స్ట్రాంగ్ కాఫీలు ఆర్డర్ ఇచ్చి, "నువ్వు ఏం ఎగ్జయిట్ అవ్వకు కాత్యాయనీ, నీతోపాటూ నేనూ ఉంటాను. మరి ఆయన్ని పిలవనా?" అంది. పిలవమన్నట్టుగా చిన్నగా తలూపింది.

హేమ తన సెల్ నుంచి అతనికి కాల్ చేసి ఛానల్ ఆఫీసుకు రమ్మని చెప్పింది.

కాఫీ తాగుతుండగానే రిసెప్షనిస్ట్ 'మనోహర్ అనే అతను హేమను కలవాలనుకుంటున్నట్టు' చెప్పింది.

'అప్పుడే వచ్చేశాడా?' అన్న ఆలోచన ఇద్దరి మనసుల్లోనూ మెదిలింది. దాంతో అతను కాత్యాయనిని కలుసుకోవాలని ఎంతగా తహ తహలాడుతూందీ కూడా తెలిసింది.

అతన్ని వెయిట్ చేయమని చెప్పి, కాఫీ తాగాక కాత్యాయనిని కాన్ఫరెన్స్ హాలులో కూర్చోపెట్టి ఆమెతో తనూ కూర్చుని రిసెప్షనిస్ట్ కి అతన్ని కాన్ఫరెన్స్ హాల్ కి పంపమని చెప్పింది.

ఇద్దరి మనసుల్లోనూ ఉద్వేగం. ఇన్నాళ్లకి తనను కలుసుకోవాలనుకుంటున్నదెందుకో అన్నది కాత్యాయనిదైతే, వాళ్లిద్దరి మధ్య ఏం జరగబోతోందన్నది హేమది. అద్దాల్లోంచి మనోహర్ వస్తూ కనిపించాడు. అతనిలో పెద్ద మార్పేమీ లేకపోవడం గమనించింది కాత్యాయని.

అతను కాన్ఫరెన్స్ హాల్ డోర్ వద్దకు వచ్చి పుష్ చేశాడు.


"ప్లీజ్ కం"అంది హేమ నవ్వుతూ అతన్ని లోపలకి ఇన్వైట్ చేస్తూ.

మనోహర్ హుందాగా వచ్చి తనకు ఆఫర్ చేసిన సీట్లో కూర్చున్నాడు.

కాత్యాయనిని చూసి "బాగున్నారా కాత్యాయనీ" అన్నాడు.

కాత్యాయని 'బాగున్నానన్నట్టు'గా తలూపింది.

అతను చిన్నగా దగ్గాడు..తను ఏదో చెప్పడానికి ఉపోద్ఘాతంగా..




"కాత్యాయని గారూ, మిమ్మల్ని 'ఆ' దృష్టితో చూసిన నేను, మీరు దగ్గరయ్యాక నాలో అనూహ్యమైన మార్పు కలిగింది. నా మీద నాకే అసహ్యం కలిగింది. మీరెళ్లిపోయాక నేను ఊరు వదిలేశాను. దారీ తెన్నూ తెలియనట్లు ఎన్నో చోట్ల తిరిగాను. అన్నట్టు నా సంగతి సరె, ఇంతకీ మిమ్మల్ని బయటకు పంపించేశాక మీ హస్బెండ్ మిమ్మల్ని కాంటాక్ట్ చేశారా?"

లేదన్నట్టు తల అడ్డంగా ఊపింది.

"ఇప్పుడు ఆయనెలా ఉన్నారని మీరనుకుంటున్నారు?"

"నాకు తెలియదు. కాని నన్ను పంపించాక ఆయన కూడా పశ్చాత్తాపంతో దహించుకుపోతున్నారేమో, మానసికంగా కుమిలి పోతున్నారేమోననిపిస్తోంది"

"మీ ఊహ నాకు నవ్వు తెప్పిస్తోంది. మీ కొద్ది క్షణాల దగ్గర తనం నన్ను మార్చేస్తే, మీ అన్నాళ్ల సాహచర్యం అతనికి ఇసుమంత గుర్తుకు రాకపోగా.."అని కాస్త ఆగాడు.

'అతను ఏం చెప్పబోతున్నాడో' అన్న ఆత్రుత వాళ్లిద్దరి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

"మిమ్మల్ని వదిలించుకుని, హాయిగా పెళ్లి చేసుకున్నాడు. ఇదిగో వాళ్ల పెళ్లి ఫోటోలు"అని సెల్లో తను సేకరించిన ఫోటోలు చూపించాడు.

హేమ, కాత్యాయనిలు వాటిని ఆశ్చర్యంతో కళ్లింతలు చేసుకుని చూశారు. ఆ వెంటనే కాత్యాయని కళ్లలో నీళ్లు నిలిచాయి.

"అగ్ని సాక్షిగా పెళ్లాడిన తను, నేనే లోకమని చెప్పిన తను, నిజానిజాలు తెలుసుకోకుండా అలా ఎలా చేశాడోనండి" బాధగా అశ్రునయనాలతో అంది.

"ఆ రాస్కెల్ పని నేను పడతాను. మహిళా మండళ్లను సంప్రదించి వాడి తిక్క కుదురుస్తాను" కోపంతో ఎర్రని ముక్కుపుటాలు అదురుతుండగా, ఆవేశంగా అంది హేమ.

"వద్దు హేమా, అతని పాపం అతనే అనుభవిస్తాడు. నన్ను అతను కాదనుకుని, బయటకు గెంటేసిన రోజునే మా బంధం తెగిపోయింది"

"మరి నీ జీవితం?"

"నేను అతని దగ్గరకు వెళ్లాలని ఏనాడూ అనుకోలేదు. ఆ ప్రయత్నాలూ చేయలేదు. నాకు దేవుడు ఏదో ఓ దారి చూపిస్తాడని నా నమ్మకం"

ఆ మాట విని నీరు గారిపోయింది హేమ. "రామరాజ్య కాలం నుంచి ఈనాటి దాకా మన స్త్రీలం అంతే! అడవిలాంటి లంక నుంచి తనను తెచ్చుకున్న రాముడు, గుండెల్లో పొదువుకుంటాడని సీత అనుకుందిగాని, అనుమానంతో మళ్లీ అడవులకు పంపుతాడనుకోలేదు. నీలాంటి వాళ్లు ఉన్నంతకాలం వాళ్ల పప్పులు అలా ఉడుకుతూనే ఉంటాయి"అంది.

కొంతసేపు మౌనం వాళ్లందరి మధ్యా తిష్ఠవేసుకుంది.

తర్వాత తేరుకున్న హైమ "అన్నట్టు మీరెందుకు కాత్యాయనిని కలవాలనుకుంటున్నట్టు?"అంది.

మనోహర్ ఒకసారి హైమను, ఆ తర్వాత కాత్యాయనిని చూసి "ఎందుకంటే..?" అంటూ చెప్పడం ప్రారంభించాడు.




"కాత్యాయని గారూ, ఈ జీవితం ఏముందండీ.. నా అనుకుంటే స్వార్థం, మన అనుకుంటే లోక కల్యాణం. చిన్నప్పట్నుంచి డబ్బుకు దేబురించే కుటుంబంలో పుట్టడం చేత, కోరికలను అదుపుచేస్తూ పెరగడం చేత, డబ్బు మీద ఒక రకమైన కసి ఏర్పడింది.

డబ్బును ఎలాగైనా సంపాదించి తద్వారా నాలో ఎప్పట్నుంచో అదిమిపెట్టి ఉంచిన కోరికల సెగలకి ఆజ్యం పోద్దామనుకున్నాను. అలాగే చేశాను కూడా! ఆలా విచ్చలవిడి తనంతో పేట్రేగి పోతున్న నా కళ్లకు మీ రూపం కనిపించి పిచ్చివాణ్ని చేసింది. సారీ..నేను జరిగింది యథావిధిగా చెబుతున్నాను కాబట్టి కొన్ని వివరాలు వినకూడనివిగా, పచ్చిగా అనిపించొచ్చు..అవి అప్పటి రోజుల్లోవి, ఈనాటి నేను కాల్చి పుటం పెట్టిన మేలిమి బంగారాన్ని. అంచేత మీరు వినొచ్చు. ఎంతవరకు వచ్చాం..ఆఁ, మీ రూపం పిచ్చివాణ్ని చేసింది. నేను అప్పటిదాకా పొందిన సుఖం ఒక ఎత్తు, మిమ్మల్ని పొందడం ఒక ఎత్తుగా అనిపించింది. ఇహ నా కాన్సంట్రేషన్ మీరయ్యారు. తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేశాను, ఎలా దగ్గరయ్యానన్నది మీకు తెలిసిందే!

సరే, మీరు హోటల్ రూముకొచ్చి వెళ్లిపోయాక.. మీకిచ్చిన మాట ప్రకారం నేను ఊరు వదిలేశాను. అటు తర్వాత నాలో ఏదో చెప్పలేని మార్పు, ఏవిటో అర్థమయ్యేది కాదు. నాకు మీ రూపం పదే పదే గుర్తొచ్చేది, అయితే నా లోని వికారాన్ని రెచ్చగొట్టేదిగా కాదు. ముందు మీరు కనిపించి గుళ్లోని అమ్మవారి రూపం సంతరించుకుని అంతర్ధానమయ్యేవారు. అలాగే మీ రూపం మనసులో మెదిలి మా అమ్మ రూపంపొంది మాయమయ్యేవారు. లోకంలోని సుఖాల పట్ల వ్యామోహం సన్నగిల్లింది. అన్ని ఊళ్లు తిరిగి కోనేట్లలో మునిగి దైవ దర్శనాలు చేసుకున్నాను. అప్పుడు..అప్పుడు నాలోని భావ ఉద్విగ్నత తగ్గి మనసు ప్రశాంత సరోవరంగా రూపాంతరం చెందింది.

మనిషిని సుఖాల వెంట పరుగులు తీయించే డబ్బు ముఖ్యం కాదు. ప్రశాంతమైన మనసు ముఖ్యం అన్నది అనుభవం లోకి వచ్చింది. ప్రశాంతమైన మనసు ఉన్న మనిషికి తనున్నదే స్వర్గం. మన పెద్దవాళ్లు ఏవైనా ఊర్కే చెప్పలేదు. మనమే పెడచెవిన పెడతాం. ఉదాహరణకి భాగ్యం అంటే నిఘంటువు ప్రకారం అదృష్టము, ధనము. 'ఆరోగ్యమే మహా భాగ్యం' అన్నది లోకోక్తి. ఆరోగ్యం ఏరకంగా అదృష్టం, ధనం అవుతుంది? అంటే ఆరోగ్యంగా ఉండడం అన్నది పూర్వ జన్మ సుకృతమే! అదృష్టమే!! జీన్స్ పరంగా మనకు వారసత్వంగా కొన్ని వ్యాధులు సంక్రమిస్తున్నాయంటే..అందుకు కారణమేమిటి? మనం వ్యాధిగ్రస్థుల ఇంట్లో పుట్టడం కేవలం యాదృచ్ఛికం కాదు. అలాగే ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తన ఏకాగ్రతని చేసే పని మీద లగ్నం చేస్తాడు. పనిలో నిష్ణాతుడై..మంచి పేరు తెచ్చుకుని డబ్బు గడిస్తాడు. వ్యాధి పీడితుడు ఈ లోకంలో నరకం అనుభవించే బాధితుడన్నది నిర్వివాదాంశం. సరే అదలా ఉంచితే, నేను దారి తెన్నూ లేక కొంతకాలం తిరిగానన్నాను కదా! అలా తిరుగుతున్నప్పుడు ఎన్నో జీవితాలని దగ్గరగా చూశాను. చాలా దగ్గరగా చూశాను. బుద్ధుడిలా అన్నమాట! నాలో ఏదో తెలియని మార్పు.


ఈ లోకంలో అందరూ కష్టాలు పడరు..అలాగే అందరూ సుఖంగానూ ఉండరు. ఇదో కలగూరగంప. ఇది ఎందుకిలా ఉంది. ఎందుకంటే కష్టాల్లో..బాధల్లో ఉన్నవారిని ఊరడించి..సాంత్వన చేకూర్చే వాళ్లు కొంతమంది ఉండాలి కాబట్టి. మన సంప్రదాయంలో ధన సంపాదనతో పాటు దానానికి సరైన..నిజం చెప్పాలంటే ఎంతో ఎక్కువ విలువనిచ్చారు. భూరి దానాలు చేస్తే స్వర్గం పాదాక్రాంతమవుతుందని ప్రవచనాలుగా చెవినిల్లు కట్టుకుని చెప్పారు. దానర్థం కష్టాల్లో ఉన్నవారిని ఉన్నంతల్లో ఆదుకోమని. అలా ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ఒకరికొకరు సహకరించుకోడమే సమాజ ఉద్దేశం.

నేనిదంతా ఎందుకు చెబుతున్నానంటే..నాలో ఎంతగా మార్పు వచ్చిందని మీకు తెలియజేయటానికి. మనసు ప్రక్షాళితమైతే మానవుడు సాక్షాత్తు భగవంతుడే. నేను ఆ దిశగా అడుగులేస్తున్న వాణ్ని.

ఒకరోజు టీ వీలో వస్తున్న మీమీది కార్యక్రమం చూశాను. అది కూడా కేవలం యాదృచ్ఛికం కాదు. తర్వాత నా మనసు మనసులో లేదు. ఈ ఊరొచ్చి, మీవారు మిమ్మల్ని ఇంట్లోంచి పంపేయడం, ఆయన మళ్లీ పెళ్లి చేసుకుని మిమ్మల్ని శాశ్వతంగా మర్చిపోవడం అన్నీ తెలుసుకున్నాను. మనసంతా వికలం అయిపోయింది. మీ ఆయనది ఒకప్పటి నా స్థితి. అదోగతి.

సరె సరె..ఇప్పుడూ నేను ఇక్కడికి వచ్చి మిమ్మల్ని కలవడానికి ఒక కారణం ఉంది...

కాత్యాయని, హేమలు అతనివైపు చూస్తున్నారే గాని వారి మనసుల్లో ఏవేవో ఆలోచనలు.




"ఈ ఊరు.. మీరు నన్ను మార్చారు. మనిషిని చేశారు. అందుకే ఈ ఊరి శివారులో కొన్ని ఎకరాల స్థలం తీసుకున్నాను. అందులో నిరాదరణకు గురైన వృద్ధుల కోసం, అనాథ పిల్లల కోసం, శక్తి ఉండి మరో దారి తెలియక అడుక్కుంటున్న వాళ్ల కోసం ఆశ్రమం కడుతున్నాను. కొంత వరకు పూర్తయ్యింది. స్త్రీ అంటే తల్లి. ఆమె కుండే ఓరిమి శక్తి, పనిచేసే నైపుణ్యత పురుషుడికి రమ్మన్నా రాదు. కాత్యాయని గారూ మీరు మరో పెళ్లి చేసుకోలేరు. ఎవరు కాదన్నా మీ పండంటి జీవితం పగిలిపోడానికి నేనే కారణం. అందుచేత ఆశ్రమ నిర్వహణ బాధ్యత మీకు అప్పగిస్తాను. ఫండింగ్ అంతా నేను చూసుకుంటాను. ఆశ్రమంలో ఉన్న వాళ్లని

కంటిపాపల్లా కనిపెట్టుకుని ఉండడమే మీ పని. మీ మీద నేను ఆ బాధ్యత పెడదామనుకున్నపుడు..నా మనసు ప్రశాంతతనందింది. ఇది ఖచ్చితంగా కాత్యాయని అమ్మవారి సంకల్పమే! నిర్ణయం మీమీదే ఆధారపడి ఉంది." అంటూ ముగించాడు.

'కొంగు ముడితో.. అగ్ని చుట్టూ ఏడడుగులు తిరిగిన మొగుడు బయటకి గెంటేశాడు. తనకేమీ కాని ఒకతను తన వల్ల అతని మనసు పావన గంగైందని సమాజానికి సేవ చేద్దామని నడుంకట్టాడు. విధి చేసే వింత విన్యాసాలు అంతా ఇంతా కాదు.' కాత్యాయని మనసులో మనోహర్ పట్ల ఆరాధనా భావం.

'అమ్మాయిల వెంట పడి వేధించే ఆకతాయిలు. కట్టుకున్న భార్యను కడతేర్చే భర్తలున్నారని ఛానెల్లో తనెన్నో న్యూసులు కవర్ చేసింది. ఇవాళటి ఈ సంఘటన తన వృత్తిపర జీవితంలో ఓ విచిత్రం. కాత్యాయని నిజంగా అమ్మవారి అంశ. అందుకనే ఆమెకి ఆశ్రయమిచ్చేవారే కాని అపరాధం చేసేవారుండరు' మనసులో అనుకుంటూ కాత్యాయని వంక చూసింది హేమ. ఆమె కళ్లకి జరీ చీర, అలంకరణ, కిరీటం లేని అమ్మవారి ముఖం ఆమె ముఖంలో ద్యోతకమైంది. అప్రయత్నంగా మనసులో చేతులు జోడించింది.

'నేను ఆశ్రమ బాధ్యత తీసుకుంటానండి. అమ్మ నా జీవితానికో మార్గం చూపింది. రేపటి ఆశ్రమ వాసులంతా నా పిల్లలనేమో నాకు పిల్లలు కూడా కలగలేదు. అంతేకాదు, 'నన్ను అల్లారు ముద్దుగా పెంచిన నా తల్లిదండ్రుల పరిస్థితి ఎలాగన్న' దిగులు నన్ను బాధించేది. ఇప్పుడు వాళ్లను కూడా ఆశ్రమం లో ఉంచి ఇతోధిక సేవ చేసుకుంటాను. ఇలా చేస్తేనన్నా వచ్చే జన్మలో నా జీవితం ఒడిదుడుకులు లేకుండా ఉంటుందేమో! మనోహర్ గారూ మీలో నాకో అన్నయ్య, తండ్రి కనిపిస్తున్నారు. నా మేలు కోరుకునే మీరు భగవంతుడే! నాలో ఊపిరున్నంత కాలం ఆశ్రమాన్ని జాగ్రత్తగా, అందులోని వాళ్లని నాకు దేవుడిచ్చిన సంతానంగా చూసుకుంటాను" కన్నీళ్లతో అంది.

"చెప్పాను కదండీ, ఇది నాకు పునర్జన్మ అని. ఆశ్రమ పనులు వేగంగా జరుగుతున్నాయి. మీరు రేపటి నుంచి దగ్గరుండి చూసుకోవచ్చు"అన్నాడు.

'మీ ఇద్దరి సంబంధం దైవికం. మీరు ఒకరినొకరు 'గారూ..'అనే తోకని తీసేసి ఆప్యాయంగా మాట్లాడుకుంటే బాగుంటుందని నా ఉద్దేశం'

'అలాగే హేమ గారూ..ఇదిగో ఆశ్రమం చిరునామా ఉన్న కాగితం. మీరు కాత్యాయనిని అక్కడికి ఎప్పుడైనా తీసుకురావచ్చు. ఆవిడకు చక్కని సౌకర్యావంతమైన రెండు గదులు ఉన్నాయి"అన్నాడు.

"అంటే నేను మీకేమీ కానా అన్నయ్యా, 'గారూ..' తీసేసి నన్నూ చెల్లెమ్మా అనే అను కాత్యాయని నాకు దేవుడు.. కాదు కాదు దేవత ఇచ్చిన సోదరి'అంది ఆప్యాయంగా కాత్యాయని చుట్టూ చేతులేసి.

అతను 'అలాగేనమ్మా..'అంటూ వెళ్లిపోయాడు.

ఇద్దరూ కాసేపలాగే ఉండిపోయారు.

తర్వాత తేరుకున్న కాత్యాయని 'పద హేమా అమ్మానాన్నలకి ఈ విషయం చెబుదాం'అంటూ ఆమెని బయల్దేరదీసింది.

ఇద్దరూ ఇంటికెళ్లారు.సోమయాజులుగారికి, వరాలమ్మకి ఛానల్ ఆఫీసులో జరిగిన సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పింది హేమ.

"నాకు తెలుసమ్మా, కాత్యాయని గుళ్లోని ఆ తల్లేనని. మమ్మల్ని ఉద్ధరించడానికి కొన్నాళ్లు మా ఇంట్లో ఆశ్రయం పొందిందంతే! నీ జీవితం ఇహ ఒక గాడిన పడ్డట్టేనమ్మా..చిరంజీవ'అని ఆశీర్వదించాడాయన. వరాలమ్మకూడా మురిసిపోయింది.'అమ్మా, మాకు పిల్లల్లేరని తెలుసుగా ఈ గుడిని చూసుకోలేని వార్ధక్యం వచ్చినప్పుడు మీ ఆశ్రమంలో మాకింత చోటియ్యమ్మా, నీ సన్నిధిలో కృష్ణా, రామా అనుకుంటూ కాలంగడిపి ప్రాణాలొదిలేస్తాం' అని సోమయాజులుగారనగానే అందరి కళ్ళు సజలాలయ్యాయి.

'కాత్యాయనీ, రేపు నువ్వు ఎనిమిందింటికి సిద్ధంగా ఉండు. మనిద్దరం ఆ ఆశ్రమానికి వెళ్లి ఎలా ఉందో చూసొద్దాం. నేనూ దాని గురించిన విషయాలు, విశేషాలూ కవర్ చేసుకుంటాను' అంది హేమ.

అలాగే అన్నట్టు తలూపింది కాత్యాయని.




సుమారు ఇరవై ఎకరాల్లో రూపు దిద్దుకుంటున్న ఆశ్రమం అది. పేరు 'జగజ్జనని ఆశ్రమం'.

అమ్మలగన్న అమ్మ పర్యాయపదం జగజ్జనని. అంటే తల్లులకే తల్లి అని. ఆవిడకు తప్ప అందర్నీ చల్లగా కాచుకునే శక్తి ఇంకెవరికుంటుంది? హేమకు ఆ పేరులో కాత్యాయని పేరు అంతర్లీనంగా గోచరించింది.

గేటు దగ్గర సెక్యూరిటీ గది ఉంది. హేమ తనను తను సెక్యూరిటీ అతనికి పరిచయం చేసుకుని తనూ కాత్యాయని ఆశ్రమం చూద్దామని వచ్చామని చెప్పంగానే, అతను కాత్యాయనివైపు వేగంగా కదిలి 'అమ్మగారూ నా పేరు భీం ..మీరెప్పుడైనా ఆశ్రమాన్ని చూడడానికి వస్తారని దగ్గరుండి జాగ్రత్తగా మీకు చూపించమని మనోహర్ అయ్యగారు చెప్పారండి'అని భయభక్తులతో చెప్పి, గేటుకు తాళం వేసి లోపలి నుంచి గొడుగు తెచ్చి ఆమె కి పట్టాడు.

అదంతా చూసిన హేమకు ఆశ్చర్యం కలిగింది. కేవలం మనోహర్ నాలుగు మాటల్లో కాత్యాయని గురించి భీంకి చెబితే వచ్చే గౌరవభావం కాదు అది. మన మధ్య కదిలే ఒక దేవత గురించి శ్రద్ధా భక్తులతో చెబితే కలిగే అత్యున్నత భావన అది.

కాత్యాయని తనకు గొడుగు వద్దని సున్నితంగా దాన్ని మూయించేసింది. లోపలికి వెళ్లాక భీం అక్కడి వాళ్లకి ఎలా ఇన్ఫర్మేషన్ ఇచ్చాడోగాని, ఆమె వెళ్లే సరికి పళ్లెంలో పసుపు, కుంకం, పూలు, అగరొత్తులు, హారతి తీసుకుని సిద్ధంగా ఉన్నారు పిల్లల నిరాదరణకు గురైన వృద్ధ పుణిస్త్రీలు. కాత్యాయనికి, హేమకు బొట్టుపెట్టి కాళ్లకు పసుపు రాసి, హారతిచ్చి లోపలికి తీసుకెళ్లారు.

అనాథ వృద్ధులకు, వికలాంగులకు, అనాథ పిల్లలకు ఉన్న వివిధ విభాగాలను చూపించింది ఒకావిడ. అక్కడున్న అందరూ 'అమ్మా, నాన్నా, అక్కా, అన్నా..' అంటూ కుటుంబ సభ్యులుగా పిలుచుకోవడం గమనించింది హేమ. అందరూ కుటుంబసభ్యులుగా కలసి మెలసి ఉంటే ఆశ్రమం ఆనంద నిలయమే! పైగా ఎవరూ తాము అనాథలమన్న బాధావీచికలున్న ముఖాలతో కనిపించడం లేదు.

బయట పూలు పళ్ల మొక్కలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా చూసుకుంటున్న ఆనవాలు కనిపించాయి. తన దగ్గరున్న కెమెరాతో ఆ ఆశ్రమాన్ని, విలువలతో నడుస్తున్న వైనాన్ని చెబుతూ, అక్కడివాళ్లని ఇంటర్వ్యూ చేసింది హేమ.సాయంత్రం దాకా అక్కడే గడిపి చీకటి పడే లోపల శివారు నుంచి సిటీకి చేరాలి కాబట్టి వాళ్లిద్దరూ బయల్దేరారు.

***

సోమయాజులుగారింటికి చేరాక ఇద్దరూ అక్కడి విషయాలన్నీ ఆయనకు విపులంగా చెప్పారు.

కాత్యాయని తన తండ్రికి ఫోన్ చేసి అన్నాళ్లుగా జరిగిన సంఘటనలన్నీ ఒక్కటొక్కటిగా ఆయనకు వివరించింది. తన కూతురు జీవితం ప్రశాంతతని పొందబోతున్నందుకు ఆయనకు కలిగిన ఆనందం అంతైంత కాదు. అప్రయత్నంగా దేవుళ్ల గది వైపుగా తిరిగి మసకబారిన కళ్లతో దణ్ణం పెట్టుకున్నాడు. భార్యకు కూడ విషయాలు వివరించి చెప్పాడు. కూతుర్ని అప్పటికప్పుడు చూడాలన్న కాంక్ష బలంగా కలిగింది ఆవిడకి.

***


ఆశ్రమం గురించిన ప్రత్యేక కథనం టెలికాస్ట్ అయింది.

అందరూ విపరీతంగా స్పందించారు. విరాళాలందించారు.

‘మీడియా తల్చుకుంటే సాధించలేనిది ఉండదమ్మా. నేను చిన్న దీపాన్ని వెలిగిద్దామనుకున్నాను. నువ్వు అఖండ దీపం చేశావు’ అన్నాడు మనోహర్.

***

ఆరోజు కాత్యాయని సోమయాజులుగారింటి నుంచి ఆశ్రమానికి తరలి వెళ్లిపోయే రోజు-




అమ్మా సొంత కూతురు మమ్మల్ని వదిలి వెళుతున్నంత బాధ మా మనసులను మెలిపెట్టేస్తోంది. మేమా పెద్దవాళ్లమయిపోయాం. ఇంకా ఎంతకాలం ఉంటాం. మాకెందుకో నువ్వు మా ఇంటికి వచ్చినప్పటి నుంచి, మా తర్వాత నువ్వేమయిపోతావా? అని మదనపడిపోయేవాళ్లం. ఈ రోజు అమ్మవారు నీకో మంచి దారి చూపించింది. పూజారిగా నేను జనుల మంచి కోరుతూ పూజలు మాత్రమే చేస్తాను. కాని నువ్వు సేవ చేస్తావు. నువ్వు బంగారు తల్లివి. దేవతవు" అన్నాడు సోమయాజులుగారు డగ్గుత్తికతో.

"అవునమ్మా, నా కడుపున పుట్టకపోయినా, నువ్వు అంతకంటే ఎక్కువ. ఈ తల్లిని మర్చిపోవుగా"అంది బేలగా.

"లేదమ్మా..లేదు. నేను దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు మీరు నాకు పెద్ద దిక్కయ్యారు. మిమ్మల్ని మర్చిపోతే నాకు పుట్టగతులుండవు. మీకు దేవుడిచ్చిన కూతురొకతె ఉందని మర్చిపోకండి. నేనూ అప్పుడప్పుడూ చూసి వెళతాను. మీలో ఓపిక సన్నగిల్లి, పనులు చేసుకోవడానికి శరీరమ్ సహకరించకపోతే ఆశ్రమానికి వచ్చేయండి. అందరితో పాటే మనమూను"అంది.

సోమయాజులుగారి దంపతులు ఆమెకి పసుపు, కుంకుమ, గాజులు, చీర, ఓ బంగారు గొలుసూ పెట్టారు.

"ఎందుకమ్మా ఇవి" అని ఆమె వద్దని వెనక్కితోస్తుంటే.

"మా అమ్మ కదూ..కాదని మా మనసు నొప్పించకు తల్లీ" అన్నారు.

చేసేదేం లేక మెడలో గొలుసు వేసుకుని మిగతావి పాలిథీన్ సంచీలో సర్దుకుని ఆ పెద్దవాళ్ల కాళ్లకు దణ్ణం పెట్టి కారులో బయల్దేరింది.

***

ఆశ్రమంలోకి రయ్యిన దూసుకుపోయిన కారు, సరాసరి ఆమె గదికి కొద్ది దూరంలో ఆగింది. భీం పరిగెత్తుకు వచ్చి ఆమె చేతిలోని కవర్లు అందుకుని లోపలి దారి తీశాడు. అతని వెనకాలే కాత్యాయని తన గదిలోకి వెళ్లింది. ఆమెకి కావలసినవన్నీ ఉన్నాయక్కడ.

***

ఉదయం అయిదింటికి ఆశ్రమం నిద్రలేస్తుంది. కాలకృత్యాలనంతరం, స్నానం చేశాక- ఈశాన్యం వైపున ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి గుడిలో ఒక గంట భజన ఉంటుంది. ఆ తర్వాత అందరికీ పాలు పళ్ల అల్పాహారం పెడతారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక ఆడవాళ్లు వంట కార్యక్రమాల్లోకి, మగాళ్లు తమ శక్తికి అనుగుణంగా మొక్కల సంరక్షణో, లైబ్రరీ లోని పుస్తకాలు తుడవడమో, పెద్ద పెద్ద గిన్నెలు తోమి శుభ్రపరచడమో, తమకు వచ్చిన ఇష్టమైన హస్తకళలతో వివిధ వస్తువుల తయారీనో చేస్తారు.

మధ్యాహ్నం కమ్మటి భోజనం ఉంటుంది. అదయ్యాక కాసేపు కునుకు వేస్తారు. మళ్లీ సాయంత్రం స్నానాలయ్యాక గుడిలో సత్సంగం,

భజన ఉంటుంది. రాత్రి అల్పాహారం తిని, పాలో మజ్జిగో తాగి హాయిగా ఏ చీకూ చింతా లేకుండా పడుకుంటారు. కాత్యాయని అన్నీ శ్రద్ధగా గమనించింది.

***

నెలరోజులు గడిచిపోయాయి. ఈలోపులో నాలుగైదు సార్లు మాత్రమే వచ్చాడు మనోహర్. బయటే కాత్యాయనితో నాలుగు మాటలు మాట్లాడి వెళ్లిపోతాడు తప్ప ఆమె గదికి రాడు.అతని సంస్కారానికి ఆమె మనసులోనే జోహార్లర్పిస్తోంది. రాముడు రాముడుగా ఉంటే గొప్పేముంది? రావణుడు రాముడైతేనే ఉత్తమత్వం.

***

ఒకరోజు మనోహర్ తో ఆశ్రమంలోని పూల మొక్కల మధ్య తిరుగుతూండగా "కాత్యాయనిగారూ, ఎలా ఉంది ఆశ్రమ నిర్వహణ" అన్నాడు.

"పాపం, ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య. సమస్యలు బాల్యం నుంచి మధ్యవయసు వచ్చే వరకు ఫర్వాలేదు కాని, జవసత్వాలుడిగిపోయిన దశలో రావడం, మన అనుకున్న వాళ్ల నిరాదరణకు గురికావడం..పగవాడిక్కూడా ఇలాంటి జీవితం వద్దు బాబూ" అంది సాలోచనగా.

"మీరన్నది నిజమే కాత్యాయని. మనం దాదాపు మర్చిపోతున్న అతి ముఖ్యమైన పదం 'ఆసరా'. మీరన్నట్టు ఈ ప్రపంచంలో ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య నిజమే! కాని ఒకరికి మరొకరు ఆసరా ఇచ్చుకోవచ్చు. ఉదాహరణ కు కళ్లు లేనతనికి, మూగతను ఆసరా అవ్వొచ్చు. డబ్బు లేని వాళ్లకు డబ్బున్నవాళ్లు ఆసరాకావచ్చు. కాకపోతే మనసులో ఆ ఫీలింగ్ ఉండాలి. నాలో మార్పు రాబట్టే కదా, ఇంతమంది జీవితాలు తెరిపిన బడ్డాయి. ఇప్పుడు మీరొచ్చి కచ్చితంగా ఓ తల్లిలా వాళ్లకు సాంత్వన చేకూరుస్తారు" అన్నాడు.

కాత్యాయని కాసేపు మౌనం వహించిన తర్వత " మనోహర్ గారూ నాదో చిన్న కోరిక, మా అమ్మనాన్నలకు నేనొక్కతినే సంతానం. గంపెడంత ఆశతో నాకు పెళ్లి చేశారు. అది పెటాకులు అయింది. వాళ్లు వృద్ధులు. దయచేసి మీరు అంగీకరిస్తే వాళ్లను కూడా ఆశ్రమానికి ఆహ్వానిస్తాను. నాతో పాటూ వాళ్లూను" అంది.

"తప్పకుండా కాత్యాయని. మీరసలు నన్నడగవలసిన అవసరం లేదు. ఆశ్రమం విషయంలో మనిద్దరం ఒకటే. మీరు ఏ నిర్ణయం

తీసుకున్నా అది నాకు సమ్మతమే! రేపు ఉదయం ఎనిమిమిందింటికి కారు పంపిస్తాను. అందులో మీరు మీ అమ్మనాన్నల దగ్గరకెళ్లి వాళ్లను ఇక్కడికి సగౌరవంగా తీసుకు రండి." అన్నాడు.

కాత్యాయని అతని వంక కృతజ్ఞతా పుర్వకంగా చూసింది.

***

మరుసటిరోజు మనోహర్ అన్నట్టుగానే ఉదయం ఎనిమిదికి కారు పంపించాడు.

కాత్యాయని కారులో తన తల్లిదండ్రుల దగ్గరికి బయల్దేరింది.

తను ఇలా ఆశ్రమ నిర్వహణ చేపట్టినట్టు వాళ్లకు ఇంతవరకూ చెప్పలేదు. తన గురించి వాళ్ళేమనుకుంటున్నారో? అసలు ఇంతకాలానికి ఇదే వాళ్లను చూడడం. ఏరియా పెద్దగా ఏమీ మారలేదు. ఇల్లు దగ్గర పడుతున్నకొద్దీ మనసులో ఏదో తెలిని భావన.

ఇంటిముందు ఆగిన కారు నుంచి ఒక్క ఉదుటన దిగి, గేట్ తీసుకుని లోపలికి వెళ్లింది. మొక్కలన్నీ ఎండిపోయి ఉన్నాయి. గబ గబ ఇంటి దగ్గరకు చేరంగానే తలుపులకు వేళాడుతున్న తాళంకప్పను చూడంగానే ఆమె నిస్త్రాణగా అయిపోయింది. తను వాళ్లని కాంటాక్ట్ చేసి చాలాకాలమయింది. 'వాళ్లేమయిపోయారో..ఎక్కడికి పోయారో. అసలు వాళ్లకేమన్నా అయిందేమో?' ఆ ఆలోచన రాగానే నిలువెల్లా వణికిపోయింది.

కొద్దిసేపు అక్కడే నేల మీద చతికిలపడిపోయి, పాత జ్ఞాపకాలతో తల్లడిల్లిపోయింది. నెమ్మదిగా లేచి అడుగులో అడుగు వేసుకుంటూ గేటు దాకా వచ్చి బయటకు అడుగు వేసి గేటు మూసి మరొక్కసారి ఆ ఇంటిని చూసి బయటకు అడుగేసింది. సరిగ్గా అప్పుడే..ఓ పిల్లాడు చిన్న సైకిల్ తొక్కుకుంటూ వచ్చి..




ఆంటీ ఈ ఇంట్లో ఉండేవాళ్లు కావాలా" అన్నాడు.

కాత్యాయనికి ఒక్కసారిగా పోయిన ప్రాణాలు తిరిగొచ్చినట్టుగా అనిపించింది.

అతణ్ని పట్టుకుని ఉద్వేగంగా"అవున్నాన్నా..చెప్పవా?" అంది.

అయితే 'పద' అన్నాడు. ఆమె కార్ దగ్గరకు వెళ్లి, తనిప్పుడే వస్తానని డ్రైవర్ కు చెబుదామనుకుంది. అయితే ఆ పిల్లాడు "ఈ కార్ మీదేనా" అన్నాడు.

కాత్యాయని అవునన్నట్టుగా తలూపింది.

"అయితే నేను నా సైకిల్ కి లాక్ వేసి కార్లో వస్తాను. మనిద్దరం ఎంచక్కా కారులో వెళదాం. మళ్లీ నన్ను ఇక్కడికి తీసుకొచ్చి దింపాలి. అప్పుడు నేను సైకిల్ తీసుకుని ఇంటికెళతా"అన్నాడు.

కాత్యయని "సరే" అని ఆ అబ్బాయి సైకిల్ కు లాక్ వేసి రాగానే కార్లో ఎక్కించుకుంది. కార్ నాలుగైదు వీధులు తిరిగిన తర్వాత ఆ పిల్లాడు ఓ ఇంటి ముందు కారాపించి, ఇదే అన్నాడు. ఒకే ఒక్క రేకుల గది అది.'తన తల్లిదండ్రులు దాంట్లో ఉంటున్నారా?' ఆమె హృదయం ద్రవించి పోయింది. డ్రైవర్ తో ఆ పిల్లాణ్ని ఇందాకటి చోటులో దింపి రమ్మని పురమాయించి తలుపుతట్టింది.

యశోదమ్మ తలుపు తీసీతీయడంతోటే కూతుర్ని చూసి కళ్ల నీల్లు పెట్టుకుని "ఏమ్మా, మమ్మల్ని ఎందుకమ్మా దూరంగా ఉంచావు?"అని కౌగిలించుకుని బావురుమంది.

అది విని అచ్యుతరామయ్య "రామ్మా. కాత్యాయని"అని లోపలికి ఆహ్వానించి- అమ్మాయికి కాసిని మంచినీళ్లు ఇవ్వు యశోదా!"అన్నాడు.

ఆవిడ గబ గబ ప్లేట్లో ఫలహారం, గ్లాసుతో పాలు పట్టుకొచ్చింది.

అమ్మ చేతి ఫలహారం కొద్ది కొద్దిగా తింటూ, ఒకప్పటి మధురానుభూతులు నెమరేసుకుంటూ "హఠాత్తుగా, అమ్మా మన ఇంటికి వెళ్లి అక్కడ తలుపులకి వేళాడుతున్న తాళం కప్పను చూసి గుండె ఆగిపోయిందనుకో! అయినా ఇంత దూరం ఉన్నా ఆ పిల్లాడు సరిగ్గా ఇక్కడికే ఎలా తెచ్చాడు నన్ను?"అడిగింది ఆశ్చర్యంగా.

"ఆ పిల్లాడే కాదమ్మా ఏ పిల్లాడు నిన్నక్కడ చూసినా ఇక్కడికి పట్టుకొచ్చేవాడు. ఈ ఏరియాలోని పిల్లలందరకూ ఏవో ఒకటి చేసి పెడుతుంటాను. అందుచేత మేమిద్దరం పిల్లలకి అమ్మమ్మా, తాతయ్యలం" అండావిడ.

"అవునూ మీరు ఈ ఇంట్లోకి ఎప్పుడొచ్చారు? ఎందుకొచ్చారు?"అంది యథాలాపంగా.

"ఆ ఇల్లు ఆనందరావుదని నీకు తెలుసు కదమ్మా! ఆయన తను మారీషస్ నుంచి ఇండియాకి వచ్చేస్తున్నానని, త్వరలో ఇల్లు ఖాళీచేస్తే పెద్ద బిల్డింగ్ కట్టుకుంటారట. అంతకాలం మనలని అక్కడ ఉండనియ్యడమే గొప్ప. అందుకనే ఖాళీ చేసేశాం. ఆయన తన స్థలాన్ని జాగ్రత్తగా కనిపెట్టుకుని కాపాడినందుకు డబ్బియ్యబోయాడు. నేనే 'మేము ఇన్నాళ్లు ఉచితంగానే ఉన్నాం కదండీ' అంటూ సున్నితంగా తిరస్కరించాను.

"ఇంటి ముందు మొక్కలన్నీ ఎండి పోయి కనిపించాయి నాన్నా..మనసు ఉసూరుమంది"అంది.

"ఇప్పుడు అది మన ఇల్లు కాదు కదమ్మా. అయినా రేపు అక్కడో బిల్డింగ్ ఏర్పడితే, అందులో మొక్కలూ తోటమాలి కూడా ఉంటారమ్మా"అన్నాడు ఆశావహ దృక్పథంతో. తర్వాత నెమ్మదిగా క్లుప్తంగా తన జీవితంలో చోటు చేసుకున్న మలుపులు..తనను ఆదరించిన సోమయాజులుగారు..హేమ పరిచయం..మనోహర్ కలవడం..మారిన అతని నైజం..ఆశ్రమం..దాని నిర్వహణను తనకివ్వడం అన్నీ చెప్పింది. అన్నీ విన్న సోమయాజులుగారు చిన్నగా నిట్టూర్చి.."భగవంతుడు ఎవరికీ అన్యాయం చెయ్యడమ్మా. అందులో అమ్మ..కాత్యాయనివి..నీకు అసలు అన్యాయం చెయ్యడు"అన్నాడు.

తర్వాత వాళ్లిద్దరినీ తనతో పాటూ ఆశ్రమానికి ఆహ్వానించింది.

"మీకు మగ పిల్లాడు లేదని చింతించవద్దు. ఈ వయసులోని..మీలాంటి వాళ్లని ఆదరించడానికే ఆ ఆశ్రమం. చేతనైనంతకాలం అందరికీ సేవ చేద్దురుగాని"అంది.

వాళ్లిద్దరూ 'సరే' అన్నారు.

***

అచ్యుతరామయ్యగారు, యశోదమ్మలు ఆశ్రమానికి వచ్చేశారు. అదో కుటుంబం. అక్కడి వాళ్లందరూ బయట ప్రపంచంలోని కుళ్లును, కుత్సితాలను చూసి వచ్చినవారు. అందుకే అక్కడ ఎవరూ అబద్ధాలాడరు. నిజాయితీగానే ఉంటారు. అక్కడి గుళ్లో జరిగే పూజల్లో, సత్సంగాల్లో శుద్ధమైన మనసులతో పాల్గొంటారు. తాము అనాథలైనా, వారానికోసారి బయట ఉన్న ఆస్పత్రికో, శరణాలయాలకో వెళ్లి సేవ చేస్తారు. వాళ్లతో మమేకమైన తన జీవితాన్ని తలచుకుంటే కాత్యాయనికి ఎంతో తృప్తి కలుగుతుంది. సమాజంలో చాలామంది తమకోసం తాము బతుకుతారు. కొంతమంది, తమ జీవితంలో పావుభాగాన్ని సేవాకార్యక్రమాలకోసం వినియోగిస్తారు. కాని తమ జీవితాలను నిస్వార్థంగా దీనజనోద్ధరణ కోసం ఉపయోగించేవాళ్లు చాలా చాలా తక్కువగా ఉంటారు. వాళ్లు మానవుల్లో మహనీయులు.

దేవుళ్లందరూ మనుషుల కోసమే! మనుషుల్లో కొంతమంది దేవుళ్లై అందరి కోసం తాపత్రయపడుతుంటారు. దుష్టుడైన మనోహర్ లో మార్పు వచ్చి, ఆశ్రమ నిర్మాణానికి పూనుకుంటే, మంచివాడైన కమలాకర్ రాక్షసుడయ్యాడు. ఓ అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ

మృత్యోర్మామృతాం గమయ!

అవాస్తవ స్థితి నుంచి వాస్తవిక స్థితికి నన్ను తోడ్కొని వెళ్లుదువుగాకా! అజ్ఞానాంధకారం నుంచి జ్యోతిస్స్వరూపానికి నన్ను తోడ్కొని పోదువుగాక! మరణం నుంచి మరణరహిత (అమర) స్థితికి నన్ను తీసుకుపోదువుగాక!

గుడిలో జరుగుతున్న సత్సంగంలో ఎవరో మైకులో చెబుతున్నారు.

కాత్యాయని అమ్మవారి అవతారం. అప్పట్లో రాక్షసుల కుత్తుకలు తెగ నరికితే, ఈనాడు వాళ్లలో మార్పు తీసుకువచ్చి సమాజ వికాసానికి పురిగొలుపుతుంది. అందర్నీ అక్కున చేర్చుకుంటుంది.